

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 275

సోమవారం 26-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అయ్యర్, అశ్విన్ అదుర్స్

రెండో టెస్టులోనూ బంగ్లాపై భారత్ ఘన విజయం. 2–0తో సిరీస్ సొంతం -12లో



ఈ–రూపీ.. సంగతేంటి?

డిజిటల్ రూపీ పనితీరు, చెల్లింపులు ఇతర సందేహాలపై ప్రత్యేక కథనం -13లో



ప్రొటోకాల్స్ పాటించండి..!

కరోనా బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ప్రధాని మోదీ కోరారు.

వివరాలు 6లో ▸



కరోనా కేసుల వెల్లడికి చైనా నో

చైనాలో రోజువారీ కరోనా కేసుల వివరాలను ఆదివారం నుంచి వెల్లడించడం లేదని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ తెలిపింది.

వివరాలు 6లో ▸



తాగుబోతులకు పిల్లనివ్వొద్దు

'మీ తోబుట్టువులు, కూతుళ్లను తాగుడు అలవాటున్న అబ్బాయిలకిచ్చి పెళ్లి చేయొద్దు' అని కేంద్రమంత్రి కౌశల్ కిషోర్ అన్నారు.

వివరాలు 6లో ▸



మెరుపులు - మరకలు

కొన్ని విజయాలు.. మరికొన్ని వివాదాలు.. ఎంతో ఇష్టం, కొంచెం కష్టంగా సాగిన 2022లో ముఖ్య సంఘటనల అవలోకనం.

వివరాలు 6లో ▸

సచివాలయ సిబ్బంది, అధికారుల హాజరు సంతృప్తికరంగా లేదు



- ప్రతి శాఖలో ఓపీ ఇన్‌చార్జి మధ్యాహ్నం 2 గంటల్లోపు సిబ్బంది హాజరు ఏకీకృతం చేయాలి
- సంబంధిత కార్యదర్శికి సమర్పించాలి.. సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి
- మెమో జారీచేసిన సాధారణ పరిపాలన శాఖ

2లో

పెట్టుబడుల్లో ఫస్ట్

తొమ్మిది నెలల్లో రూ.44,286 కోట్ల పెట్టుబడులు సాకారం

- దేశవ్యాప్తంగా వచ్చిన వాటిల్లో 20 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే
- ఆ తర్వాత స్థానాల్లో ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్
- యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించడంతో ఏపీలో 70వేల మందికి ఉపాధి
- కొత్తగా మరో రూ.13,516 కోట్ల పెట్టుబడులను ఆకర్షించిన ఏపీ
- 2020 నుంచి రూ.64,476 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభం
- కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడి
- పరిశ్రమలకు సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- మూడున్నరేళ్లల్లో 1,08,206 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటు, రూ.20,537.28 కోట్ల పెట్టుబడులు.. 10 లక్షల మందికిపైగా ఉపాధి
- వచ్చే రెండు నెలల్లో మరో 20 భారీ ప్రాజెక్టుల శంకుస్థాపనకు సన్నద్ధం



సాక్షి, అమరావతి: ప్రచార ఆర్భాటాలు, దుబారా ఖర్చులకు దూరంగా ఉంటూ పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పించి పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తేవడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఏపీలో రూ.44,286 కోట్ల విలువైన పెట్టుబడులు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా వాస్తవ రూపంలోకి వచ్చినట్లు కేంద్ర వాణిజ్య శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజా గణాంకాల్లో వెల్లడించింది. వీటి ద్వారా మొత్తం 70,000 మంది ఉపాధి పొందుతున్నట్లు అంచనా వేస్తున్నారు. గత జనవరి నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో దేశవ్యాప్తంగా రూ.1,99,399 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రాగా ఇందులో 20 శాతం పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్ వరుసగా తరువాత స్థానాల్లో ఉన్నాయి.

2020 నుంచి 129 యూనిట్లలో ఉత్పత్తి

రాష్ట్రంలో ఈ ఏడాది ఉత్పత్తిని ప్రారంభించిన ప్రముఖ కంపెనీల్లో ఏటీజీ టైర్స్, నాట్కో ఫార్మా, గ్రీన్‌కో సోలార్, ఇసుజు, ఇండస్ కాఫీ, రుచి సోయా, సెంబ్‌కార్ప్, కోరమాండల్, ప్రీమియం ఎలక్ట్రిక్, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్, విష్ణు బేరియం

మిగతా 2వ పేజీలో ▶

పులివెందుల సీఎస్‌ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



పులివెందులలో సీఎం క్రిస్మస్ వేడుకలు

సీఎస్‌ఐ చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు


- కేక్ కట్ చేసి, క్యాలెండర్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వానికి దేవుడి కృప..
- ప్రజలందరిలోనూ ఈ పండుగ ఆనందం నింపాలని ఆకాంక్ష

సాక్షి ప్రతినిధి, కడప: క్రిస్మస్ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్‌ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మూడో రోజు జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం ఇడుపులపాయ ఎస్టేట్ నుంచి బయలుదేరి ఉదయం 9 గంటలకు చర్చి వద్దకు చేరుకున్నారు. చర్చి పాస్టర్ పండుగ సందేశాన్ని స్వీకరించిన అనంతరం కుటుంబ సభ్యుల మధ్య క్రిస్మస్ కేకును కట్ చేశారు. చర్చి అసోసియేషన్

మిగతా 2వ పేజీలో ▶

చలపతిరావు కన్నుమూత

గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సీనియర్ నటుడు



- కొంతకాలంగా అనారోగ్య సమస్యలు
- నివాళులర్పించిన పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు
- కుమార్తెలు అమెరికా నుంచి వచ్చాక బుధవారం అంత్యక్రియలు
- ఎన్టీఆర్ స్ఫూర్తితో సినిమాల్లోకి..

11లో

'గూఢచారి 116'తో తెరంగేట్రం.. సుమారు 1,200 చిత్రాల్లో విలక్షణ పాత్రలు

రెవెన్యూలో 'ఈ–ఫైల్స్'



- కలెక్టరేట్ల నుంచి సీసీఎల్‌ఏకి వచ్చే ముఖ్యమైన ఫైల్స్‌ను ఈ విధానంలోనే పంపేలా ఏర్పాట్లు
- కలెక్టరేట్ల ఈ–ఆఫీస్ లాగిన్ నుంచి నేరుగా సీసీఎల్‌ఏ ఇన్‌బాక్స్‌కి పంపాలి
- ఈ–ఫైల్స్‌గా విజిలెన్స్, మెడికల్ బిల్స్, సెలవులు, భూకేటాయింపుల అంశాలు
- ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం నివారణకు సీసీఎల్‌ఏ మార్గదర్శకాలు

3లో

వినోదం @ శిల్పారామాలు

రాష్ట్రవ్యాప్తంగా 8 శిల్పారామాల అభివృద్ధికి టెండర్లు



- అమ్యూజ్‌మెంట్ పార్క్, స్నో వరల్డ్, స్విమ్మింగ్‌పూల్, వెల్‌నెస్ సెంటర్, రెసిడెన్షియల్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ హాల్స్ నిర్మాణం
- 11 చోట్ల అర్బన్ హట్స్, క్రాఫ్ట్ మ్యూజియాల ఏర్పాటుకు చర్యలు

3లో

తెలంగాణ

మెదక్ సీఎస్ఐ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు
- దైవసందేశమిచ్చిన రెవరెండ్ బిషప్ సాల్మన్‌రాజ్



క్రిస్మస్ వేడుకలకు భారీగా హాజరైన జనం

మెదక్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణలోని మెదక్ సీఎస్ఐ చర్చిలో ఘనంగా ప్రార్థనలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారు జామున 4.30 గంటలకు మొదటి ఆరాధనతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రెవరెండ్ బిషప్ సాల్మన్‌రాజ్ భక్తులకు దైవ సందేశం అందించి.. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు జననం మానవాళి అంతటికీ శుభదినం అన్నారు. భక్తులు ఏసు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు భక్తులకు చర్చి దర్శనానికి అనుమతిచ్చారు. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులను ఆశీర్వదించేందుకు 15 మంది గురువులను అందుబాటులో ఉంచామని రెండో ఆరాధనలో దైవ సందేశమిచ్చిన చర్చి ప్రెసిబిటరీ ఇన్‌చార్జ్ జార్జ్ ఎబనైజర్‌రాజ్ తెలిపారు. ఈ ఉత్సవాలకు డయాసిస్ పరిధిలోని 13 జిల్లాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. చర్చిలో ఆలపించిన భక్తిగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కొత్త వేరియంట్ ప్రభావం భారత్‌పై తక్కువే

సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి

సాక్షి, హైదరాబాద్: చైనాను వణికిస్తున్న కరోనా వైరస్ భారత్‌లో అంతగా ప్రభావం చూపే అవకాశం లేదని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ వినయ్ నందికూరి స్పష్టం చేశారు. భారతీయులకు ఇప్పటికే మూక రోగనిరోధకత వచ్చి ఉండటం ఇందుకు కారణం అని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. ఐతే ఈ వైరస్ రోగ నిరోధక వ్యవస్థను తప్పించుకునే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు కొనసాగించడం అవసరమని తెలిపారు. అంతేకాకుండా గతంలో ఒమిక్రాన్ బారినపడిన వారిలో కొందరికి బీఎఫ్–7 సోకే అవకాశం ఉంటుందని అన్నారు. డెల్టా వైరస్‌ను ఎదుర్కొన్న తరువాత దేశంలో వాక్సినేషన్ జరిగిందని, ఆ తరువాత ఒమిక్రాన్ వైరస్ వచ్చినప్పుడు బూస్టర్ డోసులు వేసుకున్న కారణంగా భారతీయులు ఇతరులకంటే మెరుగైన రోగ నిరోధక శక్తితో ఉన్నారని అయన వివరించారు. అందుకే చైనా లాంటి పరిస్థితులకు ఇక్కడ అవకాశం ఉండదని వివరించారు.

క్లుప్తంగా...

విశాఖ జిల్లాలో పాజిటివ్ కేసు నమోదు

సాక్షి, అమరావతి: ఏపీలో గడిచిన 24 గంటల్లో (శనివారం ఉదయం 9 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు) 2,603 నమూనాలను పరీక్షించగా విశాఖ జిల్లాలో ఓ పాజిటివ్ కేసు నమోదైంది. ఏపీలో పాజిటివ్ రేట్ 0.03 శాతంగా ఉంది. వైరస్ ప్రభావంతో ఒక్క మరణం సంభవించలేదు. తొలి వేవ్ నుంచి వైద్య శాఖ ఇప్పటివరకు ఏపీలో 3,39,65,549 నమూనాలను పరీక్షించింది.

సీడబ్ల్యూసీ చైర్మన్‌గా కుశ్వీందర్ వోరా

సాక్షి, అమరావతి: కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా వాటర్ ప్లానింగ్, ప్రాజెక్ట్ విభాగ సభ్యుడైన కుశ్వీందర్ వోరాను కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్ కుమార్ నియమించారు. జనవరి 1న సీడబ్ల్యూసీ చైర్మన్‌గా వోరా బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుత సీడబ్ల్యూసీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు.

ఇదండీ సంగతి



అయితే.. ఓసారి నా జాతకం చూసి నాకు ప్రధాని యోగం ఉందేమో చెప్పండి సార్!



విజయవాడ తారాపేటలో సెయింట్ పీటర్స్ కెథెడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



రాజమహేంద్రవరం లూథరన్ చర్చిలో క్రైస్తవ విశ్వాసులు

రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్

- నయనానందకరంగా క్రీస్తు జనన దృశ్యాలు
- ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు
- క్రీస్తు మార్గంలో పయనించాలని గురువుల పిలుపు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కర్నూలు సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆదివారం క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచే ప్రముఖ చర్చిల్లో ఏసు క్రీస్తు జనన దృశ్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి కేకులు కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఫాదర్లు పండుగ సందేశాన్ని వివరించారు. విజయవాడలోని గుణదల మేరి మాత పుణ్యక్షేత్రంలో రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు నడిచిన మార్గంలో పయనించాలని గుంటూరు జిల్లా మేత్రాసన గురువులు చిన్నాబత్తిన భాగ్యయ్య పిలుపునిచ్చారు. భక్తి గీతాలాపనలు, క్రిస్మస్ సందేశాలు, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో బాల ఏసు నగరోత్సవం ఆద్యంతం పలు ప్రాంతాల్లో కన్నుల పండువగా సాగింది. ఏసు జనన నాటిక, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వేడుకల్లో పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు విశ్వమానవ సహోదరత్వానికి దోహదం
గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, అమరావతి : శాంతి, కరుణ, సహనం, ప్రేమలను ప్రపంచానికి చాటిన ఏసుక్రీస్తు బోధనలు విశ్వమానవ సహోదరత్వానికి దోహదం చేస్తాయని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. రాజ్ భవన్ దర్బార్ హాలులో ఆదివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవీయ విలువలు మృగ్యమైపోతున్న నేటి కాలంలో క్రీస్తు బోధనలు ఆచరణీయం అన్నారు. మనల్ని ద్వేషించే వారిని కూడా ప్రేమించడమే నిజమైన సంతోషమన్నారు. శాంతి, స్వేచ్ఛ, ఆనందానికి ఏకైక మార్గం ప్రేమ మాత్రమేనని.. ద్వేషాన్ని ప్రేమతో, కోపాన్ని దయతో భర్తీ చేసినప్పుడు జీవితంలో మరింత శాంతిని పొందగలుగుతారని వివరించారు. బిషప్ రాజారావు సందేశం ఇచ్చారు. అనంతరం మత పెద్దలు పాకలపాటి ప్రభాకర్, మట్టా జయకర్, ఎబినేజర్ తదితరులు గవర్నర్‌ను ఘనంగా సన్మానించారు. వారికి గవర్నర్.. మదర్ థెరిస్సా మెమొంటోలను బహూకరించారు.

సీఎం జగన్‌కు ప్రవాసాంధ్రుల శుభాకాంక్షలు

సెయింట్ లూయిస్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును సెయింట్ లూయిస్ నగరంలో ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సున్నా డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పటికీ వైఎస్ జగన్ అభిమానులు స్థానిక మహాత్మా గాంధీ సెంటర్‌కు చేరుకుని, కేక్‌కట్ చేసి జననేతకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించిన హాలును టార్గెట్–175 పోస్టర్లతో అలంకరించారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎంగా మళ్లీ జగన్ గెలుపొందాలని ఆకాంక్షించారు. తిరు అల్లం, సాయికృష్ణలు సీఎం జగన్‌పై పాటను రాసి ఆలపించారు. ఈ కార్యక్రమంలో పమ్మి సుబ్బారెడ్డి, నవీన్ గూడవల్లి, ఆర్కే దగ్గుమాటి, వెంకట్ గొని, రంగ సురేష్, గోపాల్ తాటిపర్తి, సుబ్బారెడ్డి తాటిపర్తి, అమృత తరపరెడ్డి, చిల్లా కిరణ్, రమేష్ రాపోలు, మురళి, నవీన్ రెడ్డి, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ లూయిస్‌లో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ప్రవాసాంధ్రులు

సచివాలయ సిబ్బంది, అధికారుల హాజరు సంతృప్తికరంగా లేదు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయ సిబ్బంది, అధికారుల హాజరు ఏ మాత్రం సంతృప్తికరంగా లేదని సాధారణ పరిపాలన శాఖ పేర్కొంది. సమయపాలన పాటించమని అనేకసార్లు ఆదేశాలు జారీచేసినా ఫలితం ఉండటం లేదని పేర్కొంది. ఏపీ సచివాలయ ఆఫీస్ మాన్యువల్ నిబంధనల మేరకు కార్యాలయాలకు హాజరవడంలో సమయపాలన పాటించడం లేదని తెలిపింది. ఉద్యోగులకు సంబంధించి సమయపాలన నిర్ధారించే బాధ్యత సంబంధిత విభాగాలపై ఉంటుందని సాధారణ పరిపాలన శాఖ ఇటీవల అన్ని శాఖలకు జారీచేసిన మెమోలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో శాఖలోనే ఓపీ సెక్షన్ ఇన్‌చార్జి రోజూ మధ్యాహ్నం 2 గంటల్లోపు సిబ్బంది హాజరును ఏకీకృతం చేయాలని మెమోలో సూచించింది. ఆ ఫైలును అదేరోజు సంబంధిత కార్యదర్శికి సమర్పించాలని పేర్కొంది. సమయపాలన పాటించనివారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ కార్యదర్శికి సూచించింది. ప్రస్తుతం సచివాలయంలో వారానికి ఐదురోజుల పనిదినాల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం5.30 గంటల వరకు అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాల్లో ఉండాల్సి ఉంది. అయితే సోమవారం, శుక్రవారాలైతే సిబ్బందితో పాటు అధికారులు సమయపాలన సంతృప్తికి చాలా దూరంగా ఉంది. ప్రస్తుతం ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సిబ్బంది, అధికారుల హాజరు నమోదు చేస్తుండగా చాలా ఆశ్చర్యకర అంశాలు వెల్లడవుతున్నాయి. ఉదయం 11 గంటలకు 70 నుంచి 75 శాతం ఉంటున్న సచివాలయ ఉద్యోగుల హాజరు సాయంత్రం 5 గంటలకు 40 నుంచి 45 శాతానికి మించి ఉండటం లేదు. ఈ నేపథ్యంలోనే సాధారణ పరిపాలన శాఖ మధ్యాహ్నం 2 గంటలకే హాజరు వివరాలను సంబంధిత శాఖ కార్యదర్శికి పంపాలని, సమయపాలన పాటించని ఉద్యోగులపై కార్యదర్శి తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

తనిఖీలు చేయాలని నిర్ణయించుకున్న సీఎస్

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, అధికారుల హాజరును పరిశీలించేందుకు ఆకస్మికంగా సందర్శించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారని సాధారణ పరిపాలన శాఖ జారీచేసిన మెమోలో తెలిపింది.

నేడు శ్రీశైలానికి రాష్ట్రపతి ముర్ము



శ్రీశైలం టెంపుల్/రసూల్‌పురా(హైదరాబాద్): : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం శ్రీశైలంలో పర్యటించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆమె హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సున్నిపెంటకు చేరుకుంటారు. అక్కడ ఆమెకు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఆమె సాక్షి గణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహానికి వచ్చి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తరువాత గంగాధర మండపం వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి శ్రీశైలాలయ ప్రధాన ద్వారం అయిన శ్రీకృష్ణరాయగోపురం వద్దకు వెళతారు. మల్లికార్జునస్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అక్కడ నుంచి శ్రీభ్రమరాంబాదేవి ఆలయం వద్ద భ్రమరాంబాదేవికి కుంకుమార్చన సేవ చేస్తారు. ఆలయంలోని అలంకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న అనంతరం గంగాధర మండపానికి వెళతారు. అక్కడ కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం ద్వారా నిర్మించిన సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్‌ను ప్రారంభించి పలు అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తారు. శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించి..హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

ఇప్పటి వరకు మల్లన్నను దర్శించుకున్న ముగ్గురు రాష్ట్రపతులు

స్వామి అమ్మవార్లను 1959లో తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. ఆ తరువాత శ్రీశైలానికి దర్శనార్థం 1977లో నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, అటు తరువాత రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ వచ్చారు. తాజాగా, మల్లన్నను రాష్ట్రపతి హోదాలో ముర్ము దర్శించుకోనున్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ కూడా ఆలయాన్ని అప్పట్లో దర్శించుకున్నారు.

రాష్ట్రపతి శీతాకాల విడిదికి ముస్తాబైన భాగ్యనగరి

శీతాకాల విడిదికి హైదరాబాద్ నగరానికి రానున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆతిథ్యమిచ్చేందుకు భాగ్యనగరం సిద్ధమైంది. రాష్ట్రపతి సోమవారం నగరానికి రానున్నారు. ఇందుకోసం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలం ఆలయాన్ని సందర్శించిన అనంతరం రాష్ట్రపతి ముర్ము హకీంపేట ఎయిర్‌పోర్ట్‌కు రెండు గంటల నలభై నిమిషాలకు చేరుకుంటారు. అక్కడి నుంచి బొల్లారంలోని యుద్ధ స్థూపం వద్దకు చేరుకుని నివాళులర్పించి వీరనారీమణులను సత్కరిస్తారు. అనంతరం నేరుగా రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు. ఈ నెల 30 వరకు ఆమె ఇక్కడే బస చేస్తారు.

పులివెందులలో సీఎం క్రిస్మస్ వేడుకలు



పులివెందుల సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వేడుకల్లో పాల్గొన్న బంధువులు, స్నేహితులు, ఆప్తులు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రతి ఏడాది తన సొంత గడ్డపై బంధు మిత్రుల మధ్య క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి దేవుడి కృప ఎల్లవేళలా ఉంటుందని విశ్వసిస్తున్నానని చెప్పారు. ప్రజలందరి జీవితాల్లో ఈ పండుగ ఆనందాలను, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ ప్రార్థనల్లో సీఎం సతీమణి వైఎస్ భారతి, తల్లి విజయమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, భారతమ్మ, సత్యవతమ్మ, మాధవీలత తదితర బంధువులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, ఏఎస్పీ తుషార్ డూడీ, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 11.30 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి, మధ్యాహ్నం తాడేపల్లి చేరుకున్నారు.

పెట్టుబడుల్లో ఫస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

తదితరాలున్నాయి. 2020 జనవరి నుంచి 2022 సెప్టెంబర్ వరకు ఆంధ్రప్రదేశ్‌లో 129 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించడం ద్వారా రూ.64,476 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చినట్లు డీపీఐఐటీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

కొత్తగా మరో రూ.13,516 కోట్ల పెట్టుబడులు

ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల వ్యవధిలో రాష్ట్రంలో కొత్తగా 37 యూనిట్లు నిర్మాణ పనులను ప్రారంభించాయి. వీటి ద్వారా మరో రూ.13,516 కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రంలోకి రానున్నాయి. 2020 జనవరి నుంచి ఇప్పటి వరకు 143 కొత్త యూనిట్లు రాష్ట్రంలో నిర్మాణ పనులు ప్రారంభించగా వీటిద్వారా మొత్తం రూ.32,616 కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రంలోకి రానున్నాయి. రాష్ట్రంలో కొత్తగా నిర్మాణ పనులు ప్రారంభించిన కంపెనీల్లో గ్రాసిమ్, సెంచురీ ప్లై, మునోత్ ఇండ్రస్టీస్, టీటీఈ ఎలక్ట్రానిక్స్, ఐటీసీ, బ్లూస్టార్, హావెల్స్ లాంటి సంస్థలున్నాయి.

సింగిల్ విండోలో అనుమతులు..

ముఖ్యమంత్రి జగన్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తూ ప్రతిపాదన దగ్గర నుంచి ఉత్పత్తి ప్రారంభం వరకు సింగిల్ విండో విధానంలో అన్ని అనుమతులు మంజూరు చేయడం ద్వారా చేయూత అందిస్తున్నారని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. కార్పొరేట్ దిగ్గజ సంస్థలు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవను అభినందిస్తున్నాయని గుర్తు చేశారు. పరిశ్రమలకు పూర్తి స్థాయి మద్దతు అందిస్తుండటం వల్లే వరుసగా మూడో ఏడాదీ సర్వే ద్వారా ప్రకటించిన సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు.

ఎంఎస్ఎంఈలతో 10.04 లక్షల మందికి ఉపాధి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. రాష్ట్రంలో మూడున్నరేళ్లలో 1,08,206 యూనిట్లు ఏర్పాటు కావడం ఇందుకు నిదర్శనం. వీటి ద్వారా రూ.20,537.28 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 10,04,555 మందికి ఉపాధి లభించింది. పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వకుండా గత సర్కారు బకాయి పెట్టిన రూ.962.05 కోట్లను ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడమే కాకుండా ఏ ఏడాది రాయితీలను అదే సంవత్సరం చెల్లిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,715.16 కోట్ల రాయితీలను, రూ.1,144 కోట్ల విలువైన విద్యుత్ రాయితీ ప్రోత్సాహకాలను చెల్లించింది. లాక్‌డౌన్‌తో పూర్తిగా వ్యాపారాలు నిలిచిపోయి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా లేనివిధంగా రీస్టార్ట్ ప్యాకేజీని ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుందని ఫ్యాప్సియా ప్రెసిడెంట్ మురళీకృష్ణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ద్వారా 2020–21లో ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.235.74 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.41.58 కోట్ల రాయితీలను విడుదల చేసింది. 2021–22లో ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.111.78 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.24.41 కోట్ల రాయితీలను అందచేసింది.

2022 జనవరి - సెప్టెంబర్ వాస్తవ రూపంలోకి వచ్చిన పెట్టుబడులు

రాష్ట్రం	పెట్టుబడులు రూ.కోట్లల్లో
ఆంధ్రప్రదేశ్	44,286
ఒడిషా	37,070
మహారాష్ట్ర	26,603
గుజరాత్	25,813
రాజస్థాన్	16,173
కర్నాటక	6,661
తమిళనాడు	5,419
తెలంగాణ	2,990

మరో 20 భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన!

రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించడంతోపాటు కొత్త ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు జారీ చేయడం ద్వారా నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రానున్న రెండు నెలల్లో రూ.64,555 కోట్ల విలువైన 20 భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే విధంగా పరిశ్రమల శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. రూ.14,634 కోట్లతో అదానీకి చెందిన వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ నెలకొల్పే డేటా సెంటర్, ఐటీ పార్క్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రూ.43,143 కోట్లతో నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద ఇండోసోల్ సోలార్ కంపెనీ నెలకొల్పే సౌర విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్ పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. తిరుపతి జిల్లాలో 2.25 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జిందాల్ స్టీల్ ప్లాంట్ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం 20 యూనిట్లు నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ఉత్పత్తి ప్రారంభిస్తే 44,285 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఫిబ్రవరి చివరి వారంలో జరిగే పెట్టుబడుల సదస్సు నాటికి శంకుస్థాపనలు పూర్తి చేయాలని పరిశ్రమల శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

చలపతిరావు మృతితో బల్లిపర్రులో విషాదం



బల్లిపర్రులో చలపతిరావు నిర్మించిన ఇల్లు

బల్లిపర్రు (పామర్రు) : ప్రముఖ సినీనటుడు తమ్మారెడ్డి చలపతిరావు (78) మృతి ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లా పామర్రు మండలం బల్లిపర్రులో తీవ్ర విషాదం నింపింది. ఆయన మృతిపట్ల గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని, మంచి మిత్రుణ్ణి కోల్పోయామని గ్రామస్తులు చెప్పారు. గ్రామంలో తనకున్న స్థలంలో ఒక చిన్న ఇల్లుని నిర్మించారని దానిని తన సోదరి అయిన భ్రమరాంబకు ఇచ్చారన్నారు. ఏటా గ్రామానికి వచ్చి స్థానికులు, బంధువులతో ఆయన ముచ్చటించేవారని, గ్రామంలో ఉన్న 1.40 ఎకరాల పొలాన్ని చలపతిరావే సాగు చేస్తుండేవారని వారు తెలిపారు. స్థానిక గంగానమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేశారని వారు గుర్తుచేశారు. అత్తవారి ఇల్లు కూడా పామర్రు మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామం కావడంతో అక్కడి వారితో కూడా సత్సంబంధాలున్నాయని తెలిపారు.

'ఈ–శ్రమ'లో 78.47 లక్షల మంది

- అసంఘటిత రంగ కార్మికుల నమోదులో ఐదో స్థానంలో రాష్ట్రం
- అత్యధికంగా 53.38 లక్షల మంది వ్యవసాయ కార్మికులు
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు పరిహారం

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా తొలిసారిగా అసంఘటిత రంగ కార్మికుల వివరాలను ఈ–శ్రమ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం సేకరిస్తోంది. దీనిద్వారా వారికి సామాజిక భద్రత పథకాలను వర్తింపచేయడంతో పాటు ప్రమాద బీమాను అమలు చేయనుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 38 కోట్ల మంది అసంఘటిత కార్మికుల డేటాను ఈ–శ్రమ పోర్టల్ ద్వారా సేకరించాలని నిర్ణయించగా ఇప్పటివరకు 28.48 కోట్ల మంది వివరాలను నమోదు చేశారు. ఈ–శ్రమ పోర్టల్ ద్వారా వ్యక్తిగతంగా కూడా కార్మికులు వివరాలను నమోదు చేసుకోవచ్చు.

సచివాలయాల ద్వారా నమోదు

అసంఘటిత రంగ కార్మికులను ఈ–శ్రమ పోర్టల్‌లో నమోదు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉంది. గ్రామ, వార్డు సచివాలయాలు కేంద్రంగా నిర్మాణ కార్మికులు, చేతివృత్తిదారులు, చిరువ్యాపారులతో పాటు వ్యవసాయ, వలస కూలీల వివరాలను ఈ–శ్రమ పోర్టల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 78,47,859 మంది ఈ–శ్రమ పోర్టల్‌లో నమోదు అయ్యారు. అత్యధికంగా వ్యవసాయ రంగంలో 53,38,805 మంది, నిర్మాణ రంగంలో 5,66,680 మంది కార్మికులు నమోదు అయ్యారు. వీరిలో మహిళా కార్మికులే అధికం. 55.83 శాతం మహిళా కార్మికులు, 44.16 శాతం పురుష కార్మికులు నమోదయ్యారు. ఈ–శ్రమ పోర్టల్‌లో వివరాల నమోదు పురోగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతి గురువారం కలెక్టర్లతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 150.93 లక్షల మంది అసంఘటిత కార్మికులను ఈ–శ్రమ పోర్టల్‌లో నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ధారించుకుంది. అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 7.16 లక్షల మంది, అత్యల్పంగా ఎన్టీఆర్ జిల్లాలో 20,893 మంది కార్మికులు ఈ–శ్రమ పోర్టల్‌లో నమోదయ్యారు. వివరాల నమోదు అనంతరం అసంఘటిత కార్మికులకు ఈ–శ్రమ కార్డు జారీ చేస్తారు. ప్రమాదవశాత్తు మృతి చెందితే బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలు బీమా కింద అందజేస్తారు. ప్రమాదంలో పూర్తి వైకల్యం బారినపడితే రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష చొప్పున పరిహారం అందజేస్తారు. దీంతో పాటు వివిధ సామాజిక భద్రత, సంక్షేమ పథకాలను వర్తింపచేస్తారు. ఆయా రంగాల్లో కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పిస్తారు.

వినోదం @ శిల్పారామాలు

అమ్యూజ్‌మెంట్ పార్క్, స్నో వరల్డ్, స్విమ్మింగ్‌పూల్, వెల్‌నెస్ సెంటర్, రెసిడెన్షియల్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ హాల్స్ నిర్మాణం

సాక్షి, అమరావతి: దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలోని శిల్పారామాలను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. పట్టణాల్లో పల్లె వాతావరణాన్ని అందించడంతోపాటు విలాసవంతమైన సౌకర్యాలను కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చిన్నారులకు సాహస, వినోద కార్యకలాపాలకు ప్రాధాన్యమిస్తోంది. అమ్యూజ్‌మెంట్ పార్క్, స్నో వరల్డ్, స్విమ్మింగ్ పూల్, వెల్‌నెస్ సెంటర్ (జిమ్, స్పా), రెసిడెన్షియల్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ హాల్స్, ఫుడ్ కోర్టులను అందుబాటులోకి తీసుకురానుంది. వీటిని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, పులివెందుల, అనంతపురం, పుట్టపర్తి, కడప శిల్పారామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం టెండర్లు సైతం ఆహ్వానించింది.



కళాకారులకు ప్రోత్సాహం

కళాకారులు, చేతివృత్తుల వారికి నేరుగా తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే సౌలభ్యాన్ని శిల్పారామాల్లో కల్పిస్తున్నారు. హస్తకళల ప్రదర్శన, చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్లు, క్రాఫ్ట్ బజార్స్, ఎక్స్‌పో, మేళాలను ఉచితంగా ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేలా తోడ్పాటు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, చిత్తూరులో ప్రభుత్వం అర్బన్ హట్స్ నిర్మాణం చేపట్టనుంది. విశాఖపట్నం, కాకినాడ, కడప, పులివెందుల, అనంతపురం, పుట్టపర్తి, గుంటూరు శిల్పారామాల్లో హస్తకళల మ్యూజియాలను అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. పులివెందులలో రూ.12.26 కోట్లతో శిల్పారామంలో వసతులను మెరుగుపర్చనున్నారు. అక్కడ సాహస కార్యకలాపాలు, విజయనగరం శిల్పారామంలో ఘంటశాల అకాడమీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

సకల సౌకర్యాల నిలయంగా..

రాష్ట్రంలో శిల్పారామాల వ్యవస్థ పర్యాటక రంగంలో కీలకంగా మారనుంది. అందుకే.. ప్రపంచస్థాయి వినోద, విజ్ఞాన సౌకర్యాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్నాం. తద్వారా స్థానిక యువతకు కూడా ఉపాధి లభిస్తుంది. మరోవైపు పేద కళాకారులు, చేతి వృత్తులను ప్రోత్సహించేలా ఉచితంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం.

– డి.శ్యామ్ సుందరరెడ్డి, సీఈవో, శిల్పారామం

957 స్టాఫ్ నర్స్ పోస్టులకు 40,157 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో 957 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి ఈ నెల మొదటి వారంలో వైద్య శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఆయా జోన్‌లలో విడుదల చేసిన ప్రాథమిక మెరిట్ జాబితాల ఆధారంగా 40,157 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అత్యధికంగా జోన్–2లో 12,295 మంది ఉన్నారు. జోన్–3లో ఇప్పటికే ప్రాథమిక మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ముగిసింది. జోన్ 1, 2, 4 ల్లో 26వ తేదీతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగియనుంది.

జోన్ల వారీగా పోస్టుల ఖాళీలు, దరఖాస్తులు ఇలా

జోన్	పోస్టులు	వచ్చిన దరఖాస్తులు
1	163	8,659
2	264	12,295
3	239	8,083
4	291	11,120
మొత్తం	957	40,157

దేశాభివృద్ధిలో రాజీలేని తత్వం వాజ్‌పేయిది

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: దేశాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా దేశ రక్షణ అవసరాల పరంగానూ మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి రాజీ పడలేదని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. దేశాభివృద్ధి విషయంలో ఆయన ఎంతో ముందుచూపుతో వ్యవహరించారన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో ఆదివారం సుపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి గవర్నర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ విశ్వభూషణ్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి వాజ్‌పేయి చేసిన కృషి మరువలేనిదని 'స్వర్ణ చతుర్భుజి' కార్యక్రమాన్ని ప్రారంభించి దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మార్గం చూపారన్నారు. నాలుగు మెట్రోపాలిటన్ నగరాలను కలుపుతూ ఏర్పాటు చేసిన హైస్పీడ్ జాతీయ రహదారుల ప్రాజెక్ట్ ఫలాలను ఇప్పుడు ప్రజలు ఆస్వాదిస్తున్నారన్నారు. 60 ఏళ్లు పైబడిన పేద వృద్ధులకు 10 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేసి సంక్షేమ రంగంలో కొత్త ఒరవడి సృష్టించారని గుర్తుచేశారు. గ్రామాలను కలుపుతూ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ప్రాథమిక, మాధ్యమిక విద్య నాణ్యతను పెంపొందించేందుకు సర్వశిక్షా అభియాన్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వాజ్‌పేయి హయాంలో ప్రారంభమయ్యాయన్నారు. అణుపరీక్షల వేళ ప్రపంచంలోని పెద్ద శక్తులు వాజ్‌పేయిపై విరుచుకుపడగా ఐదు పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన తరువాత అణుశక్తి దేశంగా భారత్‌ను ప్రకటించారని గుర్తుచేసారు. వాజ్‌పేయి ధైర్యవంతమైన చర్యల ఫలితంగా ప్రవాస భారతీయులు గర్వంగా, గౌరవంగా జీవించగలుగుతున్నారని గవర్నర్ హరిచందన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, ఉపకార్యదర్శి నారాయణస్వామి, పలువురు మాజీ సైనికాధికారులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో రంగా స్థానం నేటికీ పదిలం

రంగా విగ్రహావిష్కరణ సభలో ఎంపీ బాలశౌరి



మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, వేదికపై ఎమ్మెల్యేలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ

విజయవాడ రూరల్: పేదల హక్కుల కోసం కృషి చేసిన వంగవీటి మోహనరంగా మరణించి 34 ఏళ్లు గడిచినా ప్రజల గుండెల్లో నేటికీ ఆయన చిరస్థాయిగా నిలిచే ఉన్నారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. విజయవాడ సమీపంలోని నున్నలో వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ.. 1989లో ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందంటే రంగా శక్తి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం జీవించి, వారి కోసమే ప్రాణత్యాగం చేసిన గొప్ప నాయకుడు వీఎం రంగా అన్నారు. ఆయన మరణించి 34 సంవత్సరాలైనా ఇప్పటికీ ప్రజలు గుండెల్లో పెట్టుకొని పూజిస్తున్నారని పేర్కొన్నారు. డబ్బు సంపాదించాలనే ఆపేక్ష లేని రంగా తనయుడు విజయవాడలో సొంత ఇల్లు కూడా సమకూర్చుకోలేదన్నారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మాట్లాడుతూ.. వీఎం రంగా ప్రజల మనిషని అన్నారు. మూడేళ్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేసి 35 సంవత్సరాలుగా ప్రజల మనిషిగా వారి గుండెల్లో నిలిచిపోయారన్నాని, రంగాకు మరణమే లేదని పేర్కొన్నారు. ఆయన తనయుడు రాధాకృష్ణ రాజకీయాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ.. వీఎం రంగా పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి తోట వెంకయ్య, విగ్రహ దాత కొట్టే రవికుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, సర్పంచ్ కాటూరి సరళ పాల్గొన్నారు.

రెవెన్యూలో 'ఈ-ఫైల్స్'

- కలెక్టరేట్ల నుంచి సీసీఎల్‌ఏకి వచ్చే ముఖ్యమైన ఫైల్స్‌ను ఈ విధానంలోనే పంపేలా ఏర్పాట్లు
- కలెక్టరేట్ల ఈ-ఆఫీస్ లాగిన్ నుంచి నేరుగా సీసీఎల్‌ఏ ఇన్‌బాక్స్‌కి పంపాలి
- తపాల్స్, ఈ-తపాల్స్ ఆలస్యమవుతుండడంతో తాజా నిర్ణయం

సాక్షి, అమరావతి: జిల్లా కలెక్టరేట్ల నుంచి వచ్చే ముఖ్యమైన ఫైళ్లను వెంటనే క్లియర్ చేసేందుకు రెవెన్యూ శాఖ ఈ-ఫైల్ విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. ఈ విధానం ఇప్పటికే అమలులో ఉన్నా అది కలెక్టరేట్ల నుంచి సీసీఎల్‌ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్)కు వచ్చే ఫైళ్లకు అమలుకావడంలేదు. జిల్లాల నుంచి ఫైళ్లను నేరుగా తపాల్స్ లేదా ఈ-తపాల్స్ ద్వారా సీసీఎల్‌ఏ కార్యాలయానికి పంపుతున్నారు. దీనివల్ల ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం జరిగి ముఖ్యమైన ఫైళ్లపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమవుతున్నట్లు గుర్తించారు. ఒక కార్యాలయం నుంచి మరొక కార్యాలయానికి సంబంధిత ఫైలు తపాలా (రవాణా) ద్వారా తీసుకురావడానికి 15 రోజుల సమయం పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించి ఫైళ్లను వెంటనే క్లియర్ చేసేందుకు ఈ-ఫైల్ విధానంలో కొన్ని మార్గదర్శకాలు ఇచ్చి వాటి ప్రకారం ఫైళ్లను తమ కార్యాలయానికి పంపాలని సీసీఎల్‌ఏ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తాజాగా ఒక సర్క్యులర్ ఇచ్చారు. విజిలెన్స్ అంశాలు, మెడికల్ బిల్స్, సెలవుల మంజూరు, భూముల కేటాయింపు, ఇతర భూముల వ్యవహారాలతోపాటు అత్యవసరమైన వ్యవహారాల్లో నిర్ణయం తీసుకోవాల్సిన ఫైళ్లను కలెక్టరేట్ల ఈ-ఆఫీస్ లాగిన్ నుంచి నేరుగా సీసీఎల్‌ఏ ఇన్‌బాక్స్‌కి ఈ-ఫైల్‌గా పంపాలని సూచించారు. అవసరమైన పేపర్లు, జతచేయాల్సిన పత్రాలన్నింటినీ అందులో అప్‌లోడ్ చేయాలని ఆయన పేర్కొన్నారు. ఉదాహరణకు.. భూ కేటాయింపుల ఫైల్ అయితే దానికి నిర్దేశించిన పత్రాలతోపాటు జాయింట్ కలెక్టర్ తనిఖీచేసి రూపొందించిన నివేదిక, భూమి స్వభావం, క్లాసిఫికేషన్‌కు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఇలా పంపే అన్ని ఫైళ్లపైనా కలెక్టర్లు తమ కచ్చితమైన సిఫారసులు, అభిప్రాయాలను ప్రతి అంశంపైనా ఇవ్వాలని సాయిప్రసాద్ స్పష్టంచేశారు.

'స్టేట్ ప్లేయర్లకూ పింఛన్ సౌకర్యం కల్పించాలి'

సాక్షి, అమరావతి: ఆంధ్రా జట్టుకు, మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రికెటర్లకు రంజీ ఆటగాళ్లతో సమానంగా పింఛన్ సౌకర్యం కల్పించాలని ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఏసీఏ పరిధిలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్లలో రాష్ట్రం తరఫున ఆడినవారికి సభ్యత్వం, ఓటుహక్కు, స్టేట్ సెలక్షన్ కమిటీలో చోటు కల్పించాలన్నారు.

గుడివాడలో బరిసెలతో 'రావి' రౌడీయిజం



వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే రావి సమక్షంలో రెచ్చగొడుతున్న టీడీపీ నాయకులు



టీడీపీ నాయకులను చెదరగొడుతున్న వన్‌టౌన్ సీఐ గోవిందరాజులు, సిబ్బంది

- ఆయుధాలతో టీడీపీ శ్రేణుల స్వైర విహారం
- మెయిన్ రోడ్డులో సీఐపై దాడి.. చిరిగిన యూనిఫాం

గుడివాడ రూరల్: దివంగత నేత వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆదివారం కృష్ణా జిల్లా గుడివాడలో టీడీపీ నాయకులు మారణాయుధాలతో అడ్డుకుని బరి తెగించి ప్రవర్తించారు. రంగా వర్ధంతిని మీరెలా నిర్వహిస్తారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సమక్షంలో దుర్భాషలాడారు. దీంతో గుడివాడ మెయిన్ రోడ్డు నెహ్రూచౌక్ నుంచి రావి టెక్స్‌టైల్స్ వరకు రాత్రి ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు కర్రలు, బరిసెలతో రహదారిపై తిరుగుతూ ఎమ్మెల్యే కొడాలి నానిని దూషించారు. వారించేందుకు ప్రయత్నించిన వన్‌టౌన్ సీఐ గోవిందరాజులపై దాడికి యత్నించారు. సీఐ యూనిఫాంను చించేశారు. అనంతరం డీఎస్పీ ఎస్.సత్యానందం సిబ్బందితో కలసి అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను సముదాయించి పంపేశారు. ఓ మాజీ ఎమ్మెల్యే స్వయంగా దాడులకు ప్రోత్సహిస్తూ ఉద్రిక్తత రేకెత్తించటాన్ని గుడివాడ ప్రజలు తప్పుబడుతున్నారు.

అశోక్ బంగ్లా వేదికగా మరో కుట్ర

- చంద్రబాబు తీరుపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ధ్వజం
- మానసిక స్థితి బాగోలేకే పిచ్చి మాటలు
- సభలకు జనాల్ని డబ్బులిచ్చి తరలిస్తున్నారు
- ఒక్కసారి గెలవని పవన్‌కు దాసోహం



విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం: టీడీపీ నేత అశోక్ గజపతిరాజు బంగ్లా నుంచే 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు వ్యూహాన్ని చంద్రబాబు రచించారని, మళ్లీ ఇప్పుడు ఆ బంగ్లా వేదికగా మరో కుట్రకు తెర లేపారని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. త్వరలోనే ఆ కుట్ర బట్టబయలవుతుందని చెప్పారు. ఆదివారం ఆయన విశాఖ సర్క్యూట్ హౌస్‌లో, విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్న చంద్రబాబుకు మానసిక స్థితి బాగోలేదన్నారు. అనని మాటలను పట్టుకొని చంద్రబాబు ఏడవడంతోనే ఆయన మానసిక ధైర్యాన్ని కోల్పోయారని చెప్పారు. 'బాదుడే బాదుడు' అట్టర్ ఫ్లాప్ కావడంతో పేరు మార్చి 'ఇదేమి ఖర్మ' అంటూ ప్రజల్లోకి వెళ్లగా.. చంద్రబాబు వల్లే రాష్ట్రానికి ఖర్మ పట్టుకుందని జనం అనుకుంటున్నారన్నారు. చంద్రబాబు సభలకు డబ్బులిచ్చి మరీ జనాన్ని రప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ వాళ్లే చర్చించుకుంటున్నారని చెప్పారు. ఒక్కసారి కూడా గెలవని, ఒక్క సీటు లేని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు చంద్రబాబు దాసోహమయ్యాడన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీకి తూట్లు పొడుస్తున్నారన్నారు. బీసీలంటే ఎప్పుడూ చంద్రబాబుకు చులకన భావమేనని, బీసీ మహిళా అధ్యక్షురాలు ఫొటో దిగడానికి వస్తే.. అశోక్ కుమార్తె అడ్డుకుంటే చూస్తూ మిన్నకుండిపోవడం అవమానించడం కాదా అని ప్రశ్నించారు.

కుప్పంలో మీ సంగతి చూసుకోండి

విజయనగరం ఎమ్మెల్యేగా ఉన్న తాను, మంత్రి బొత్స సత్యనారాయణ ఓడిపోతామని చెబుతున్న చంద్రబాబు.. ముందు ఆయన సొంత నియోజకవర్గం కుప్పంలో ఎలా గెలవాలో చూసుకోవాలని కోలగట్ల హితవు పలికారు. బొబ్బిలి, రాజాం, విజయనగరం నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో సైకిల్ పోవాలంటూ ఆయన చెప్పడం ద్వారా నిజాన్ని ఒప్పుకున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు తథ్యమని చెప్పారు.

అవార్డులతో విద్యుత్ సంస్థల బాధ్యత పెరిగింది

మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థలకు ఈ ఏడాది దక్కిన ప్రతిష్టాత్మక అవార్డులు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే బాధ్యతను మరింత పెంచాయని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 28న ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ డిస్కంలు, నెడ్‌క్యాప్, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, వివిధ విభాగాల ఉద్యోగులతో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రపతి నుంచి అందుకున్న నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు దేశంలో ఏపీ ఖ్యాతిని మరింతగా పెంచిందని మంత్రి అన్నారు.

ఏకైక రాష్ట్రం ఏపీ

ఇంధన మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి సంబంధించి దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఎనర్షియా సమ్మిట్‌లో ఏపీ మరో 3 అవార్డులను గెలుచుకుందని మంత్రి పెద్దిరెడ్డి గుర్తు చేశారు. ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీగా, ఉత్తమ పునరుత్పాదక సంస్థల్లో ఒకటిగా నెడ్‌క్యాప్ నిలిచాయన్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మానవుడు అద్భుతాలను కోరుకున్నంతగా దేవుని కోరుకోడు, అద్భుతాలను విడిచి మానవుడు జీవించలేడు కనుక.
– ఫ్యోదర్‌ దోస్తోవ్‌స్కీ

సాక్షి

సోమవారం, డిసెంబర్, 26

ఏమో... గుర్రం ఎగురా వచ్చు

కథతో మొదలెట్టుకుందాం. ఒక మోసగాడు కొయ్యగుర్రాన్ని రాజాస్థానానికి పట్టుకుని వచ్చి 'రాజా.. ఈ గుర్రం ఎగురుతుంది. పదివేల వరహాలకు అమ్ముతాను' అంటాడు. ఎగిరే గుర్రాన్ని ఎవరు వద్దనుకుంటారు? 'ఎగరకపోతేనో?' అంటాడు రాజు. 'ఎగురుతుంది రాజా. పున్నమిరోజు వెన్నెల రాత్రి ధవళ వస్త్రాలు ధరించి అధిరోహించు. ముల్లోకాలు తిప్పి తెస్తుంది' అంటాడు. పదివేల వరహాలు మోసగాడికి దక్కాయి. పున్నమి వచ్చింది. వెన్నెల రాత్రి వచ్చింది. ధవళ వస్త్రాలతో రాజు గుర్రం ఎక్కాడు. గుర్రం కదల్లేదు. మెదల్లేదు. ముఖం జేవురించిన రాజు 'వాడి తల ఉత్తరించండి' అన్నాడు భటులతో. భటులు వెళ్లి మోసగాణ్ణి పట్టుకొని వస్తే వాడు దబ్బున కాళ్ల మీద పడి 'రాజా... ఎక్కడో పొరపాటు జరిగింది. ఆరు నెలలు సమయం ఇవ్వండి. ఈలోపు గుర్రం ఎగరకపోతే అప్పుడు నన్ను ఉరి తీయండి' అన్నాడు. రాజు నెమ్మదించాడు. మోసగాణ్ణి మరోమారు నమ్మి చెరసాలకు పంపాడు. చెరసాలలో సీనియర్‌ ఖైది ఈ మోసగాణ్ణి చూసి 'ఒరే... ఎలాగూ గుర్రం ఎగరదు. నీ తల తెగిపడకా తప్పదు. ఈ ఆరునెలల సమయం ఎందుకు అడిగావు?' అంటాడు. దానికి మోసగాడు 'ఏమో ఎవరు చూడొచ్చారు. ఈ ఆరు నెలల్లో ఏమైనా జరగొచ్చు. రాజు నన్ను క్షమించవచ్చు. లేదా జబ్బు పడవచ్చు. గుండాగి చావొచ్చు. ఏమో... ఆరు నెలల్లో శత్రురాజు ఈ దేశం మీదకు దండెత్తి ఆక్రమించవచ్చు. ఏమో... వరదలు ముంచెత్తి ఈ చెరసాల గోడలను బద్దలు కొట్టవచ్చు. ఏమో... ఇవన్నీ జరగకపోతే కనీసం గుర్రం ఎగురా వచ్చు' అంటాడు. ఆశ అంటే అది. కాలం మీద ఆశ.

కాలం భవిష్యత్తులో మొదలయ్యి వర్తమానంలోకి వచ్చి గతంలోకి జారుకుంటుంది. మనకు గతం మాత్రమే తెలుసు. వర్తమానం సంభవిస్తూ ఉండగా అంచనా ఉండదు. భవిష్యత్తు ఆచూకీ తెలియదు. కాలం హాయిగా గడవాలని ఏ మనిషైనా కోరుకుంటాడు. హాయిగా గడవడం కోసం శ్రమ పడతాడు. హాయిగా గడవదేమోనని భయపడతాడు. 'రోజులన్నీ ఒక్కలాగే ఉండవు' అని కలవరపడే మనిషే 'రోజులన్నీ ఒక్కలాగే ఉంటాయా ఏంటి' అని ఏదో ఒక గుడ్డి నమ్మకం కాలం మీద పెట్టుకుంటాడు. ఇదేమీ తెలియని కాలం అవిశ్రాంతంగా ఉద్భవిస్తూ, జనిస్తూ, సకల ప్రాణికోటికి సమంగా బట్వారా అవుతూ, రెప్పపాటు నుంచి మన్వంతరాల వరకూ జరిగే ఘటనలను తనలో లీనం చేసుకుంటూ ముందుకు సాగిపోతుంటుంది. కాలం ముందుకే సాగగలగడం మనిషి అదృష్టం. టైమ్‌ మిషన్‌ ఎక్కి వెనక్కు వెళ్ళాలని అనుకుంటాడుగాని వెనక్కు వెళితే ఏముంటుంది? గుప్తుల స్వర్ణయుగంలో కూడా దోమలు ఉంటాయి. మశూచి ఉండే ఉంటుంది.

'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్‌' అని మనిషి అనుకుంటాడు గానీ గత కాలం పట్ల అసంతృప్తే మనిషిని ముందుకు నడిపించేది. గత కాలపు అనుభవాలలోని లోటును గ్రహించడం వల్లే మనిషి భవిష్యత్తు ఆవిష్కరణలు చేసేది. గతంలో రాజు గారికి రాచకురుపు వస్తే రాకుమారుడు గుర్రం తీసుకుని విరుగుడు ఆకుల కోసం వేయి యోజనాలు ప్రయాణించాల్సి వచ్చేది. ఇవాళ బంజారా హిల్స్‌లో అడుగుకొక కేన్సర్‌ హాస్పిటల్‌ ఉంది. గతంలో నలభై, నలభై ఐదేళ్లకు మనిషి పుటుక్కుమనేవాడు. ఇవాళ షుగర్, బిపిలను మేనేజ్‌ చేసుకుంటూ అతి సులభంగా ఎనభై ఏళ్లు జీవిస్తూ ఉన్నాడు. పాలకుల, శ్రీమంతుల, నగర పెద్దల పిల్లలకు మాత్రమే పరిమితమైన గురుకుల విద్య నేడు సకల వర్గాలకు మిడ్‌ డే మీల్స్‌ విత్‌ బాయిల్డ్‌ ఎగ్‌ దొరుకుతూ ఉంది. గతం లోపాలను చెరిపేసుకుంటూ కాలాన్ని సరిదిద్దుకుంటూ మనిషి ముందుకు సాగడం వల్ల జరిగే మేళ్లు ఇవి.

మరి గత కాలాన్ని ఎందుకు గౌరవించాలి? విలువలకు. వెర్రిబాగులతనానికి. అకలుషితానికి. రుచికి. పరిమళానికి. బాంధవ్యాలకు. ఆపేక్షలకు. నిజాయితీకి. నిరాడంబరతకు. బాగా బతకాలని భవిష్యత్తు మీద ఆశ పెట్టుకునే మనిషి ఇవి లేకుండా బాగా బతకలేడు. ఏ మంచిని వదులుకుని ఏ చెడును ముందుకు తీసుకెళుతున్నావన్న కాల అప్రమత్తత మనిషికి ఉండాలి. గతాన్ని లోడి, దాని గాయాలను కెలికి, అందులోని చెడు ఘటనలు వెలికి తీసి వాటిని ఎవరో ఒకరి ద్వేషానికి ఉపయోగిస్తూ, గతంలోని ఫలానా కారణం వల్ల భవిష్యత్తులో ఫలానా వారికి గుణపాఠం చెప్పాలి అని ప్రచారం చేస్తూ ఉంటే కనుక రాబోయే కాలం గడ్డుకాలమే అవుతుంది. గతంలోని ద్వేషం వద్దు. గతంలోని యుద్ధం వద్దు. గతంలోని దోపిడి వద్దు. గతంలోని ఎక్స్‌ప్లాయిటేషన్‌ వద్దు. గతంలోని పాపాలను భవిష్యత్తులో కడుక్కోవడానికి మాత్రమే మనిషి కాలాన్ని వారధి చేసుకోవాలి.

కొత్త సంవత్సరం వచ్చిన ప్రతిసారి మనిషి కాలం మీద ఆశ పెట్టుకునే వెల్‌కమ్‌ చెబుతాడు. గతం గతః అనుకుంటాడు. ఇకపై మంచి జరగాలని సగటు మనసుతో కోరుకుంటాడు. పాత బాధలను తలువనివ్వని కొత్త కాలం కోసం ప్రార్థనలు చేస్తాడు. కాని ప్రజల మంచికాలం పాలకుల గుప్పిట్లో ఉంది. ఒక ఫైల్‌ మీద బాధ్యత లేని సంతకం, అమానవీయ చట్టం, తప్పుడు నిర్ణయం ప్రజలకు చేటుకాలం తెస్తుంది. 'తమకు మాత్రమే మంచి కాలం ఉండాలని' పాలకులు ప్రజలకు చెడుకాలం తెచ్చి పెట్టినంత కాలం మన టైము బాగుంటుందని, బాగు పడుతుందని ఆశ పెట్టుకోవడం వృథా. మన కాలం బాగుండాలంటే పాలకులను జాగ్రత్తగా ఎంచుకోవాలి. పాలనా వ్యవస్థలను హెచ్చరించగలగాలి. పరిపాలనను సరిదిద్దడానికి గట్టిగా నిలబడాలి. మన నొసటి కాలాన్ని మనమే రాసుకోవాలి.

2023లో అలా జరుగుతుందని ఆశిద్దాం. ఏమో... గుర్రం ఎగురా వచ్చు. హ్యాపీ న్యూ ఇయర్‌.

జ్ఞాపకాలు విప్పి చెప్పిన కథనాలు

కామెంట్



కరణ్‌ థాపర్‌

ఉన్నత స్థానంలో పనిచేసిన వ్యక్తి తన జ్ఞాపకాలను రాస్తే అవి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను చెబుతాయి. అందునా ఆయన ఒక గూఢచార సంస్థకు అధిపతి అయితే? అప్పుడు మామూలుగా మనం ఎప్పటికీ తెలుసుకోలేని వ్యక్తులు, వారి కథనాలు మన ముందుకు వస్తుంటాయి. 'రీసెర్చ్‌ అండ్‌ ఎనాలిసిస్‌ వింగ్‌'(రా)కు అధిపతిగా పనిచేసిన ఎ.ఎస్‌.దులత్‌ తనను తాను ఒక దయ్యంగా అభివర్ణించుకుంటారు. నీడలా ఉండి చేయాల్సిన పని అది కాబట్టి. అందుకే ఆయన తన పుస్తకానికి 'ఎ లైఫ్‌ ఇన్‌ ద షాడోస్‌' అనే పేరుపెట్టారు. ఇందులో ప్రిన్స్‌ చార్లెస్‌కు ఇందిరా గాంధీ ఇచ్చిన ఆతిథ్యం నుంచి, తన భద్రతాధికారి పట్ల మార్గరేట్‌ థాచర్‌ చూపిన ఔదార్యం దాకా ఎన్నో విషయాలున్నాయి. ఇంకా ఢిల్లీలో సిక్కులను చంపుతున్నప్పుడు అప్పటి కాంగ్రెస్‌ నాయకుడు అర్జున్‌ సింగ్‌ ప్రతిస్పందన విశేషమైన ప్రాధాన్యత కలిగినది.

రెండు అంశాలు జ్ఞాపకాలను తప్పనిసరిగా చదివేలా చేస్తాయి– సుప్రసిద్ధ వ్యక్తులను గురించిన వృత్తాంతాలు, వారి గురించిన పదునైన వ్యాఖ్యలు. రచయిత ఎప్పుడైతే ఒక 'దయ్యమో'– ఒక జీవితకాలం పాటు ఇంటెలిజెన్స్‌ బ్యూరోలో ఉన్నతస్థానంలో ఉండి 'రీసెర్చ్‌ అండ్‌ ఎనాలిసిస్‌ వింగ్‌'కు అధిపతిగా పనిచేసిన తర్వాత ఆయన తనను తాను అలాగే అభివర్ణించుకున్నారు– మామూలుగా అయితే మనం ఎప్పటికీ తెలుసుకోలేని వ్యక్తులు, వారి కథనాలు మన ముందుకు వస్తుంటాయి. ఇదే ఎ.ఎస్‌. దులత్‌(అమర్‌జీత్‌ సింగ్‌ దులత్‌) రాసిన 'ఎ లైఫ్‌ ఇన్‌ ద షాడోస్‌' పుస్తకాన్ని అంత సరదాగా మలిచింది.


1980లలో ఢిల్లీ సందర్శించే ప్రముఖులకు దులత్‌ భద్రతా అనుసంధాన అధికారిగా ఉండేవారు. అలాంటి ప్రముఖులలో ఒకరు ప్రిన్స్‌ చార్లెస్‌. ఈ బ్రిటన్‌ యువరాజును ఇందిరాగాంధీ భోజనానికి ఆహ్వానించారు. అయితే అదంత బాగా సాగలేదు. ''ఎవరో చితక బాదినట్టిగా భారత ప్రధాని నివాసం నుంచి చార్లెస్‌ బయటపడ్డారు!'' అని దులత్‌ రాశారు. ''యువర్‌ హైనెస్‌(మహాశయా), భోజనం ఎలా అయ్యింది?'' అని అడిగాను. ''నన్ను అడగొద్దు,'' అంటూ ఊపిరి పీల్చుకుంటున్న రీతిలో చార్లెస్‌ కారు ఎక్కారు. ''ఆ మహిళ నిన్ను గడ్డ కట్టించేయగలదు. నీకు తెలుసా? ప్రపంచవ్యాప్తంగా చాలామంది నాయకులను నేను కలిశాను, కానీ ఈ మహిళ ఒక్క మాట కూడా మాట్లాడదు!''

మార్గరేట్‌ థాచర్‌ (బ్రిటన్‌ మాజీ ప్రధాని) భిన్నమైన ముద్ర వదిలేసి వెళ్లారు. ఈ ఉక్కు మహిళ తన సిబ్బందని ఎంతో జాగ్రత్తగా చూసుకునే బాస్‌గా ఉండేవారు. థాచర్‌ భద్రతాధికారి గోర్డాన్‌ కేథార్న్‌ ఒక రాత్రి ఆమె గది బయట చలిలో గడుపుతానని చెప్పినప్పుడు థాచర్‌ ఎలా స్పందించారో దులత్‌ రాశారు. ''గోర్డాన్, రాత్రి ఇక్కడే గడపటం గురించి నీవు సీరియస్‌గానే అంటున్నావా?'' అని ఆమె అడిగారు. ''అవును మేడమ్, అఫ్‌కోర్స్, నిజంగానే'' అన్నాడు గోర్డాన్‌. అప్పుడు ప్రధాని ఇలా అన్నారు: ''అయితే ఒక నిమిషం ఉండు. బయట చలిగా ఉంది. డెనిస్‌ స్వెటర్లలో ఒకటి నీకు తెచ్చిస్తాను.''(డెనిస్‌– డెనిస్‌ థాచర్. ఆమె భర్త.)

ఆ ప్రయాణంలో థాచర్‌ కారు ట్రాఫిక్‌ జామ్‌లో ఇరుక్కుపోయింది. అద్దాల్లోంచి బయటికి చూస్తూ ఆమె కేథార్న్‌ కారు వెంట జాగింగ్‌ చేయడాన్ని గమనించారు. ముందు సీట్లో డ్రైవర్‌ పక్కనే కూర్చున్న దులత్‌ను మనం అతడికి లిఫ్ట్‌ ఇద్దామా అని



అడిగారు. దులత్‌ అంగీకరించి, కేథార్న్‌ లోపలికి వచ్చేలా తన డోరు తెరిచారు. ''నో, నో, నువ్వు అసౌకర్యానికి గురి కావొద్దు,'' అని వెంటనే థాచర్‌ అన్నారు. ''అతడు మాతో వెనక కూర్చుంటాడు''. దులత్‌ ఏమంటారంటే – ''ఇలాంటి దృశ్యాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. ఒక భద్రతాధికారికి అసౌకర్యం కలిగించడం కంటే కూడా, బ్రిటన్‌ దేశపు ప్రధాని వెనక సీట్లో ముగ్గురితో సర్దుకుని కూర్చోవడానికి సిద్ధపడ్డారు.''



దులత్‌ ఉపాఖ్యానాల్లో ఎక్కువగా జ్ఞానీ జైల్‌ సింగ్‌ గురించి ఉన్నాయి. దులత్‌ రాశారు: ''1982 నుంచి 1987 మధ్య ఆయన చేసిన ప్రతి విదేశీయానంలోనూ నేను వెంట ఉన్నాను.'' అయితే రాష్ట్రపతి వారి సమక్షంలో లేనప్పుడు నిజమైన సరదా జరిగినట్టుంది. ''ఎప్పుడు మేం కొత్త దేశంలో అడుగు పెట్టినాసరే, ఒకవేళ రాష్ట్రపతితో ప్రయాణిస్తున్న కార్యదర్శి రమేశ్‌ భండారీ అయితే, ఆయన నాతో అనేవారు, 'పార్టీ నా రూములో'''. హోనోలూలూ(అమెరికా నగరం) నుంచి తిరిగివస్తూ, కాసేపటి కోసం హాంకాంగ్‌లో ఆగినప్పుడు ''మేము ఎంత అలసిపోయామంటే, ఒక చక్కటి మసాజ్‌ స్వర్గ తుల్యంగా ఉంటుందనిపించింది... సమీపంలో ఎక్కడైనా మసాజ్‌ సెంటర్‌ ఉందా అని హోటల్‌ ఫ్రంట్‌ డెస్క్‌లో ఉన్నవారిని అడిగాను... తీరా నేను పరుగెత్తుకెళ్లి కనుక్కున్నదల్లా అప్పటికే అక్కడికి మంత్రి పదవి కోసం వేచి చూస్తున్న, సరదా మనిషి అయిన ఎన్‌.కె.పి.సాల్వే నాకంటే ముందు చేరుకున్నారని!''

ముఖ్యమైన వ్యక్తుల గురించి దులత్‌కు తెలియవచ్చిన విషయాలు చాలా విశేష ప్రాధాన్యత కలిగినవి. 1984లో సిక్కులను హత్య చేస్తున్న కాలంలో కాంగ్రెస్‌ నేత(అప్పుడు మధ్యప్రదేశ్‌ ముఖ్య మంత్రి) అర్జున్‌ సింగ్‌ను దులత్‌ కలిశారు. ''ఒక ముఖ్యమంత్రిగా భోపాల్‌లోని సిక్కులను మీరు కలిసి వారి భయాలను నివృత్తి చేయాలని నేను సూచించాను... కానీ ఆయన కరాఖండీగా నిరాకరించారు. ఆయన ఎలాంటి అంతఃగర్భితమైన సందేశాన్ని వ్యక్తపరిచారంటే, రాజ్యం– భారత ప్రభుత్వం– తన సందేశాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ తరుణంలో సిక్కులు ఇంకేమిటో కాదు, అభద్రతను ఫీల్‌ కావాలి.''

తన మాజీ సహచరుల్లో ఒకరైన, ప్రస్తుత జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌ దోవల్‌(అజీత్‌ డోభాల్‌) గురించి కూడా దులత్‌ రాశారు. వారిద్దరూ నార్త్‌ బ్లాక్‌లోని ఇంటెలిజెన్స్‌ కార్యాలయంలోని పార్కింగ్‌ ప్లేసులో మొట్టమొదటిసారి కలిశారు. అప్పట్లో దోవల్‌ యువకుడు, దులత్‌ కంటే మూడేళ్లు జూనియర్. ''ఆ రోజుల్లోనే అతడిని చూసినప్పుడల్లా తన కెరియర్‌లో ఎంతో అత్యున్నత స్థానానికి వెళుతున్న మనిషి ఇక్కడున్నాడు అనిపించేది. దోవల్‌ ప్రతి ఒక్కరికీ స్నేహితుడు, అదేసమయంలో ఎవరి స్నేహితుడూ కాదు. ప్రతిరోజూ అలా వ్యవహరించడం అనేది మనలో చాలామందికి ఎంతో కష్టమైన మార్గం.''

ఏమైనా దోవల్‌ మారారని దులత్‌ నమ్ముతున్నారు. యువకుడిగా ఉన్నప్పుడు ఆయన బీజేపీ సీనియర్‌ నేత ఎల్‌.కే.ఆద్వాణీ వీరారాధకుడు, అలాగే పాకిస్తానీయులతో చర్చలకు సిద్ధంగా ఉండేవారు. ఇప్పుడు మాత్రం ''వారితో చర్చలకు, సర్దుబాటుకు ససేమిరా అంటున్నారు. ఇప్పుడు ఆయన దృష్టి అంతా కఠిన వైఖరి మీద, నిర్దాక్షిణ్యత మీద, లక్ష్యాలను చేరుకోవడం మీద ఉంది. పాత రోజుల్లో నాకు తెలిసిన దోవల్‌ ఎన్నడూ నరేంద్ర మోదీపై దృష్టి పెట్టేవారు కాదు. ఆయన దృష్టి అంతా తనకు అభిమాన నేత అయిన ఆద్వాణీ పైనే ఉండేది.''

''అజిత్‌ గురించి చాలావరకు ప్రశంసించదగిన కథనాలు నా వద్ద ఎన్నో ఉన్నాయి,'' అని దులత్‌ కొనసాగిస్తారు. నేననుకోవడం అవి ఆయన వాటిని సీక్వెల్‌ కోసం పదిలపరుచుకుంటున్నట్టున్నారు. వాటి గురించి దోవల్‌ ఏమనుకుంటారోగానీ, వాటిని చదవడానికి నేను మాత్రం వేచి ఉండలేను.

వ్యాసకర్త సీనియర్‌ జర్నలిస్ట్‌

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతా రివర్స్‌



పాకిస్తాన్‌లో వయసు తర్కం ఇలా ఉంటుంది: 36 ఏళ్ల పురుషుడు– పిల్లాడు. 70 ఏళ్ల వృద్ధుడు – ఆకర్షణ కలిగిన సెలబ్రిటీ. 49 ఏళ్ల మహిళ – నానీ అమ్మ. 14–18 ఏళ్ల అమ్మాయి – తనకంటే 40 ఏళ్లు పెద్దవాడైన పురుషుడిని పెళ్లాడగలిగి, దానికోసం సొంతంగా మతం మార్చుకోగలిగి, కుటుంబాన్ని కూడా వదిలేయగలిగే పూర్ణ యువతి.

– అర్సలాన్‌ ఖాన్, పొలిటికల్‌ ఆంత్రోపాలజిస్ట్‌

పౌర నియంత్రణ కోసమే



ఒకప్పుడు నేను 'కోవిడ్‌ పోలీస్‌'గా వ్యవహరించాను. కానీ ఇప్పుడు స్వేచ్ఛను సమర్థిస్తాను. మనల్ని ఆడుకున్నారు. క్షమాపణ కూడా అడగలేనంత తప్పు చేశాను.

– ర్యాన్‌ కన్నింగ్‌హామ్, యూఎస్‌ ఆంట్రప్రెన్యూర్‌

సహజక్రమం నాశనం



కోటీశ్వరులు కూడా చనిపోతున్నంత కాలం మానవ జాతి పరిణమిస్తూనే ఉంటుంది. ఒక్కసారి మరణంలేని జీవితాన్ని సైన్సు కనుక్కుంటే మాత్రం మనం నాశనమైపోతాం.

– ఇంతియాజ్‌ మహమూద్, థింకర్‌

ఎవరో ఉంటారు



ఎర్ర చీమలు, నల్ల చీమల్ని ఒక గ్లాసు జారులో పెడితే ఏమీ జరగదు. కానీ జారును కదిలిస్తే ఆ రెండు రకాలూ పోట్లాడతాయి. నిజానికి అసలైన శత్రువు ఆ జారును కదిలించినవారు. సమాజంలో కూడా ఇంతే. ఒకరితో ఒకరం పోట్లాడుకునేటప్పుడు జారును ఊపినదెవరని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

– జేమ్స్‌ మెల్‌విల్, కామెంటేటర్‌

సమస్యకు అద్దం



ఇంకా 83 కోట్ల మంది భారతీయులకు ఉచిత ఆహార ధాన్యాలు అవసరం అవుతున్నాయంటే, దేశంలోని అత్యధికులు ఎంత పేదరికంలో ఉన్నారో మనం అర్థం చేసుకోవచ్చు.

– తవ్లీన్‌ సింగ్, కాలమిస్ట్‌

నిద్రపోతున్న బాలీవుడ్‌




చాలా రోజుల తర్వాత ఒక బాలీవుడ్‌ సినిమా చూస్తున్నాను. ఒకాయన గట్టిగా గురక పెడుతున్నాడు. అంతే, ఇదే సమీక్ష. ఇదే 2022 సంవత్సరపు బాలీవుడ్‌!

– నమ్రతా జోషి, సినిమా విమర్శకురాలు

సమస్యే లేదు – వేరే అర్థం ఎందుకు?

అభిప్రాయం



డాక్టర్‌ చిఱ్ఱావూరి శివరామ కృష్ణ శర్మ

పత్రికలలో ''2500 ఏళ్లుగా పాణిని వ్యాకరణాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు'' అనే వార్త చదివి తెల్లబోయాను. రిషి రాజ్‌ పోపట్‌ అనే 27 ఏళ్ల యువకుడు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పీహెడీ చేస్తున్నారట. అతడు చేసిన ప్రతిపాదన ఇది. సంస్కృత వ్యాకరణం పన్నెండు సంవత్సరాలు చదవాలని ప్రసిద్ధి. పూర్వం అలా చదివేవారు. ఇరవై ఏడేళ్ల యువకుడు ఇంగ్లీషులో చదివి ఇలా చెప్పడం ఒక వింత.

తమ జీవితాలను విద్యాతపస్సులకు అంకితం చేసిన మునులు వరరుచి, పతంజలి. వారు వ్యాకరణ శాస్త్ర గ్రంథాలను రచించిన వారు. పతంజలి ముని యోగ శాస్త్రాన్ని రచించిన వారు. ప్రపంచంలో చాలా యోగాలకు ఆయన యోగశాస్త్రం మూలం. 'మహా భాష్యం వా పాఠయేత్, మహా రాజ్యం వా పాలయేత్‌' అని ఆర్యోక్తి. పతంజలి ముని వ్యాకరణ మహా భాష్యాన్ని పాఠం చెప్పడం ఒక పెద్ద రాజ్యాన్ని పాలించడంతో సమానం. మహా భాష్యమైనా పాఠం చెప్పాలి. మహా రాజ్యమైనా ఏలాలని పై సంస్కృత సూక్తికి అర్థం. తరువాత కైయటుడు, భట్టోజీ దీక్షితులు, నాగేశ భట్టు మొదలైన వారు బహు శాస్త్ర పండితులు. వీరు వ్రాసిన గ్రంథాలన్నీ అర్థం చేసుకోవడమే గొప్ప విషయం. వీరందరినీ కించపరిచే ఇతడు చెప్పిన విషయాన్ని పరిశీలించాలి.

ఒక పదం తయారు చేయడంలో రెండు సూత్రాలు ఒకేసారి ప్రవర్తిస్తూంటే వానిలో ఏ సూత్రం ప్రవర్తింప చేయాలనే విషయంలో పాణిని ముని 'విప్రతిషేధే పరం కార్యమ్‌' అనే సూత్రం చెప్పారు. సమానమైన బలం కలిగిన రెండు సూత్రాలకు వైరుధ్యం కలిగినపుడు వరుస క్రమంలో తరువాత ఉన్న సూత్రం ఎంచుకోవాలి అని పాణిని మునిని అనుసరించిన గ్రంథకర్తలు తెలిపారు.

''ఈ పద్ధతి వ్యాకరణం ద్వారా అనేకమైన తప్పు రూపాలను తయారు చేస్తుంది'' అని ఇతడి ప్రతిపాదన. కాబట్టి ఇతడు ఈ సూత్రానికి వేరే అర్థం చెబుతున్నారు. ఒక పదం తయారు చేసే క్రమంలో ఒకచోట రెండు సూత్రాలు ప్రవర్తించవలసినపుడు వాటికి వైరుధ్యం వస్తే ఆ పదంలో రెండో భాగంలో ప్రవర్తించవలసిన సూత్రాన్నే ప్రవర్తింప చేయాలి. ఈ పద్ధతిని అవలంబిస్తే సుమారు అన్ని పదాల తయారీలో సరైన సమాధానం లభిస్తుందని ఇతడి ప్రతిపాదన సారాంశం.

ఉదాహరణానికి మంత్ర + భిస్‌ అని ఉన్నపుడు 7 అ – 3 పా – 103 సంఖ్యగల సూత్రంచే మంత్రంలోని త్ర వర్ణమందు గల అకారానికి ఏ కారం వస్తుంది. దీనివల్ల మంత్రేభిః అనే అసాధు రూపం ఏర్పడుతుంది.

7 అ – 1 పా – 9 సంఖ్యగల సూత్రంచే భిస్‌ కు ఐస్‌ వస్తుంది. మంత్ర + ఐస్‌ = మంత్రైః అని తయారవుతుంది. ఇది సరి అయిన రూపం. కాబట్టి రెండు సూత్రాలకు విప్రతిషేధం వస్తే వరుస క్రమంలో తరువాతి సూత్రం అని చెప్పకూడదు.

మంత్ర + భిస్‌ అనే చోట తరువాత ఉన్న ఐస్‌ కి భిస్‌ వస్తోంది. ఇది పదంలో కుడివైపున జరిగే కార్యం. దానిని విధించే సూత్రాన్ని



ఎంచుకోవాలని పాణిని అభిప్రాయం. దీనివలన మంత్రైః అనే సరి అయిన రూపం ఏర్పడుతుందని రిషి రాజ్‌ ప్రతిపాదనం.

సూత్ర గ్రంథాలలో అల్పాక్షరాలలో అనల్పమయిన అర్థాన్ని ఇముడ్చుతారు. దానిలో సారం చాలా ఉంటుంది. దోషం ఉండదు. ఇలాంటి సూత్రాలు విద్యను కంఠస్థం చేయడానికి ఉపయోగిస్తాయి. కాని విద్యార్థికి సూత్రంలో భావం ఎలా తెలుస్తుంది? గురువుల వల్ల, సూత్ర గ్రంథాల అధ్యయనం వల్ల, సూత్రాలపై రాసిన వ్యాఖ్యల వల్ల తెలుస్తుంది. సూత్ర గ్రంథాలకు గురుశిష్య పరంపరగా వచ్చిన అర్థమే గ్రంథకర్త అభిప్రాయం అయ్యే అవకాశాలు అధికం. అలాగే గురు శిష్య పరంపరగా ఈ సూత్రాల అధ్యయనం సాగేది. ఒక సూత్రానికి కొత్త అర్థం చెప్పి పూర్వ గ్రంథాలు చెప్పినది తప్పు అనడం సమంజసం కాదు. కాత్యాయనునికి వరరుచి అని మరో పేరు. ఆయన వార్తికాలన్నీ మహా భాష్యంలో ఉన్నాయి. విడిగా లేవు. పతంజలి యోగ శాస్త్రం వ్రాశారు. వీరి వ్యాకరణ భాష్యాన్ని మహా భాష్యం అంటారు.

బహువచనే ఝల్యేత్‌ 7 అ – 3 పా – 103 సూ.

ఝలాదౌ బహు వచనే సుపి పరే అతోఙ్గ స్యైకార స్స్యాత్‌ రామేభ్యః ఇది పతంజలి భాష్యం.

పై సూత్రం మంత్ర + భిస్‌ అన్నచోట త్ర కారానికి ఏత్వం విధించగలదు. ఇది తరువాతి సూత్రం కనుక మంత్రే + భిస్‌ అని అయ్యే అవకాశం ఉంది.

అతో భిస ఐస్‌ 7 అ – 1 పా – 9 సూ.

'అకారాన్తా దఙ్గా ద్భి స ఐస్‌ స్యాత్, రామైః'

ఇది భాష్యంలోనిది. మంత్ర + భిస్‌ అని ఉన్నపుడు పై సూత్రం చే ఐస్‌ వచ్చి మంత్రైః అని అవుతుంది.

విప్రతిషేధే పరం కార్యమ్‌

ఈ సూత్రం చేత సమాన బలం కలిగిన రెండు సూత్రాలు ఒక చోట ప్రవర్తించవలసి వస్తే తరువాత ఉన్న సూత్రం ప్రవర్తించాలి. కానీ ఇక్కడ వరుసలో పూర్వం ఉన్న సూత్రం ప్రవర్తించిన రూపమే సరియైనది. కారణ మేమిటి ?

అతో భిస ఐస్‌ 7 అ – 1 పా – 9 సూ. వృత్తౌ, ఇహ పరత్వాదేత్వం ప్రాప్నోతి.

... కృతైత్వే భూత పూర్వ మకారం భవిష్యతి. ఐస్తు నిత్యమ్.

... కృతే ప్యేత్వే ప్రాప్నోతి అకృతేపి ప్రాప్నోతి. నిత్యత్వా దైత్వే కృతే విహత నిమిత్తత్వాత్‌ ఏత్వం న భవిష్యతి.

– వ్యాకరణ మహాభాష్యం (244 పు.)

7 అ – 3 పా – 103 వ సూత్రం పర సూత్రం కనుక దాని చేత మంత్ర + భిస్‌ అనే చోట త్ర కారంలో అకారానికి... ఏత్వం చేస్తే ఆ ఏకార స్థానంలో పూర్వం ఉన్నది అకారం కనుక అపుడు కూడా భిస్‌కు ఐస్‌ వస్తుంది. కావున ఐస్‌ నిత్యం. ఐస్‌ చేస్తే ఝలాది వర్ణం పరంగా లేదు కనుక ఏత్వం రాదు అని భాష్యకారులు చెప్పారు.

మంత్రలోని త్ర కారంలో ఉన్న అకారానికి వచ్చిన ఏ కారం అకారం వంటిది ఎలా అవుతుందని ప్రశ్న. సంస్కృత వ్యాకరణంలో 'యథోత్తరం మునీనాం ప్రామాణ్యమ్‌' అని నియమము. పాణిని ముని సూత్రాలకు భాష్యం లేకపోతే అవి అర్థం కావు. పాణిని ముని సూత్రాలకంటే కాత్యాయన ముని వార్తికాలకు, అంతకంటె పతంజలి ముని భాష్యానికి ప్రామాణ్యం ఎక్కువ. వార్తికాలు, భాష్యం లేకపోతే పాణిని సూత్రాలు మొత్తం సంస్కృత పద సముద్రానికి లక్షణం చెప్పలేవు. పతంజలి ముని ఒక శ్లోకం ఉదాహరించారు.

శ్లో. ఏత్వం భిసి పరత్వాచ్చే దత ఐస్క భవిష్యతి
కృత ఐత్వే భూత పూర్వా ద్వైస్తు నిత్య స్తథానతి

ఇది కాత్యాయన ముని వార్తికం అయి ఉంటుంది.

కాబట్టి ఈ కారిక, పతంజలి ముని వచనం ప్రమాణంగా తీసుకుని ఐస్‌ను విధించే సూత్రం నిత్యమని చెప్పడం సముచితమే. 'త్రిముని వ్యాకరణమ్‌' అని ఆర్యోక్తి. ముగ్గురూ వ్యాకరణ విషయంలో ప్రామాణికులే.

పరం కంటే నిత్యం బలమయినది. కనుక ఏత్వం రాకుండా ఐస్‌ వచ్చిందని భావం. పర సూత్రం కంటె నిత్యం బలమయినదని 'పూర్వ పర నిత్యాన్తరఙ్గానా ముత్తరోత్తరం బలీయః' అనే పరిభాష తెలుపుతుంది. కావున పర సూత్రమైన 'బహువచనే ఝల్యేత్‌' అనే సూత్రాన్ని నిత్య సూత్రమైన 'అతో భిస ఐస్‌' బాధించింది. మంత్ర + ఐస్‌ = మంత్రైః అయ్యింది. 'అతో భిస ఐస్‌' నిత్య సూత్రమెలా అవుతుంది? ఏత్వం ఒక వర్ణానికి చెందిన విధి కదా అని ప్రశ్న. ఒక వర్ణానికి చెందిన విధిలో ఆదేశం స్థానివంటిది కాదని నిషేధం ఉంది. అపుడు ఏకారం అకారం వంటిది కాదు. ఇక్కడ భాష్యం వార్తికం ఎలా సరిపడతాయని ఆక్షేపం వస్తుంది. 'అచః పరస్మిన్‌ పూర్వవిధౌ' అనే సూత్రానికి మహాభాష్యంలో 'అజాదేశః పరనిమిత్తకః పూర్వస్య విధిం ప్రతి స్థానివద్‌ భవతి. కుతః పూర్వస్య ఆదేశాద్‌' అనే వాక్యాలున్నాయి.

మంత్ర + భిస్‌ అనే చోట 'బహువచనే ఝల్యేత్‌' అనే సూత్రంచే త్రకారంలో ఉన్న అకారానికి ఏత్వం వచ్చి మంత్రే + భిస్‌ అయ్యింది. ఇప్పుడు 'అతో భిస ఐస్‌' అనే సూత్రం చేత 'భిస్‌'నకు ఐత్వం వస్తున్నపుడు ఆదేశం అయిన ఐస్‌ కంటే పూర్వమందున్న ఏకారానికి స్థానివద్భావం చేస్తే భిస్‌ నకు ఐస్‌ ప్రాప్తించి మంత్రైః అవుతుంది.

కాబట్టి పైన పతంజలి ముని, కాత్యాయన ముని పేర్కొన్నట్లు 'అతో భిస ఐస్‌' నిత్య సూత్రం అయ్యింది. పరం కంటె నిత్యం ప్రబలం కనుక మంత్రైః అనే రూపం సిద్ధిస్తోంది. కాబట్టి ఇక్కడ ఎటువంటి తప్పు, సమస్య, గందర గోళం లేవు.

రిషి రాజ్‌ పోపట్‌ పరిశోధన చేసి ఒక సూత్రానికి కొత్త అర్థం చెప్పి సంస్కృత వ్యాకరణ మార్గంలో ఋషి పుంగవులను, ఋషి తుల్యులను కించ పరిచాడు. తాను విప్రతిషేధే అనే సూత్రానికి కొత్త అర్థం చెప్పడం వల్ల కొన్ని రూపాలు కుదరడం లేదు. ఇది అతడి ప్రసంగం చూసి చేసిన విమర్శ. అతడి సిద్ధాంత గ్రంథాన్ని విమర్శిస్తే అదో పెద్ద గ్రంథమవుతుందేమో!

వ్యాసకర్త రీడర్‌ (విశ్రాంత)
ఆంధ్ర జాతీయ కళాశాల, మచిలీపట్టణం

పోరుకు కావాల్సింది

అదొక ఆశ్రమం. దానికో గురువు. ఆయన దగ్గర కొంత మంది శిష్యులు ఉన్నారు. వాళ్లు తమ ఊళ్ళో నిర్వహించే పందానికి ఓ కోడిని పంపాలని అనుకున్నారు. అందుకుగానూ అనుమతి ఇవ్వాలని గురువును అడిగారు. ఆయన ఆలోచించి సరేనన్నారు. దాంతో వారు కోడిని పోటీ కోసం అన్ని విధాలా సిద్ధం చేశారు. తగిన శిక్షణ ఇచ్చారు. అది ఏ కోడినైనా ఓడిస్తుందేమో అనిపించేలా బొద్దుగా ఎదిగింది. ఓ రోజు ఇంటి మీదికి ఎక్కి పెద్దగా అరిచింది కొక్కొ రొక్కో అంటూ. ఇప్పుడు కోడిని పందానికి పంపించవచ్చునా అని గురువును అడిగారు శిష్యులు. అయితే ఆయన ఇంకొన్ని రోజులు పోనివ్వమన్నారు.



ఇప్పుడు ఆ కోడి ఆ దారిన పోతున్న ఏ కోడిని విడిచిపెట్టకుండా గొడవకు లాగుతోంది. అదొక పెద్ద సమస్యలాగా తయారైంది. ఇదే అదనుగా శిష్యులు ఇప్పుడైనా పందానికి పంపుదామా అని గురువుని అడిగారు. కానీ, ఈసారీ అనుమతి దొరకలేదు. మరిన్ని రోజులు గడిచాయి.

ఇప్పుడు కోడి ఏ ఆర్భాటం చేయకుండా ప్రశాంతంగా ఉంటోంది. మంచి ఊపులో ఉన్నప్పుడే పందానికి అనుమతించాల్సింది; ఇప్పుడు పంపినా గెలుస్తుందన్న నమ్మకం లేదు. అయినా గురువును ఓ మాట అడిగారు. ఆశ్చర్యంగా వెంటనే అనుమతి లభించింది. ఇప్పుడు ఎందుకు అనుమతించారో తెలుసుకుందామని వారు గురువు గారిని కారణం అడిగారు. అప్పుడు గురువు గారు, యుద్ధంలో గెలవడానికి వీరత్వం మాత్రమే సరిపోదు. ప్రశాంతమైన మనసూ, వినయమూ తలపడాలన్న ప్రతి వ్యక్తికీ ప్రధానమే అని చెప్పారు. అప్పుడు శిష్యులకు విషయం బోధపడింది.

– యామిజాల జగదీశ్‌



గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శు.తదియ ఉ.9.32 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: శ్రవణం రా.10.05 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: రా.1.49 నుండి 3.19 వరకు, తిరిగి తె.4.20 నుండి 5.56 వరకు, దుర్ముహూర్తం: ప.12.20 నుండి 1.04 వరకు, తదుపరి ప.2.34 నుండి 3.17 వరకు, అమృతఘడియలు: ప.12.22 నుండి 1.50 వరకు; రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు; సూర్యోదయం 6.31; సూర్యాస్తమయం 5.28.


తూర్పు గోదావరి జిల్లా మధురపూడిలో అనారోగ్యంతో బాధపడుతున్న నదిపల్లి సత్యవతిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొలిచెర్లపాడులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మన ప్రభుత్వం


శ్రీకాకుళం జిల్లా అల్లివలసలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

క్లుప్తంగా...

రెండేళ్ల చిన్నారి అదృశ్యం

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో ఘటన
- 6 ప్రత్యేక టీమ్‌లతో పోలీసుల అన్వేషణ


ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు (వీఆర్సీసెంటర్): తల్లి ఒడిలో ఆడుకునే రెండేళ్ల చిన్నారి అదృశ్యమైన ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం గిరిజన కాలనీకి చెందిన రామయ్య, పాపమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వీరు బిడ్డలను వెంటబెట్టుకుని రోడ్ల వెంబడి చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి సెకండ్ షో సినిమా చూసి కుక్కలగుంట వద్ద ఉన్న మహాలక్ష్మి అమ్మవారి గుడి మెట్ల వద్ద పిల్లలతో కలిసి నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున లేచి చూసే సరికి రెండేళ్ల మూగ బాలిక పాపమ్మ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో స్థానికుల సహకారంతో చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి సీఐ అన్వర్‌బాషా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నాలుగు ప్రత్యేక టీమ్‌లు, మరో రెండు టెక్నికల్ టీమ్‌లను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

27న తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- ఆ రోజు బ్రేక్ దర్శనాలు రద్దు
- నేడు సిఫార్సు లేఖలకు అనుమతి లేదు



ఆలయం వెలుపల కేంద్ర మంత్రి ఆర్కే సింగ్, మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే

తిరుమల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 6–10 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహిస్తారు. ఆనందనిలయం, బంగారువాకిలి, శ్రీవారి ఆలయం లోపల ఉపదేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. ఈ సమయంలో మూలవిరాట్టును వస్త్రంతో కప్పుతారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్య కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం భక్తులను సర్వ దర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా మంగళవారం బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. సోమవారం సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టీటీడీ తెలిపింది.

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్

శ్రీవారిని ఆదివారం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఇందిరేష్, జస్టిస్ నరేంద్ర ప్రసాద్, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధాకిషన్ అగర్వాల్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాసరావు, బీఎస్ఎఫ్ డీజీ పంకజ్ కుమార్ సింగ్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమలలో 14 క్యూ కంపార్ట్‌మెంట్‌లు నిండాయి.సర్వ దర్శన టోకెన్లు లేని వారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో చాలా దుకాణాలు మూతపడ్డాయి.

ఘనంగా సుపరిపాలన దినోత్సవం

సాక్షి, అమరావతి: రాజకీయాల్లో ఎన్నడూ నియమాలు తప్పని నేత మాజీ ప్రధాని వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని ఆదివారం బీజేపీ రాష్ట్ర శాఖ విజయవాడలో సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు, బీజేపీ నేతలు ఐవైఆర్ కృష్ణారావు, వేటుకూరి సూర్యనారాయణ, జనసేన నేతలు పోతిన మహేష్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ.. ప్రధాని పదవిలో ఉండి బలపరీక్షలో ఒక ఓటు తగ్గుతుందని తెలిసీ ఎలాంటి ప్రలోభాల జోలికి పోకుండా ఎన్నికలకు వెళ్లడానికి సిద్ధపడిన నాయకుడు వాజ్‌పేయి అని పేర్కొన్నారు. ఆయన రాజకీయాన్ని ఎప్పుడూ కక్షపూరితంగా చూడలేదని వ్యాఖ్యానించారు. దేశంలో నదుల అనుసంధానం కోసం మార్గదర్శనం చేశారన్నారు.

పండుగలు, ప్రత్యేక పర్వదినాల్లో..
వీఐపీ దర్శనాలకు పరిమితులు

- అందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక సమయం కేటాయింపు
- ఒక్కో వీఐపీతో కేవలం ఆరుగురు కుటుంబ సభ్యులకే అనుమతి
- అంతకుమించి అయితే టికెట్ కొనాల్సిందే
- ఒకరోజు ముందే ఆలయ అధికారులకు సమాచారమివ్వాలి
- ఆ రోజుల్లో సాధారణ భక్తుల దర్శనాలకే పెద్దపీట
- వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు, దివ్యాంగుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- అన్ని ఆలయాల ఈఓలకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: పండుగలు, జాతరలు, ఇతర ప్రత్యేక పర్వదినాల్లో ఉదయం సాయంత్రం వేళ నిర్ణీత సమయంలో ఒకట్రెండు గంటలు మాత్రమే ఆలయాల్లో వీఐపీ దర్శనాలను పరిమితం చేయాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. సాధారణ భక్తులకు సంతృప్త స్థాయిలో తొందరపాటు లేని దర్శనాన్ని సజావుగా అందించడం అత్యంత ప్రాధాన్యతగా దేవదాయ శాఖ భావిస్తోంది. ఆయా రోజుల్లో వృద్ధులు, చిన్నపిల్లల తల్లులతో పాటు దివ్యాంగుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లుచేస్తారు. ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ సూచన మేరకు దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ అన్ని ఆలయాల ఈఓలకు ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. ఉత్తర్వుల్లో ముఖ్యాంశాలు..

- పండుగ, జాతర రోజులతో పాటు ఇతర ప్రత్యేక పర్వదినాల్లో వీఐపీలకు, ఉదయం, సాయంత్రం ఒకట్రెండు గంటల పాటు నిర్ణీత సమయం కేటాయిస్తారు. ఆ సమయంలో కూడా ఒకటి లేదా రెండు సాధారణ భక్తుల క్యూలైన్లు కొనసాగించాలి.
- సామాన్య భక్తులకు సాఫీగా సంతృప్త స్థాయిలో దర్శనాలను అందించడం ఆయా ఆలయాల ఈఓల ప్రాథమిక విధి.
- వీఐపీ, అతని కుటుంబ సభ్యులు మొత్తం ఆరుగురు మించకుండా చూసుకోవాలి. అంతకుమించి ఉంటే వారు దర్శన టికెట్లు కొనుగోలు చేయాలి.
- పండుగ, ప్రత్యేక పర్వదినాల రోజుల్లో ఆలయానికి వచ్చే వీఐపీలకు ఆలయ ఈఓ అవసరమైన మర్యాదలు చేసేందుకు వీలుగా వారు ఆలయ సందర్శన షెడ్యూల్‌కు ఒక్క రోజు ముందు వీఐపీలు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.
- ప్రత్యేక పర్వదినాల్లో వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు అంతరాలయ దర్శనాలపై నియంత్రణ ఉండాలి.
- ఈ రోజుల్లో అన్ని రకాల దర్శన టికెట్లను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే విక్రయించాలి. ఇంటర్‌నెట్ సమస్యలు తలెత్తితే పీఓఎస్ వంటి ప్రత్యేక పరికరాల ద్వారా కేటాయించాలి.
- ఈ టికెట్లను క్యూలైన్‌లో స్కాన్‌చేసే విధానం ఏర్పాటుచేసుకోవాలి. అలాగే, స్కానింగ్ జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటుచేసుకోవాలి. ఈ ఫుటేజీ కనీసం 15 రోజుల పాటు బ్యాకప్‌తో ఉండాలి.
- ఉచిత దర్శనం క్యూలైన్లు ఆలయం తెరిచినంత సేపు కొనసాగించాలి.
- దర్శనాలకు సంబంధించి ప్రత్యేకంగా ఒక అధికారి బాధ్యత తీసుకోవాలి.

అమ్మకు తండులాభిషేకం



అన్నపూర్ణాదేవి జన్మదినం పురస్కరించుకుని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రం స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాత్రి అన్నపూర్ణాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లకు 20 వేల కిలోలకు పైగా తండులముల (బియ్యం)తో అభిషేకం నిర్వహించారు. నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మహిళలు భారీగా తరలివచ్చారు.

- నెల్లూరు (బృందావనం

ఉత్తరాంధ్ర తూర్పు కాపులంతా బీసీ–డీ

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ


మంత్రులు బొత్స, గుడివాడ అమర్‌నాథ్‌లను సత్కరిస్తున్న తూర్పుకాపు అసోసియేషన్ నేతలు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలో నివసిస్తున్న తూర్పు కాపులందరూ బీసీ–డీ లోకే వస్తారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలంలో సత్యనారాయణస్వామి కొండ వద్ద ఆదివారం జిల్లా తూర్పుకాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వనసమారాధనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పుకాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, ఆత్మీయతకే ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న బీసీలు పక్కవారికి చేయూతనందించాలని కోరారు. రాష్ట్ర ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ బీసీల సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బీసీ–డీ కులధ్రువీకరణ పత్రాల మంజూరులో అధికారులు అలసత్వం వహిస్తే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడారు.

రూ. 930 కోట్లతో ఆరు బైపాస్ రహదారులు

- జాతీయ రహదారులను అనుసంధానిస్తూ నిర్మాణానికి ఆమోదం
- 64.20 కి.మీ. మేర నిర్మించనున్న ఎన్‌హెచ్ఏఐ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జాతీయ రహదారులను జిల్లా ప్రధాన రహదారులను అనుసంధానించే కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈమేరకు రాష్ట్రంలో ఆరు బైపాస్ రహదారుల నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ ఆమోదం తెలిపింది. ఒకేసారి ఆరు బైపాస్‌ల నిర్మాణానికి ఆమోదించడం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రూ. 930 కోట్లతో మొత్తం 64.20 కి.మీ. మేర ఈ ఆరు బైపాస్ రహదారులను నిర్మించనున్నారు. పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా, పర్యాటకపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆరు పట్టణాలను జాతీయ రహదారులతో అనుసంధానిస్తూ ఈ బైపాస్‌ల నిర్మాణానికి రూపకల్పన చేశారు. వాటిలో రాయలసీమలోని తాడిపత్రి, వి.కోట, బైరెడ్డిపల్లి, ఆదోని, పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఉన్నాయి. సరుకు రవాణా వాహనాల రద్దీ పెరిగిన దృష్ట్యా ఈ ఆరు పట్టణాల్లో బైపాస్ రహదారులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థకు ప్రతిపాదనలు పంపింది. వీటిని ఇటీవల ఎన్‌హెచ్ఏఐ ఆమోదించింది.

ఎన్‌హెచ్ఏఐ నిర్మించనున్న ఆరు బైపాస్ రహదారుల ప్రణాళిక ఇలా..

- బెంగళూరు–చెన్నై రహదారిని అనుసంధానిస్తూ చిత్తూరు జిల్లా వి.కోట వద్ద నాలుగు లేన్ల బైపాస్ రహదారిని నిర్మిస్తారు. 10 కి.మీ. ఈ రహదారి నిర్మాణానికి రూ. 120 కోట్లు కేటాయించారు.
- కర్నూలు జిల్లా బైరెడ్డిపల్లి వద్ద నాలుగు లేన్ల బైపాస్ రహదారిని ఆరు కి.మీ. నిర్మిస్తారు. రూ. 70 కోట్లతో నిర్మాణానికి ఆమోదించారు.
- తాడిపత్రిలో పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు లేన్ల బైపాస్ రహదారిని నిర్మిస్తారు. 10 కి.మీ. ఈ రహదారిని రూ. 95 కోట్లతో నిర్మించడానికి ఆమోదం తెలిపారు.
- ఆదోనిలో పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు లేన్ల బైపాస్ రహదారిని నిర్మిస్తారు. 7 కి.మీ. ఈ రహదారి నిర్మాణానికి రూ. 80 కోట్లు కేటాయించారు.
- నరసాపురం వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిని అనుసంధానిస్తూ పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు లేన్ల బైపాస్ రహదారి నిర్మిస్తారు. 23.20 కి.మీ. ఈ రహదారిని రూ. 490 కోట్లతో నిర్మించడానికి ఆమోదించారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు వద్ద పేవ్డ్ షోల్డర్స్‌గా బైపాస్ రహదారి నిర్మిస్తారు. 8 కి.మీ. ఈ రహదారి నిర్మాణానికి రూ. 75 కోట్లు కేటాయించారు.

ఇంగ్లండ్‌లో ప్రజా చైతన్యం ఎక్కువ

- హ్యాంప్‌షైర్ కౌంటీ కౌన్సిలర్ అరుణ్ ముమ్మలనేని
- ప్రజా ప్రతినిధులు జవాబుదారీతనంతో వ్యవహరిస్తారు
- నాది వృత్తి ఉద్యోగం.. ప్రవృత్తి రాజకీయం


తల్లి కృష్ణకుమారి, ఇతర కుటుంబసభ్యులు, మిత్రులతో అరుణ్

తెనాలి: ఇంగ్లండ్‌లో ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంతో వ్యవహరిస్తారని, ప్రజల్లో కూడా చైతన్యం ఎక్కువని హ్యాంప్‌షైర్ కౌంటీ కౌన్సిలర్ అరుణ్ ముమ్మలనేని చెప్పారు. అక్కడి నాయకులు గాలివాటుగా వాగ్దానాలు చేయడం కుదరదని, అలా చేసినందువల్ల దేశ ప్రధానమంత్రి సైతం పదవి నుంచి వైదొలగినట్టు గుర్తుచేశారు. స్వస్థలం వచ్చిన అరుణ్ ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలోని మిత్రుడు కుర్రా శ్రీనివాసరావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తన వృత్తి ఉద్యోగమని, రాజకీయం ప్రవృత్తి మాత్రమేనని తెలిపారు. పుట్టినగడ్డలో పలు సేవాకార్యక్రమాలు చేస్తున్న ఆయన తెలిపిన వివరాలు..

- నా స్వస్థలం రేపల్లె దగ్గర్లోని చాట్రగడ్డ. పెరిగిందీ, చదువుకుందీ అమ్మమ్మగారి ఊరైన అమృతలూరు మండలం, మోపర్రు గ్రామం. కాకినాడ, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చేశాక సీఎంసీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. తర్వాత ఇంగ్లండ్ వెళ్లాను.
- హ్యాంప్‌షైర్ కౌంటీలోని బేజింగ్‌స్టోక్ వాయవ్య నియోజకవర్గం ప్రతినిధిగా గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో అధికార కన్సర్వేటివ్ పార్టీ నుంచి భారీ మెజారిటీతో ఎన్నికైన తొలి శ్వేతజాతీయేతరుడిని.
- పార్టీ బేజింగ్‌స్టోక్ ఉపాధ్యక్షుడిగానూ కొనసాగుతున్నా. అక్కడి ప్రాథమిక సభ్యుల ఆమోదంతో ఎంపీగా పోటీచేసేందుకు అర్హత లభించింది. బేజింగ్‌స్టోక్, బారో కౌన్సిల్‌కూ ఎన్నికయ్యాను. స్త్రీ శిశు, కుటుంబ సంక్షేమ అడ్వయిజరీ ప్యానల్ చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నాను. ప్రస్తుతం ఇంగ్లండ్‌లోని రక్షణ మంత్రిత్వశాఖకు ఫ్రీలాన్స్ కన్సల్టెంటుగా ఉన్నా.
- ఇంగ్లండ్‌లో స్థిరపడ్డాక తెలుగువారితో ఓ సంఘం ఏర్పాటులో భాగస్వామినయ్యా. బేజింగ్‌స్టోక్ కల్చరల్ ఫోరం చైర్మన్‌గానూ చేస్తున్నా. తెలుగు బడి పేరుతో వారాంతాల్లో మన వాళ్ల పిల్లలకు తెలుగు నేర్పుతున్నాం.
- ఇంగ్లండ్‌లో నిజమైన అర్హులకే సంక్షేమ పథకాలు లభిస్తాయి. అనర్హులు వాటిని ఆశించరు కూడా.
- ప్రతి ఒక్కరి ఆదాయం, ఖర్చు లెక్కలు ప్రభుత్వానికి తెలుస్తుంది. అవినీతికి ఆస్కారం ఉండదు. 10వ తరగతి వరకు నిర్బంధ విద్య ఉంటుంది.
- సేవా కార్యక్రమాల్లో భాగంగా చాట్రగడ్డలో వృద్ధాశ్రమానికి వితరణ, మోపర్రు, పరిసరాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భోజనం ప్లేట్లు, పుస్తకాలు, యూనిఫాంలు అందించాను.
- కోవిడ్ రోజుల్లోకూడా పలు సేవలు చేశాం. ప్రతిభావంతులైన పేద విద్యార్థులను చదివిస్తున్నాను.

స్వాతంత్ర్యయోధుడు రావూరి కన్నుమూత

- వానపాముల గ్రామంలో విషాదఛాయలు
- గోరా కుమార్తెతో రాష్ట్రంలో తొలి కులాంతర వివాహం ఆయనదే
- నేడు విజయవాడలో అంత్యక్రియలు


అర్జునరావు (ఫైల్)

వానపాముల (పెదపారుపూడి)/లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, నాస్తికోద్యమ నాయకుడు, గాంధేయవాది రావూరి అర్జునరావు (104) కన్నుమూశారు. ఆయన వయోభారంతో ఆదివారం హైదరాబాద్‌లో కుమారుడు డాక్టర్ పవర్ నివాసంలో తుదిశ్వాస విడిచారు. దీంతో ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలం వానపాములలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయనకు భార్య మనోరమ, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మనోరమ నాస్తికోద్యమ నాయకుడు గోరా పెద్దకుమార్తె. అర్జునరావు.. గోరాతో కలిసి స్వతంత్ర పోరాటం, సాంఘిక ఉద్యమాల్లో పనిచేశారు. క్విట్ ఇండియా పోరు సమయంలో జైలు జీవితం గడిపారు. అర్జునరావు, మనోరమ గుజరాత్‌లోని గాంధీ సేవాగ్రాం ఆశ్రమంలో గాంధీతో కలిసి రెండేళ్లు ఉన్నారు. ఆ ఆశ్రమంలో మహాత్మాగాంధీ చేతుల మీదుగా జరగాల్సిన వీరి ఆదర్శ (కులాంతర) వివాహం.. ఆయన హత్యకు గురవడంతో నాటి ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా నిర్వహించారు. జీవితాంతం సామాజిక పరివర్తనకు కృషిచేసిన అర్జునరావు 2018లో వానపాములలో మార్పు ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు వైద్యం, దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అర్జునరావు భౌతికాయాన్ని హైదరాబాద్ నుంచి విజయవాడలో నాస్తిక కేంద్రానికి తరలించి సోమవారం అంత్యక్రియలు జరపనున్నారు.

తిరుపతిలో బోనుకు చిక్కిన చిరుత



తిరుపతి అలిపిరి (తిరుపతి జిల్లా): 10 రోజులుగా తిరుపతి, పరిసర ప్రాంతాల్లో సంచరిస్తోన్న చిరుత ఎట్టకేలకు శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ వీసీ బంగ్లా వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన కేజ్‌లో ఆదివారం వేకువ జామున చిక్కుకుంది. దీన్ని గుర్తించిన అధికారులు చిరుతను సురక్షితంగా శ్రీ వేంకటేశ్వర అభయారణ్యంలోకి విడిచిపెట్టారు. దీంతో చిరుత చిందులేస్తూ అడవిలోకి ఉరికింది. దీని వయసు రెండేళ్లు ఉంటుంది.

టీటీడీ ఈవో ధర్మారెడ్డికి గవర్నర్ ఫోన్లో పరామర్శ

జూపాడుబంగ్లా: పుత్రశోకంతో బాధపడుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఈవో ధర్మారెడ్డిని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. అలాగే డిప్యూటీ సీఎం, ఎక్సైజ్‌శాఖ మంత్రి నారాయణస్వామి, బీసీ వెల్ఫేర్, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నంద్యాల జిల్లా పారుమంచాల గ్రామానికి వెళ్లి ధర్మారెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

నల్లమలలో దారి దోపిడీ

- బంగారం వ్యాపారుల్ని చితకబాది 450 గ్రాముల బంగారం, రూ.7 లక్షల నగదు అపహరణ
- కారును అటకాయించి దోపిడీకి పాల్పడిన దుండగులు


బాధితుల వద్ద వివరాలు సేకరిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు

గిద్దలూరు రూరల్: గుర్తు తెలియని దుండగులు బంగారం వ్యాపారులు ప్రయాణిస్తున్న కారును అటకాయించి.. అందులోని వారిని చితకబాది రూ.7 లక్షల నగదు, 450 గ్రాముల బంగారం దోచుకుపోయిన ఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలో దిగువమెట్ట నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేటకు చెందిన బంగారం వ్యాపారి షేక్ బాజీవలి వద్ద షేక్ పీరావలి, సుభాషిణి, సైదా పనిచేస్తున్నారు. ఆ ముగ్గురు శుక్రవారం నరసరావుపేట నుంచి కారులో నంద్యాల చేరుకున్నారు. వ్యాపార లావాదేవీలు ముగించుకున్న అనంతరం రూ.14 లక్షల నగదు, ఒక కిలో 300 గ్రాముల బంగారాన్ని కారులోని సీక్రెట్ లాకర్‌లో పెట్టి శనివారం రాత్రి 10 గంటలకు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఇదే తరహాలో నరసరావుపేటకు చెందిన మరో ఇద్దరు బంగారు వ్యాపారులు పవన్‌ప్రదీప్, మొహిబ్ రూ.7 లక్షల నగదు, 450 గ్రాముల బంగారాన్ని బ్యాగ్‌లో ఉంచుకుని నరసరావుపేటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. బస్సులు లేవంటూ మొహిబ్ తనకు తెలిసిన తోటి బంగారు వ్యాపారి పీరావలికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారిద్దరినీ తమ కారులోనే నరసరావుపేటకు రావచ్చని చెప్పడంతో అందరూ కలిసి ఒకే కారులో నరసరావుపేట బయలుదేరారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న కారును ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు నంద్యాల నుంచి మరో కారులో వెంబడించారు. నల్లమల అటవీ ప్రాంతంలో అడ్డగించి కారులోని ఐదుగురిని చితకబాదారు. అనంతరం వారిని బయటకు లాగిపడేసి కారుతో పాటుగా దుండగులు గిద్దలూరు వైపుగా వచ్చారు. దొంగిలించిన కారును కేఎస్ పల్లె సమీపంలోని బైరేనిగుండాల పైలట్ ప్రాజెక్టు క్రాస్ రోడ్డులో ఆపి కారులో పవన్‌ప్రదీప్, మొహిబ్‌లకు చెందిన రూ.7 లక్షల నగదు, 450 గ్రాముల బంగారం ఉన్న బ్యాగ్‌ను ఎత్తుకెళ్లిపోయారు. బాధితులు ఐదుగురు నంద్యాల టూ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో వారు గిద్దలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఫిరోజ్, ఎస్సై బ్రహ్మానాయుడు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను గిద్దలూరు వైపు తీసుకొస్తున్న నేపథ్యంలో కేఎస్ పల్లె సమీపంలో కారును గుర్తించారు. కారులోని సీక్రెట్ లాకర్‌ను తెరిచి చూడగా కిలో 300 గ్రాముల బంగారం, రూ.14 లక్షల నగదు జాగ్రత్తగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఏఎస్పీ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

రూ.5 కోట్ల విలువైన గంజాయి ధ్వంసం


గంజాయిని తగులబెడుతున్న పోలీస్ కమిషనర్ రాణా

కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో 702 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.5 కోట్ల విలువైన 14,000 కేజీల గంజాయిని ఆదివారం కంచికచర్ల మండలం పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలకు వెళ్లే రోడ్డులో ధ్వంసం చేశారు. దీనిపై సీపీ కాంతి రాణా టాటా మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలు జరిపినా, రవాణా చేసినా జైలుకు పంపుతామని చెప్పారు. ఇప్పటికే గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసి, జైలుకు పంపినట్లు తెలిపారు. కళాశాలల వద్ద ఇతర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. డీసీపీ మేరీ ప్రశాంతి, నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ఉద్యమం కుప్పకూలక తప్పదు

- బహుజన పరిరక్షణ సమితి



తాడికొండ: అవినీతి సొమ్ముతో బాబు అండ్ కో ఆధ్వర్యంలో కొనసాగుతోన్న కులోన్మాద అమరావతి ఉద్యమం కుప్పకూలక తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తాళ్ళాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 819వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు ఆదివారం పలువురు హాజరై ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో అమరావతి ప్రాంతంతో పాటు అన్ని ప్రాంతాల్లో బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతుందని, అది చూసి ఓర్వలేక బాబు అండ్ కో ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారాలకు పూనుకుంటోందని మండిపడ్డారు. అమరావతి ఉద్యమానికి ప్రజల మద్దతు లేదన్నారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

మెరుపులు మరకలు



ప్రగతి పథంలో సాగుతున్న 'స్వతంత్ర' కవాతుకు అమృతోత్సవ సంబరాలు...
ఆదివాసీ మహిళను దేశ అత్యున్నత పీఠంపై కూర్చోబెట్టిన ప్రజాస్వామ్య సొగసులు...
'ఆత్మ నిర్భర్' లక్ష్యంతో రక్షణ రంగంలో అగ్ని, ప్రచండ, విక్రాంత్ మెరుపులు...
అంతరిక్ష రంగంలో ఇతర దేశాలతో పోటీ పడేలా తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్–ఎస్ చిమ్మిన నిప్పులు...
బ్రిటన్‌ను దాటేసి ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వడివడిగా పెట్టిన పరుగులు...
కంటికి కనిపించని క్రిమిపై పోరాటంలో ప్రపంచ దేశాలకు చూపిన ఆదర్శం...
...ఇవన్నీ ఈ ఏడాది మనం సాధించిన ఘన విజయాల్లో కొన్ని.
సైన్యంలో తాత్కాలిక నియామకాలకు తెరలేపిన 'అగ్ని'పథం, మైనార్టీ మహిళల హిజాబ్ ధారణపై వివాదం
...వంటి కొన్ని మరకలు.
ఎంతో ఇష్టం, కొంచెం కష్టంగా సాగిన 2022లో ముఖ్య ఘటనలపై విహంగ వీక్షణం...

- సాక్షి, నేషనల్ డెస్క్





- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత ఒక ఆదివాసీ మహిళ అత్యున్నత పదవిని అధిష్ఠించడం ఒక చరిత్రగా నిలిచింది. సంతాల్ గిరిజన తెగకు చెందిన ద్రౌపది ముర్ము (64) అధికార ఎన్డీయే అభ్యర్థిగా రాష్ట్రపతి ఎన్నికల్లో నెగ్గి కొత్త చరిత్ర లిఖించారు. దేశ 15వ రాష్ట్రపతిగా సగర్వంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె ఒడిశాలో మయూర్‌భంజ్ జిల్లాకు చెందినవారు.
- భారత్ ఈ ఏడాది ఆర్థికంగా పుంజుకొని యూకేను కూడా దాటేసి ప్రపంచంలోని అతి పెద్ద అయిదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని నవంబర్ 15న అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తన నివేదికలో వెల్లడించింది.
- భారత్ తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్–ఎస్ నవంబర్ 18న శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా దూసుకుపోయింది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ అనే స్టార్టప్ కంపెనీ రూపొందించిన ఈ రాకెట్ మూడు ఉపగ్రహాలను కక్ష్యలోకి తీసుకువెళ్లింది.
- దేశంలో డిజిటల్ లావాదేవీలు పెంచడానికి, కాగితం కరెన్సీ నిర్వహణకయ్యే ఖర్చుని తగ్గించడం కోసం ఆర్‌బీఐ డిసెంబర్ 1 నుంచి ప్రయోగాత్మకంగా డిజిటల్ రుపీని అమల్లోకి తీసుకువచ్చింది.

మెరుపులు

- ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతమిస్తూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బాహుబలి యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబర్ 2న కొచ్చితీరంలో జాతికి అంకితం చేశారు. రూ.20వేల కోట్ల ఖర్చుతో నిర్మించిన ఈ నౌక క్షిపణి దాడుల్ని తట్టుకోగలదు. ఇలాంటి సామర్థ్యం కలిగిన యుద్ధనౌకలున్న అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ సరసన సగర్వంగా తలెత్తుకొని నిల్చున్నాం. భారత వాయుసేనలో తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ ప్రచండని అక్టోబర్‌లో ప్రవేశపెట్టారు. ఇక అణు పేలోడ్లను మోసుకువెళ్లే సామర్థ్యం కలిగిన అగ్ని–5 క్షిపణిని డిసెంబర్ 15న విజయవంతంగా ప్రయోగించడంతో త్రివిధ బలగాలు బలోపేతమయ్యాయి.



మరకలు

- సైన్యంలో తాత్కాలిక నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం దేశవ్యాప్తంగా అగ్గిరాజేసింది. యువకులకు నాలుగేళ్లు సైన్యంలో పనిచేసే అవకాశం మాత్రమే కల్పించడంతో పాటు పింఛన్ సదుపాయం కూడా లేని ఈ పథకానికి జూన్ 14న కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా, తెలంగాణ, ఒడిశా, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఆందోళనలు హింసకు దారితీశాయి.
- కర్ణాటకలో ఉడిపిలో కళాశాలలో జనవరిలో హిజాబ్ ధరించి వచ్చినందుకు కొందరు ముస్లిం అమ్మాయిలను తరగతి గదుల్లోకి రానివ్వకపోవడం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. వీరికి పోటీగా కొందరు విద్యార్థులు కాషాయ దుస్తులు ధరించి రావడంతో మతఘర్షణలకు దారి తీసింది. కర్ణాటక ప్రభుత్వం ఫిబ్రవరి 5న హిజాబ్‌పై నిషేధం విధిస్తే మార్చి 15న హైకోర్టు దానిని సమర్థిస్తూ తీర్పు చెప్పింది. అక్టోబర్ 13న సుప్రీంకోర్టు భిన్న తీర్పులు వెలువరించడంతో తుది నిర్ణయం భారత ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని బెంచ్ చేతుల్లోకి వెళ్లింది.



- గుజరాత్‌లోని మోర్బిలో అక్టోబర్ 30 కుప్పకూలిపోయిన కేబుల్ వంతెన దుర్ఘటనలో 138 మంది మరణించారు. మానవ తప్పిదాల కారణంగానే ఈ వంతెన కుప్పకూలిపోయింది. ఒకేసారి వంతెనపైకి వంద మంది వెళ్లడానికి మాత్రమే వీలుంటే, నిర్వాహకులు 500 మందిని పంపడంతో ప్రమాదం జరిగింది.
- ఢిల్లీలో నివాసముంటున్న శ్రద్ధా వాకర్ అనే యువతిని ఆమెతో సహజీవనం చేస్తున్న అఫ్తాబ్ పూనెవాలె మే 18న గొంతు కోసి హత్య చేయడంతో పాటు ఆమె మృతదేహాన్ని 35 ముక్కలు చేసి చుట్టుపక్కల అడవుల్లో పారేసిన ఘటన దేశంలో సంచలనం సృష్టించింది. మృతదేహం ముక్కల్ని ఫ్రిజ్‌లో ఉంచి రోజుకి కొన్ని పారేసిన వైనం ఒళ్లు జలదరించేలా చేసింది. నవంబర్ 11న అఫ్తాబ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

విషాదాలు



- యావత్ భారతావనిని దుఃఖసాగరంలో ముంచేస్తూ భారతరత్న, గానకోకిల లతామంగేష్కర్ (92); పద్మవిభూషణ్, కథక్ దిగ్గజం పండిట్ బిర్జు మహరాజ్ (83) తిరిగిరాని లోకాలకు తరలిపోయారు.
- సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, ములాయం సింగ్ యాదవ్ కన్నుమూయడంతో ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఒక ఉజ్వల శకానికి తెర పడింది.

విశ్వవేదికపై...

- ప్రపంచంలో అత్యంత శక్తిమంతదేశాల కూటమి జీ20కి అధ్యక్ష బాధ్యతల్ని భారత్ స్వీకరించింది. 2023 నవంబర్ 30 దాకా ఈ బాధ్యతల్లో కొనసాగనుంది. 50 నగరాల్లో 200 సన్నాహక భేటీల అనంతరం 2023 సెప్టెంబర్‌లో ఢిల్లీలో జీ20 సదస్సును నిర్వహించనుంది.
- ఐరాస భద్రతా మండలి అధ్యక్ష హోదాలో కౌంటర్ టెర్రరిజం కమిటీ (సీటీసీ) సదస్సును అక్టోబర్ 28, 29 తేదీల్లో ముంబై, ఢిల్లీల్లో జరిగింది.
- అరుణాచల్‌ప్రదేశ్‌లో తవాంగ్ సెక్టార్‌లో భారత్, చైనా సైనికుల మధ్య డిసెంబర్ 9న ఘర్షణలు జరిగాయి. వాస్తవాధీన రేఖ దాటి చొచ్చుకొచ్చేందుకు చైనా చేసిన ప్రయత్నాలను మన బలగాలు దీటుగా తిప్పికొట్టాయి.

యాత్రలు, విజయాలు, చీలికలు

- కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 12 రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన 150 రోజుల భారత్ జోడో యాత్ర సెప్టెంబర్ 7న ప్రారంభమైంది. ఇటీవల వంద రోజులు పూర్తి చేసుకుంది.
- గాంధీ కుటుంబానికి చెందని సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ అధ్యక్ష పగ్గాలు చేపట్టి రికార్డు సృష్టించారు.
- ఈ ఏడాది మొదట్లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా; చివర్లో హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా... ఇలా ఐదు రాష్ట్రాల్లో నెగ్గి బీజేపీ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. కాంగ్రెస్ హిమాచల్‌తో సరిపెట్టుకోగా ఆమ్ ఆద్మీ పార్టీ అనూహ్యంగా పంజాబ్‌లో అఖండ విజయం సాధించింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ నెగ్గి బీజేపీ 15 ఏళ్ల పాలనకు తెరదించింది. జాతీయ పార్టీగానూ అవతరించింది!
- బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మరోసారి యూటర్న్ తీసుకున్నారు. ఆగస్టులో ఎన్డీయేకి గుడ్ బైకొట్టి తిరిగి మహాఘట్‌బంధన్‌లో చేరి ఆర్‌జేడీ, కాంగ్రెస్ మద్దతుతో మళ్లీ సీఎం పగ్గాలు చేపట్టారు.
- మహారాష్ట్రలో శివసేన కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంది. పార్టీని ఏక్‌నాథ్ షిండే రెండు ముక్కలు చేశారు. భారీగా ఎమ్మెల్యేలను చీల్చి బీజేపీ మద్దతుతో సీఎం అయ్యారు.
- నేషనల్ హెరాల్డ్ కేసు గాంధీ కుటుంబాన్ని వెంటాడుతోంది. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు తొలిసారిగా ఈ ఏడాది ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. కేంద్ర విచారణ సంస్థలైన ఈడీ, సీబీఐ ఈ ఏడాదంతా బిజీగా గడిపాయి. పలు విపక్ష పార్టీల నేతలను విచారించాయి. పలువురిని అరెస్టు చేశాయి. దీని వెనక రాజకీయ కక్షసాధింపు ఉందంటూ విపక్షాలు మండిపడ్డాయి.



చరిత్రాత్మక తీర్పులు...

- అత్యంత వివాదాస్పదమైన దేశద్రోహ చట్టం పై 124ఏ అమలుపై స్టే విధిస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం మే 11న తీర్పు చెప్పింది. 124ఏపై కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలన పూర్తయ్యేవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేసులు నమోదు చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది.
- మహిళల శరీరంపై వారికే హక్కు ఉందని అత్యున్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పునిచ్చింది. పెళ్లితో సంబంధం లేకుండా మహిళలందరూ 24 వారాలవరకు సురక్షిత గర్భవిచ్ఛిత్తికి అనుమతినిచ్చింది. సెప్టెంబర్ 29న ఈ తీర్పు చెప్పిన సుప్రీం అబార్షన్ చట్టాల ప్రకారం పెళ్లయినవారు, కాని వారు అన్న తేడా ఉండదని స్పష్టం చేసింది.



- భార్య ఇష్టానికి వ్యతిరేకంగా భర్త శృంగారం చేసినా అది అత్యాచారం కిందకే వస్తుందని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. ఎంటీపీ చట్టం ప్రకారం మారిటల్ రేప్‌లు కూడా అత్యాచారం కిందకే వస్తాయని స్పష్టం చేసింది.
- ఇంటి అల్లుడు ఇంటి నిర్మాణం కోసం డబ్బులు డిమాండ్ చేసినా అది కట్నం కిందకే వస్తుందని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

కరోనా కేసుల సంఖ్యపై...
చైనా గప్‌చుప్

బీజింగ్: కరోనా కేసుల సంఖ్యపై చైనా గోప్యత పాటిస్తోంది. రోజువారీ కేసుల వివరాలను ఆదివారం నుంచి వెల్లడించబోవడం లేదని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ తెలిపింది. జీరో కోవిడ్ విధానాన్ని ఎత్తేశాక గత 20 రోజుల్లోనే 25 కోట్ల మందికి కరోనా సోకిందంటూ అధికార పత్రాల ద్వారా లీకవడంతో ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు. దేశంలో ఆస్పత్రుల్లోని ఐసీయూలన్నీ బీఎఫ్.7 వేరియంట్ బాధితులతో, మార్చురీలన్నీ మృతదేహాలతో నిండిపోతున్నాయి. 2023లో చైనాలో 20 లక్షల కోవిడ్ మరణాలు సంభవించవచ్చని అంచనాలున్నాయి. బీజింగ్‌లో కోవిడ్ మృతుల అంత్యక్రియలకు రోజులు పడుతోందని రాయిటర్స్ పేర్కొంది. ''బీజింగ్‌లో కంటెయినర్లలో మృతదేహాలను తరలిస్తున్నారు. ఒక శ్మశానం వద్ద ఒక్క రోజే 10 కంటెయినర్ల మృతదేహాలు కనిపించాయి'' అంటూ ఒకరు ట్వీట్ చేశారు. కింగ్‌డావో మున్సిపాలిటీలో ఒక్క రోజే 5.3 లక్షల కేసులు నమోదైనట్లు సమాచారం. ఆ గణాంకాలను వెంటనే ఆన్‌లైన్ నుంచి తొలగించారు. చాలా గ్రామాల్లో క్లినిక్కులు జ్వరం తదితర కరోనా లక్షణాల బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి.



క్లుప్తంగా...

నటి ఆత్మహత్య కేసు... సహ నటుని అరెస్టు



పాల్ఘర్: టీవీ, సినీ నటి తునీషా శర్మ (21) ఆత్మహత్య కేసులో ఆమె సహ నటుడు షీజన్ ఖాన్ (27)ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి పలు అభియోగాలు మోపారు. కోర్టు అతనికి నాలుగు రోజుల రిమాండ్ విధించింది. శనివారం ఓ సీరియల్ షూటింగ్ సెట్‌లోనే తునీషా ఆత్మహత్యకు పాల్పడటం తెలిసిందే. ''షీజనే ఇందుకు కారణం. నా కూతురు అతనితో ప్రేమలో ఉంది'' అంటూ ఆమె తల్లి ఆరోపించింది.

మద్యం బానిసలకు పిల్లనివ్వకండి: మంత్రి



సుల్తాన్‌పూర్: ''మీ కూతురిని మద్యానికి బానిసైన ప్రభుత్వోద్యోగి కంటే రిక్షా కార్మికునికో, దిన కూలీకో ఇవ్వడం మేలు. మీ తోబుట్టువులను, కూతుళ్లను మద్యం బానిసలకిచ్చి పెళ్లి చేయకండి. ఆ వ్యసనపరుల ఆయుర్దాయం స్వల్పం...'' అని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ అన్నారు! యూపీలోని లంభువాలో ఓ డీ అడిక్షన్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''నేను ఎంపీ, నా భార్య ఎమ్మెల్యే అయినా మా కొడుకును మద్యానికి బానిసవకుండా కాపాడుకోలేకపోయాం. తను స్నేహితులతో కలిసి మందు తాగేవాడు. డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్చాం. తాగుడు మానానంటూ పెళ్లి చేసుకున్నాడు. కానీ మళ్లీ తాగడం మొదలుపెట్టి చివరికి ప్రాణాలు కోల్పోయాడు. రెండేళ్ల కొడుకుతో నా కోడలు వితంతువుగా మిగిలింది'' అంటూ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ''స్వాతంత్ర్యం కోసం 90 ఏళ్లపాటు బ్రిటిషర్లపై జరిపిన పోరాటంలో 6.32 లక్షల మంది చనిపోతే, మద్యపానం వల్ల ఏడాదికి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. యూపీలో క్యాన్సర్ మరణాల్లో 80% పొగాకు, ధూమపానం వల్లే'' అని ఆవేదన వెలిబుచ్చారు. డీ అడిక్షన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, కుటుంబాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

నేపాల్ ప్రధానిగా ప్రచండ



కఠ్మాండు: నేపాల్‌లో నెల రోజుల రాజకీయ అస్థిరతకు ఆదివారం తెర పడింది. మాజీ గెరిల్లా నాయకుడు, సీపీఎన్–మావోయిస్టు సెంటర్ చైర్మన్ పుష్పకమల్ దహాల్ ప్రచండ (68) కొత్త ప్రధానిగా నియమితులయ్యారు. ఆయన సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. అంతకుముందు నాటకీయ పరిణామాల మధ్య నేపాలీ కాంగ్రెస్ సారథ్యంలోని ఐదు పార్టీల కూటమి నుంచి వైదొలిగిన ప్రచండ సీపీఎన్–యూఎంఎల్ తదితర పక్షాలతో జట్టు కట్టారు. 275 మంది ఎంపీలున్న పార్లమెంటులో ఆయన సారథ్యంలోని సంకీర్ణానికి 168 మంది మద్దతు సమకూరింది. ప్రధాని బాధ్యతలు చేపట్టడం ప్రచండకు ఇది మూడోసారి. ఆయనకు చైనా అనుకూలునిగా, భారత వ్యతిరేకిగా పేరుంది.

భారత్‌పై చైనా, పాక్ సంయుక్త దాడి: రాహుల్

న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్ కలిసి ఇవాళోరేపో భారత్‌పైకి దండెత్తి రావొచ్చని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మాజీ సైనికాధికారులతో ఆదివారం జరిగిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. భారత్ అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. తక్షణం తగు చర్యలు తీసుకోకుంటే గట్టి ఎదురుదెబ్బ తగిలే ప్రమాదముందన్నారు. గల్వాన్, డోక్లాం సంఘర్షణలు చైనా వ్యూహంలో భాగాలేనని ఆయన తెలిపారు.



వాటికన్‌లో క్రిస్మస్ వేడుకలు

ఆదివారం వాటికన్ సిటీలో సెయింట్ పీటర్స్ బాసిలికాలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో బాల యేసు ప్రతిమను ముద్దాడుతున్న పోప్ ఫ్రాన్సిస్

భారతీయ వంటలకు జై



న్యూఢిల్లీ: అత్యుత్తమ వంట విధానాలున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. ఇటలీ, గ్రీస్, స్పెయిన్ తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి. వంటలో వాడే పదార్థాలు, దినుసులు, పానీయాలపై ప్రేక్షకుల ఓట్ల ఆధారంగా ర్యాంకులు దక్కాయి. 2022కు గాను టేస్ట్ అట్లాస్ చేపట్టిన ఈ ఓటింగ్‌లో భారత్‌కు 4.54 పాయింట్లు వచ్చాయి. జపనీస్ వంటకాలు నాలుగో స్థానంలో ఉన్నాయి. టేస్ట్ అట్లాస్ అవార్డ్స్ 2022 ఫలితాల ప్రకారం..400కు పైగా భారత వంటదినుసుల్లో గరం మసాలా, ఘీ, మలాయ్, బటర్ గార్లిక్ నాన్, కీమా తదితరాలకు అగ్రస్థానం దక్కింది. దేశంలో మంచి ఆదరణ ఉన్న 450 హోటళ్లలో ముంబైలోని ప్రముఖ శ్రీ థాకర్ భోజనాలయ్, బెంగళూరులోని కారవల్లి, ఢిల్లీలోని బుఖారా, దమ్ పుఖ్త్, గురుగ్రామ్‌లోని కొమోరిన్ రెస్టారెంట్లకు అత్యధిక ఓట్లు పడ్డాయి. అయితే, ప్రపంచదేశాల్లో ఆదరణ ఉన్న చైనా వంటకాలకు 11వ స్థానం, పేరున్న థాయ్ వంటకాలకు 30వ స్థానం దక్కడంపై నెటిజన్లు అభ్యంతరం తెలిపారు. కాగా, ఈ జాబితాలో అమెరికా 8వ, ఫ్రాన్సు 9వ ర్యాంకుల్లో నిలవడం గమనార్హం.

మంచు గుప్పెట్లోనే అమెరికా

బఫెలో: అమెరికాలో మంచు తుఫాను బీభత్సం కొనసాగుతూనే ఉంది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పతనమవుతున్నాయి. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్యే పౌరులు క్రిస్మస్ సంబరాలు జరుపుకుంటున్నారు. న్యూయార్క్ తదితర రాష్ట్రాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇంత దారుణమైన వాతావరణ పరిస్థితులను రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ చూడలేదని న్యూయార్క్‌వాసులు చెబుతున్నారు. బఫెలో తదితర చోట్ల హరికేన్లను తలపించే గాలులు ప్రజల కష్టాలను రెట్టింపు చేస్తున్నాయి. రోడ్లు, రన్‌వేలపై ఏకంగా 50 అంగుళాలకు పైగా మంచు పేరుకుపోయింది. దాంతో పలు విమానాశ్రయాలను రెండు రోజుల పాటు మూసేశారు. శని, ఆదివారాల్లో కూడా వేలాది విమానాలు రద్దయ్యాయి. దేశవ్యాప్తంగా కరెంటు సరఫరాలో అంతరాయాలు వరుసగా మూడో రోజూ కొనసాగాయి. అయితే పలుచోట్ల పరిస్థితిని అధికారులు క్రమంగా చక్కదిద్దుతున్నారు. బహుశా ఒకట్రెండు రోజుల్లో పరిస్థితులు కాస్త మెరుగు పడొచ్చని భావిస్తున్నారు.



మసాచుసెట్స్ రాష్ట్రంలోని అమహెస్ట్‌లో దట్టంగా పరుచుకున్న మంచు

మనకిది అద్భుత ఏడాది

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: 2022వ సంవత్సరం భారత్‌కు స్ఫూర్తిదాయకమైన, అద్భుతమైన ఏడాది అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కాలంలో దేశం ఎన్నో రంగాల్లో ముందడుగు వేసి, ప్రపంచ దేశాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని చెప్పారు. ఈ ఏడాది చిట్టచివరి మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆదివారం ప్రధాని మాట్లాడారు. దేశం 2022లో సాధించిన పలు మైలురాళ్లను ప్రస్తావించారు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని చెప్పారు. 400 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతుల రికార్డును నెలకొల్పింది. 'మహిళల్లో వచ్చే బ్రెస్ట్ కేన్సర్‌ను యోగా, ఆయుర్వేద చికిత్సా విధానాల ద్వారా నయం చేయవచ్చంటూ టాటా రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ పరిశోధనల ద్వారా నిరూపించింది. ఈ ఫలితాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడం గర్వ కారణం. ప్రాచీన సంప్రదాయ వైద్య విధానాలను ఎన్నిటినో మనం ఆచరిస్తున్నప్పటికీ ఇలాంటి అధ్యయనం జరగడం ఇదే ప్రథమం. ఇదే స్ఫూర్తితో మరిన్ని అధ్యయనాలకు ఢిల్లీలోని ఎయిమ్స్ శ్రీకారం చుట్టింది'అని వెల్లడించారు. 'ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో 220 కోట్ల కోవిడ్ టీకా డోసుల పంపిణీ పూర్తయింది. దేశీయ తయారీ విమాన వాహక నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ జల ప్రవేశం చేసింది. ఇంకా అంతరిక్షం, రక్షణ, డ్రోన్ రంగాల్లో గణనీయ ప్రగతిని సొంతం చేసుకున్నాం. 75వ స్వాతంత్ర్య వేడుకలను పూర్తి చేసుకుని, అమృత్ కాల్‌ను ఈ ఏడాది నుంచే ప్రారంభించాం. కామన్‌వెల్త్ క్రీడలతోపాటు, మహిళల హాకీ జట్టు విజయం వంటివి ఎన్నో ఉన్నాయి. జి–20 అధ్యక్ష పదవిని చేపట్టాం. స్మాల్ పాక్స్, పోలియో, గినియా వార్మ్ వంటి వ్యాధులను పూర్తిగా నిర్మూలించగలిగాం. కాలా అజార్ వ్యాధి మొన్నమొన్నటి వరకు దేశంలోని 50 జిల్లాల్లో ఉండగా నేడు బిహార్, జార్ఖండ్‌లోని నాలుగు జిల్లాలకు మాత్రమే పరిమితం చేయగలిగాం'అని ప్రధాని చెప్పారు. 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం గంగా జలాల శుద్ధికి అమలు చేస్తున్న 'నమామి గంగే'కార్యక్రమాన్ని పర్యావరణ పరిరక్షణకు ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న టాప్–10 ప్రాజెక్టుల్లో ఒకటిగా ఐక్యరాజ్యసమితి గుర్తించడం మనకు గర్వకారణమని ప్రధాని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

కోవిడ్ ప్రొటోకాల్స్ పాటించండి..!

ప్రపంచ వ్యాప్తంగా మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండటం పట్ల ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. 'ఈ పండుగల వేళ ప్రయాణాలు చేసే వారు మాస్కులు ధరించడం, చేతులు కడుక్కోవడం వంటి కోవిడ్ ప్రొటోకాల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. మన ఆనందం ఇతరులకు ప్రతికూలంగా మారి వైరస్ బారిన పడేలా చేయరాదు'అని సూచించారు.



వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద మోదీ నివాళులు

గ్వాలియర్‌లో 10,000 ఎకరాల్లో వాజ్‌పేయి స్మృతివనం

గ్వాలియర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మెమోరియల్‌ను ఆయన స్వస్థలం గ్వాలియర్‌లో ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. సిరోల్ ప్రాంతంలోని సుమారు 10 వేల ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ విషయం తెలిపింది. బీజేపీ అగ్రనేత, మాజీ ప్రధాని వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25వ తేదీన గ్వాలియర్‌లో జన్మించారు.

అనర్హులకు లబ్ధి

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల రిటైర్మెంట్ వయసు పెంపుపై కేంద్రం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల రిటైర్మెంట్ వయసు పెంపు ప్రతిపాదనలపై కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. ''దాన్ని పెంచితే సరైన అర్హత లేని, సరైన పనితీరు కనబరచని న్యాయమూర్తుల సర్వీసూ పెరుగుతుంది. పైగా ప్రభుత్వోద్యోగుల నుంచీ రిటైర్మెంట్ వయసు పెంపు డిమాండ్‌కు ఇది దారి తీయొచ్చు'' అని పేర్కొంది. ఈ మేరకు సిబ్బంది, న్యాయ వ్యవహారాల పార్లమెంటు సంఘానికి ప్రజెంటేషన్ సమర్పించింది. ''కాబట్టి ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరముంది. ఉన్నత న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం చేపట్టే చర్యల్లో భాగంగా రిటైర్మెంట్ వయసు పెంపు అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటాం'' అని తెలిపింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు 65 ఏళ్లు, హైకోర్టు న్యాయమూర్తులు 62 ఏళ్లకు రిటైరవుతున్నారు. దీన్ని పెంచేందుకు 2010లో 114వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ 15వ లోక్‌సభ రద్దుతో దానికి కాలదోషం పట్టింది.



కశ్మీర్‌లో భారీ ఆయుధ డంప్


జమ్మూకశ్మీర్‌లో సరిహద్దులకు సమీపంలోని ఉడిలో భారీగా ఆయుధ డంప్ బయటపడింది. ఇందులో 24 ఏకే-74 రైఫిళ్లు, 12 చైనీస్ పిస్టళ్లు, చైనీస్ హ్యాండ్ గ్రెనేడ్లు, 5 పాక్ తయారీ హ్యాండ్ గ్రెనేడ్లు, ఐ లవ్ పాకిస్తాన్ అని రాసి ఉన్న 81 బెలూన్లు భారీగా మందు గుండు సామగ్రి ఉన్నాయి. వీటిని తీవ్రవాదులకు అందించేందుకు దొంగచాటుగా పాక్ తరలించిందని అధికారులు తెలిపారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 26 । డిసెంబర్ । 2022



అభివృద్ధి పనులు ప్రారంభం

నందిగామలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు.



రూ.5 కోట్ల గంజాయి ధ్వంసం

కంచికచర్ల: పలు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.5 కోట్ల విలువ చేసే 14 వేల కిలోల గంజాయిని ఆదివారం కంచికచర్ల మండలం పరిటాల శివారులో ధ్వంసం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం తెలిపారు. డివిజన్, మండల స్థాయిలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

బెజవాడ రోలర్స్‌కు మూడు జాతీయ పతకాలు



విజయవాడ స్పోర్ట్స్: బెంగళూరులో ఇటీవల జరిగిన 60వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీల్లో బెజవాడ రోలర్ స్కేటింగ్ క్రీడాకారులు సత్తా చాటారు. విజయవాడ నుంచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని చాటారు. ఇన్‌లైన్ డౌన్‌హిల్ సీనియర్స్ విభాగంలో బచ్చు వరుణ్‌కృష్ణ, అండర్ 9–11 స్పీడ్ ఇన్‌లైన్ విభాగంలో ఎన్.నిహారిక బంగారు పతకాలు, ఫ్రీ స్టయిల్ జూనియర్స్ విభాగంలో సీహెచ్.అభిరామ్ కాంస్య పతకం సాధించారు. ఈ క్రీడాకారులను బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి మాధవికృష్ణ అభినందించారు.

దుర్గమ్మకు బంగారు కాసుల హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు భక్తులు ఆదివారం బంగారు కాసుల హారాన్ని కానుకగా సమర్పించారు. విజయవాడకు చెందిన ఎం.సేతు అనురాగ్, వైష్ణవి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి సుమారు రూ.6 లక్షల విలువైన 124 గ్రాముల బంగారు కాసుల హారాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ ఈఓ భ్రమరాంబ అందజేశారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి



కోడూరు(అవనిగడ్డ): మండలంలోని హంసలదీవి సాగరతీరం పర్యాటకుల రాకతో సందడిగా మారింది. ఆదివారం, క్రిస్మస్ సెలవు రోజు కావడంతో సాగరతీరానికి యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పాలకాయతిప్ప బీచ్ వద్ద పర్యాటకులు సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. అమావాస్య పోటు కారణంగా అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో పర్యాటకులను సాగర సంగమం వద్దకు అనుమతించలేదు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు పర్యాటకులకు సముద్ర స్థితిగతులపై అవగాహన కల్పిస్తు అప్రమత్తం చేశారు. సీఐ వల్లభనేని పవన్ కిషోర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్‌జానీ, సిబ్బంది గస్తీ చేపట్టారు.

ఏసుక్రీస్తు జననం..

జగమంతా సంబరం



విజయవాడ వన్‌టౌన్ తారాపేట సెయింట్ పీటర్స్ కెథెడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ చింతా రాకేష్, ఫాదర్ దామల విజయకుమార్, ఫాదర్ తమలం రవి

లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు ప్రభు రాకకు ఘన స్వాగతం పలికాయి. మానవాళి రక్షణకు అవతరించిన ఏసుక్రీస్తుకు ఫాదర్లు దివ్యబలిపూజ సమర్పించారు. చర్చిల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. భక్తులు స్తుతి గీతాలతో ప్రభువును ప్రార్థించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



గుణదల మేరిమాత చర్చిలో బాలఏసు ప్రతిమ వద్ద ఆశీర్వచనాలు అందుకుంటున్న భక్తులు

అభివృద్ధి బడిబాట

- శరవేగంగా మన బడి నాడు–నేడు పనులు
- సమూలంగా మారుతున్న పాఠశాలల రూపురేఖలు
- ఉమ్మడి కృష్ణాలో రెండో దశ పనులకు రూ.285 కోట్లు మంజూరు
- అదనపు గదుల నిర్మాణానికి ప్రాధాన్యం
- రెండు జిల్లాల్లో ఒకేసారి 602 తరగతి గదుల నిర్మాణం

మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణా జిల్లాలో చేపట్టిన మన బడి నాడు–నేడు పనులతో పాఠశాలలు సకల వసతులను సమకూర్చుకుంటున్నాయి. ఇప్పటికే మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రెండో దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంతో పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారుతున్నాయి. నాడు–నేడు మొదటి దశ కింద కృష్ణాలో 587 పాఠశాలల్లో రూ.102.76 కోట్లతో, ఎన్టీఆర్ జిల్లాలో 341 పాఠశాలల్లో రూ.80.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. తొలి దశ పనులు పూర్తి చేసుకుని ఇప్పటికే తరగతుల నిర్వహణ మొదలైంది. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒకే సారి 602 అదనపు గదుల నిర్మాణం

మనబడి నాడు–నేడు రెండో దశలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో ఏకంగా 602 అదనపు గదులు ఒకే సారి నిర్మాణం చేపట్టారు. ఇది విద్యాశాఖ చరిత్రలోనే తొలిసారి అని అధికారులు పేర్కొంటున్నారు. కృష్ణా జిల్లాలో 360 స్కూళ్లకు రూ.100.12 కోట్లు మంజూరయ్యాయి. 47 పాఠశాలల్లో 234 అదనపు గదులు నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 431 పాఠశాలల అభివృద్ధికి రూ.185.12 కోట్లు మంజూరయ్యాయి. 59 స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 368 అదనపు గదులను నిర్మిస్తున్నారు. నిధుల కొరత లేకపోవటంతో గడువులోగా పనులు పూర్తి చేసేలా రెండు జిల్లాల విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు.

దశల వారీగా అభివృద్ధి

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను దశల వారీగా అభివృద్ధి చేసేలా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. రెండో దశలో కృష్ణా జిల్లాలో 90 ఉన్నత, 50 ప్రాథమికోన్నత, 220 ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేసి పనులు చేపడుతున్నారు. జిల్లాలో మొత్తం 1,314 పాఠశాలలు ఉండగా తొలి దశలో 587 స్కూళ్లను అభివృద్ధి చేశారు. తాజాగా రెండో దశలో 360 పాఠశాలల్లో పనులు చేస్తున్నారు. తొలి దశలో అభివృద్ధి చేసిన 177 స్కూళ్లలో అదనపు గదులు, డిజిటల్ బోధనకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. మిగిలిన పాఠశాలలను దశలవారీగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ సిద్ధంచేశారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో రెండో దశలో 96 ఉన్నత పాఠశాలలు, 69 ప్రాథమికోన్నత, 266 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 898 పాఠశాలలు ఉండగా తొలి దశలో 341 బడులను అభివృద్ధి చేశారు. మిగిలిన పాఠశాలలను కూడా తదుపరి దశలో అభివృద్ధి చేసేలా ఏర్పాట్లు చేశారు.

రా...రమ్మంటూ పాఠశాల ఆహ్వానం



మొదటి దశలో అభివృద్ధి చేసిన బందరులోని మల్కాపట్నం స్కూల్

ఈ ఫొటోలో ఉన్నది మచిలీపట్నంలోని మల్కాపట్నం ప్రాథమిక పాఠశాల. ఒకప్పుడు శిథిల భవనంలో శ్లాబు నుంచి పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయోననే ఆందోళనతో విద్యార్థుల చదువులు సాగేవి. నేడు ఆ పాఠశాలలో పరిస్థితులు పూర్తిగా మారాయి. మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా మరమ్మతులు చేయటంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. మరుగుదొడ్లు నిర్మించారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేశారు. అందమైన రంగులతో, పాఠశాల భవనం గోడలపై వేసిన దేశనాయకుల బొమ్మలతో ఎంతో ఆకర్షణగా నిలుస్తూ రా...రమ్మంటూ ఈ బడి విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది.



వీరులపాడు మండలం జయంతి గ్రామంలో ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం



చందర్లపాడు మండలం తోటరావులపాడు పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి



కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని పాఠశాలల్లో మనబడి నాడు–నేడు పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నాం. విద్యార్థుల అవసరాలను తీర్చేలా మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. నాణ్యతలో రాజీలేకుండా ఈ పనులను చేస్తున్నాం. వివిధ దశల్లో ఉన్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం.

– డాక్టర్ అమర్లపూడి శేఖర్, సమగ్ర శిక్షణ ఏపీసీ, ఉమ్మడి కృష్ణా జిల్లా

మెరుగైన సౌకర్యాలు



ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు బాగా మెరుగుపడ్డాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. మౌలిక సౌకర్యాలు బాగున్నందున, విద్యాబోధనలో నాణ్యత పెంచేలా దృష్టి సారించాం. దీనిపై ఉపాధ్యాయులకు తగిన తర్ఫీదు ఇస్తున్నాం.

– తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

అదనపు గదులకు ప్రాధాన్యం



ఎన్టీఆర్ జిల్లాలో మన బడి నాడు–నేడు పనులతో పాఠశాలలు అభివృద్ధి చెందాయి. దీంతో చాలా చోట్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు పెరిగారు. ఇలాంటి చోట్ల అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చాం. రెండో దశలో 59 స్కూళ్లలో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నాం. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– సి.వి.రేణుక, డీఈఓ, ఎన్టీఆర్ జిల్లా

దుర్గమ్మా.. చల్లంగ చూడు

- భక్తులతో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి
- సర్వ దర్శనానికి 3 గంటలు



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కరోనా ఫోర్త్ వేవ్ వస్తుందనే ప్రచారం నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి ఆది దంపతులను దర్శించుకున్నారు. పిల్లా పాపలతో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తమను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి కనిపించింది. ఆలయంలో నిర్వహించే పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు సాయంత్రం నిర్వహించిన పంచహారతుల సేవలోనూ విశేషంగా పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన తెలంగాణ వాసులు

అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తమ కార్లు, ఇతర వాహనాలను హెడ్ వాటర్ వర్క్స్, వీఎంసీ కార్యాలయం, సీతమ్మ వారి పాదాలు, కెనాల్‌రోడ్డు, ప్రకాశం బ్యారేజీ వద్ద నిలుపుకొని దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల్లో కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్లు కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఘాట్‌రోడ్డుతో పాటు మహామండపం మెట్ల మార్గంలో భక్తులు బారులు తీరి కనిపించారు. సర్వ దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పట్టింది. మధ్యాహ్నం మహా నివేదన నిమిత్తం అర్ధ గంట పాటు అన్ని దర్శనాలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది.

కులం పేరు చెప్పాలని జైల్లో కొట్టారు

- కుల,మత రహిత సమాజమే నా ఆకాంక్ష
- నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడతాను
- స్వాతంత్య్ర సమరయోధుడు రావూరి అర్జునరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):

'ఉప్పు సత్యాగ్రహంలో జైలుకెళ్లినప్పుడు కులం పేరు చెప్పని నాలాంటి వారిని పోలీసులు లాఠీలతో కొట్టారు. అయినా నా సిద్ధాంతానికి నీళ్లు వదల్లేదు. కుల మత రహిత సమాజాన్నే జీవితాంతం కోరుకుంటాను' అంటూ నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడ్డ స్వాతంత్య్ర సమరయోధుడు, నాస్తికుడు రావూరి అర్జునరావు. వర్ణ వివక్షకు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన యోధుడు ఆయన. నాస్తికోద్యమ నాయకుడు, గాంధేయవాది గోపరాజు రామచంద్రరావు (గోరా) పెద్ద అల్లుడు రావూరి అర్జునరావు (104) వయోభారంతో ఆదివారం హైదరాబాద్‌లో తన చిన్నకుమారుడు డాక్టర్ పవర్ నివాసంలో కన్నుమూశారు. సుమారు తొమ్మిదేళ్ల ఏళ్ల క్రితం 'సాక్షి'తో ఆయన పంచుకున్న అనుభవాలు ఆయన మాటల్లోనే...

తొమ్మిది నెలల కఠిన కాగార శిక్ష

కృష్ణాజిల్లా గుడివాడ సమీపంలోని వానపాముల గ్రామంలో 1918లో జన్మించాను. 1940లో సంఘ సంస్కర్త గోపరాజు రామచంద్రరావు(గోరా) ముదునూరు వచ్చారు. అప్పుడే ఆయనతో పరిచయం ఏర్పడింది. నాస్తిక కేంద్రంలో అన్నే అంజయ్య సహకారంతో వయోజన విద్యా కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అప్పుడు నా వయసు 22 ఏళ్లు. 1942లో గాంధీగారి పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బళ్లారిలోని ఆలీపురం క్యాంప్ జైల్లో తొమ్మిది నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాను.



100వ పుట్టిన రోజు సందర్భంగా భార్య మనోరమ, కుటుంబసభ్యులతో రావూరి (ఫైల్)

అస్పృస్యతా నివారణకు కృషి

జైలు శిక్ష అనంతరం వానపాముల వచ్చి నాస్తికోద్యమ నాయకుడు గోరాతో కలిసి అస్పృస్యతా నివారణ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అప్పుడు దళితుల మధ్య కుల ద్వేషం ఎక్కువగా ఉండేది. నాలుగేళ్లు అక్కడే ఉండి రెండు కులాల్లో ఎవరి ఇంట్లో వివాహాలు జరిగినా కలిసి భోజనం చేయడం, బహుమతులు ఇచ్చి పుచ్చుకునేలా మార్పులు తీసుకొచ్చాం. ఆదర్శ వివాహాలకు ప్రాధాన్యమిచ్చాం. కులాంతర వివాహాల వల్ల సామాజిక అసమానతలు పోతాయని గోరా నమ్మేవారు. అదే ఆయనను గాంధీగారికి సన్నిహితుడిని చేసింది.

గాంధీజీకి సపర్యలు

జైల్లో ఉన్నప్పుడు గోరాతో నాకు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. తన పెద్ద కుమార్తె మనోరమను వివాహం చేసుకోవాలని ఆయన నన్ను కోరారు. ఎవరైనా మంచి వ్యక్తితో మనోరమ వివాహం చేయమన్నాను. మనోరమతో వివాహానికి నన్ను ఒప్పించారు. ఈ విషయాన్ని ఆయన గాంధీకి తెలిపారు. 1945లో మమ్మల్ని మద్రాస్ తీసుకురావాలని గాంధీజీ గోరాకు ఉత్తరం రాశారు. మనోరమతో గాంధీజీ మాట్లాడి కులాంతర వివాహాన్ని రెండేళ్ల తరువాత చేయాలని సూచించారు. నన్ను సేవాగ్రామ్‌లో ఉండి హిందీ నేర్చుకోవాలని, అందరితో పరిచయాలు పెంచుకుని మనోరమకు ఉత్తరాలు రాయాలని గాంధీజీ చెప్పారు. అలా 1946 ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి 1948 ఏప్రిల్ వరకు గాంధీజీ సేవాగ్రాం ఆశ్రమం వార్ధాలో ఉంటూ ఆయనకు సపర్యలు చేశాను. 1948లో గాంధీజీ హత్యకు గురవ్వడంతో ఆయన సమక్షంలో జరగాల్సిన నా వివాహం నిలిచిపోయింది.



రావూరి అర్జునరావు (ఫైల్)

మహామహులే పెళ్లి పెద్దలు

గాంధీజీ లేరన్న శోకం నుంచి తేరుకున్నాక వార్ధాలోని మహాత్ముడి ఆశ్రమంలోనే అదే ఏడాది మార్చి 13న హరిజన్ సేవక్ సంఘ్ అధ్యక్షుడు ఠక్కర్‌బాబా ఆధ్వర్యంలో 'సత్యసాక్షి'గా ప్రభాకర్‌జీ మా వివాహం జరిపించారు. భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, ఆచార్య కృపలానీ వంటి మహామహులు మా పెళ్లికి పెద్దలు. తరువాత విజయవాడ నాస్తిక కేంద్రానికి చేరుకున్నాం.

20 మందికి ఆదర్శ వివాహాలు

1953లో మా దంపతులం వానపాముల చేరుకుని కాపురం ప్రారంభించి, గాంధీ స్మారక నిధి తరపున పని చేశాం. 1960లో గుడివాడకు మకాం మార్చాం. అక్కడే హరిజన సేవా సంఘం, బాలుర వసతి గృహం నడిపాం. ఖాదీ బోర్డులో కూడా పని చేసేవాడిని. గుడివాడ, కృష్ణా, నెల్లూరులలోని కొన్ని ప్రాంతాలలో మూఢనమ్మకాల నిర్మూలన, కుల మత రహిత సమాజ స్థాపనకు, సెక్యులర్ వ్యవస్థ నిర్మాణానికి కృషి చేశాం. సుమారు 20 మందికి ఆదర్శ వివాహాలు చేశాం. మనిషిని గౌరవించటం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి. విజ్ఞానం పెరిగే కొద్దీ కులతత్వం పెరిగిపోతోంది. పూర్వం త్యాగం ఉండేది. స్వార్థం కోసమే కులతత్వం పెరుగుతోంది. ఆ బీజం నశించినప్పుడే నిజమైన నవ సమాజ స్థాపన జరిగినట్లు.

నేడు విజయవాడకు రావూరి భౌతికకాయం

రావూరి అర్జునరావు భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి సోమవారం విజయవాడ బెంజి సర్కిల్‌లోని నాస్తిక కేంద్రానికి తీసుకురానున్నారు. సోమవారమే అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రావూరి అర్జునరావుకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

నేటి నుంచి భవానీ దీక్షల విరమణ కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణకు వచ్చిన మాలధారులు అమ్మవారికి సమర్పించిన కానుకలను సోమవారం నుంచి లెక్కించనున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉదయం ఏడు గంటలకు కానుకల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన దీక్షల విరమణ మహోత్సవాల్లో భవానీలు పెద్ద ఎత్తున కానుకలు సమర్పించారు. కానుకల లెక్కింపు మూడు రోజులు కొనసాగే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి



ఆత్కూరులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు

ఉంగుటూరు: దేశానికి సుపరిపాలన అందించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినాన్ని సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడం సంతోషదాయకంగా ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జాతీయ సుపరిపాలన దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని, తమకు ఉన్నదానిలో కొంత సేవకు కేటాయించాలని అన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమని తెలిపారు. అనంతరం వాజ్‌పేయి, ఏసుక్రీస్తు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి, సిబ్బంది పాల్గొన్నారు.

రైవస్ కాలువలో యువకుడు గల్లంతు

కంకిపాడు: రైవస్ కాలువలో యువకుడు గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన యువకుడు (22) ఇంట్లో తలెత్తిన వివాదం కారణంగా మనస్తాపానికి గురై ఉప్పలూరు వద్ద రైవస్ కాలువలో దూకి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రైవస్ కాలువలో విస్తృతంగా గాలింపులు జరుపుతున్నారు. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ప్రాథమిక సమాచారం సేకరించారు. గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం గాలించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సమాచారం తెలిపారు. ఎస్‌ఐ దుర్గారావు మాట్లాడుతూ ఉయ్యూరు, పెదపారుపూడి, ఇతర పోలీసుస్టేషన్‌లకు సమాచారం అందించామని, కోమటిగుంట లాకు సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు. ఘటనపై ప్రాథమిక విచారణ సాగిస్తున్నామని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పందెం పుంజులు... లక్షల్లో ధరలు

- జిల్లాలో ముందే మొదలైన సంక్రాంతి సందడి
- జాతి పుంజుల కోసం లక్షలు పెడుతున్న పందెంరాయుళ్లు
- రంగులను బట్టి ధరలు, జాతి పుంజుల వైపు మొగ్గు



సంక్రాంతి బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్న పందెం పుంజులు



మచిలీపట్నం సండే మార్కెట్‌లో పందెం పుంజులతో పందెంరాయుళ్ల సందడి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లాలో సంక్రాంతి సందడి అప్పుడే మొదలైంది. కోడి పందేలరాయుళ్ల హడావుడి ప్రారంభమైంది. ఏ రంగుపై ఏ రంగు వదలాలి, ఏది గెలుస్తుంది, ఏది ఓడిపోతుందనే కబుర్లు మొదలయ్యాయి. ఒరేయ్ ఈరిగా... పోయిన పండక్కి నా నెమలి నాలుగు పందేలు చేసిందిరా అంటే... నీ నెమలి నాలుగు పందేలే చేసింది... నా కక్కిరి అయితే నీచు తగలకుండా సంపేసిందిరా సూరిగా అంటూ పందెంరాయుళ్లు మాట్లాడుకోవటం మొదలుపెట్టేశారు. ఇదిలా ఉండగా వచ్చే పండుగను దృష్టిలో పెట్టుకుని పందెంరాయుళ్లు పుంజుల కోసం జల్లెడ పడుతున్నారు. చిన్న చిన్న పందెంగాళ్లు సండే మార్కెట్‌లోకి వచ్చే పుంజులను బేరసారాలు చేసి కొనుక్కుంటుండగా పెద్ద పందెగాళ్లు కోడి రంగు, వాటం, వాటి చూపును చూసి కొనుగోలు చేస్తున్నారు. కోడికూత వినబడితే చాలు చటుక్కున ఆగి కోళ్ల యజమానితో బేరసారాలు మొదలెడుతున్నారు. రంగును బట్టి ధర నిర్ణయించి డబ్బులు విరజిమ్ముతున్నారు. పుంజు వాటంతో పాటు రంగు రూపు నచ్చితే ధర ఎంతైనా కొనేందుకు వెనుకాడటంలేదు. పందేనికి సిద్ధం చేసేందుకు రకరకాల మేతలను తయారుచేసి పుంజుల శరీరాన్ని జిమ్ బాడీల్లా సిద్ధం చేసేందుకు పూనుకుంటున్నారు. రంగును బట్టి పందెంకోళ్లకు గిరాకీ ఉండటంతో పెంపకందారులు ఈ సీజనులో కాసులు పోగుజేసుకుంటున్నారు. కాకి, పచ్చకాకి, డేగ, కాకిడేగ, నెమలి, సీతువా, కక్కిరి, పింగళా ఇలా రంగులను బట్టి ఒక్కో పందెం కోడి ధర సుమారు రూ.5 వేలు, ఇవే రంగుల్లో జాతికోళ్లు అయితే రూ.15 వేల నుంచి మొదలై లక్షల్లో పలుకుతున్నాయి. అయితే రంగు నచ్చి కోడి మీద పందెంరాయుళ్లకు మోజు పుడితే చాలు ధర ఎంతైనా చెల్లించి పుంజును పట్టుకుపోతున్నారు.

యుద్ధానికి సిద్ధమవుతున్న పందెంకోళ్లు

పండుగ సమీపిస్తుండటంతో పందెంరాయుళ్లు పందెం కోళ్లను యుద్ధానికి సిద్ధమయ్యే సైనికుల్లా తయారు చేస్తున్నారు. పందెంరాయుళ్లు పెడుతున్న పుష్టికరమైన తిండి తింటూ పందెం కోళ్లు బరిలోకి దిగేందుకు సై అంటే సై అంటూ సిద్ధమవుతున్నాయి. కత్తి కట్టేందుకు కాలు దువ్వుతున్నాయి. ఇప్పటివరకు తవుడు ముద్దలు, ఒడ్లు, సోళ్లు వంటి వాటిని ఆహారంగా అందించిన పందెంరాయుళ్లు పండుగ దగ్గర పడటంతో పుంజులను మరింత బలంగా పెంచేందుకు జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా వంటి ఖరీదైన ఆహారాన్ని అందిస్తూ కోళ్లను మేపుతున్నారు.

చలపతిరావు మృతితో విషాదంలో కళాభిమానులు

బెజవాడ నిర్మాత నిర్మించిన గూఢచారి–116లో తొలి అవకాశం



చలపతిరావుకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు కొల్లూరి, అంబికా కృష్ణ, నన్నపనేని రాజకుమారి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)/విజయవాడ కల్చరల్: ప్రముఖ సినీ నటుడు చలపతిరావు మృతి ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులను తీవ్ర విషాదానికి గురి చేసింది. మొన్న జిల్లాకు చెందిన నవరసనటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ నేడు చలపతిరావు మృతితో కృష్ణాతీరంలో కళాభిమానులను వెనువెంట విషాదాలు చుట్టుముట్టాయి. సినీ రంగ ప్రముఖులందరూ ఆప్యాయంగా బాబాయ్ అని పిలుచుకునే తమ్మారెడ్డి చలపతిరావు (78) కృష్ణాజిల్లా పామర్రు మండలం బల్లిపర్రు గ్రామంలో జన్మించారు. ఆయన జిల్లాలోని పలువురు రంగస్థల కళాకారులతో కలిసి నాటకాలు వేశారు. అనంతరం మద్రాస్ వెళ్లి చిత్రరంగంలో ప్రయత్నాలు చేయటంతో ఆ రంగంలోకి అడుగు పెట్టారు. తొలి సినిమా 1966లో విడుదలైన గుఢచారి–116లో నటించారు. ఆ తరువాత విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సుమారు 1200 చిత్రాల్లో నటించారు. గూఢచారి–116 చిత్రాన్ని బెజవాడకు చెందిన పోతిన డూండేశ్వరరావు (డూండీ) నిర్మించారు. జిల్లా వాసి కావటంతో డూండీ చలపతిరావుకు వెంటనే అవకాశం కల్పించారు. ఆ తరువాత కృష్ణతో పరిచయం పెరగటంతో రెండో సినిమాగా సాక్షిలో అవకాశం లభించింది. అక్కడి నుంచి ఎన్టీ రామారావుకు దగ్గర కావటం, మంచి సౌష్టవం ఉండటం, జిల్లా వాసి కావటంతో ఎన్టీఆర్ తన చిత్రాల్లో వరుసగా మంచి అవకాశాలు ఇచ్చారు. అందరితో మంచి సంబంధాలు కొనసాగించటం, ఆయా చిత్రాల్లో వేసిన పాత్రల ద్వారా మెప్పించటంతో ఆయనకు చాలా చిత్రాల్లో మంచి పాత్రలు దొరికాయని స్థానిక రంగస్థల కళాకారులు చెబుతున్నారు. చలపతిరావు సినిమా రంగంలో బిజీ కావటంతో విజయవాడకు, ఆయన స్వగ్రామానికి రాకపోకలు తక్కువగానే ఉండేవి. అయితే కుమార్తెలకు వివాహాలై అమెరికాలో స్థిరపడిన తరువాత వారు చలపతిరావు వద్దకు వచ్చినప్పుడల్లా బల్లిపర్రు వచ్చి వెళ్లేవారని స్థానికులు చెబుతున్నారు. చలపతిరావు మృతిపై నగరంలోని పలు సాంస్కృతిక సంఘాలు సంతాపాన్ని ప్రకటించాయి.

సినీనటుడు చలపతిరావు మృతికి వివిధ కళాసంస్థల సంతాపం

సినీనటుడు, నిర్మాత చలపతిరావు మృతికి నగరానికి చెందిన సాంస్కృతిక సేవా సంస్థలు సంతాపం వ్యక్తం చేశాయి. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు ఆయనతో తనకున్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 22వ వర్ధంతి సందర్భంగా నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందజేసినట్లు తెలిపారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, నిడుమోలు రమాసత్యనారాయణ, గోళ్ళ నారాయణరావు, కొప్పరపు బలరామకృష్ణమూర్తి తదితరులు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.

నేడు రంగా వర్ధంతికి హాజరు కానున్న మంత్రి, ఎంపీ

పెడన: పేదల పెన్నిధి దివంగత వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి పెడన నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. రంగా వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొని రంగా చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపింది. ఉదయం 9 గంటలకు గూడూరు మండలం గూడూరులోను, 9.30 గంటలకు ఆకులమన్నాడులోను, 10 గంటలకు పెడన పట్టణంలోని పార్టీ కార్యాలయంలోను, 10.30 గంటలకు తోటమూలలోని రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తారని పేర్కొంది. 11 గంటలకు తోటమూల వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభిస్తారని, ఆయా కార్యక్రమాలకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరింది.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ వన్‌టౌన్ బ్రాహ్మణవీధి చదును మహాలక్ష్మి గుడి ప్రాంతానికి చెందిన రమాదేవిని 2015లో పాలకొల్లుకు చెందిన రామకృష్ణకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వీరికి సురేంద్ర అనే కుమారుడు ఉన్నాడు. రామకృష్ణ రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందడంతో రమాదేవి కుమారుడిని తీసుకుని పుట్టింటికి వచ్చేసింది. కొంత కాలంగా రమాదేవి రాజా అనే వ్యక్తితో తరుచూ ఫోన్‌లో మాట్లాడటంతో తల్లి నాగమల్లేశ్వరి మందలించింది. ఆదివారం మధ్యాహ్నం కుమారుడు సురేంద్రను తీసుకుని రమాదేవి బయటకు వెళ్లి వచ్చింది. కొంత సమయం తర్వాత ఇంటికి వచ్చిన రమాదేవి వంట గదిలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రమాదేవి ఎంత సేపటికీ వంట గదిలో నుంచి రాకపోవడంతో తల్లి నాగమల్లేశ్వరి వెళ్లి చూసేసరికి రమాదేవి ఉరికి వేలాడుతోంది. తల్లి నాగమల్లేశ్వరి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాతిదూలం విజేత విజయవాడ వృషభాలు



విజేత వృషభాల యజమానికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు(అనంతపురం): రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీల్లో విజయవాడకు చెందిన వృషభాలు ప్రథమస్థానం సాధించాయి. ఆత్మకూరు మండలం పి.యాలేరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీలతరెడ్డి, యన్నం ఆంథోనిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. ఏపీతో పాటు తెలంగాణ నుంచి కూడా వృషభాలు పాల్గొన్నాయి. ఆదివారం సీనియర్స్ విభాగం వృషభాలకు పోటీలు నిర్వహించారు. విజయవాడకు చెందిన డీవీఆర్ చక్రవర్తి వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. వృషభాల యజమానికి రూ.1.20 లక్షల నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ద్వితీయ స్థానంలో హైదరాబాద్‌కు చెందిన రోషన్ బాబు వృషభాలు, తృతీయ స్థానంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన హిందురెడ్డి రమణారెడ్డి వృషభాలు నిలిచాయి. వీటి యజమానులకు రెండో బహుమతి కింద రూ.లక్ష, మూడో బహుమతి కింద రూ.80 వేలు అందజేశారు. నాల్గో బహుమతి కింద రూ.70వేలు, ఐదో బహుమతి కింద రూ.60వేలను నిర్వాహకులు అందజేశారు.

కారు పల్టీ...తప్పిన ప్రమాదం



జాతీయ రహదారిపై పల్టీ కొట్టిన కారు

జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ కారు 65 వ నంబర్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలోకి రాగానే ముందు వైపు ఒక టైర్ పంక్చర్ అయింది. దీంతో కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఆ సమయంలో కారులో కేవలం డ్రైవర్ మాత్రమే ఉన్నారు. అయితే ఆయన కూడా ఎటువంటి గాయాలు లేకుండా బయటపడడం విశేషం. –నందిగామ

అభివృద్ధికి ఆటంకాలు మూఢనమ్మకాలు

జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభం



జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

కొండపల్లి (ఇబ్రహీంపట్నం): నేటి యువతరం అభివృద్ధికి మూఢనమ్మకాలు ఆటంకంగా మారాయని శాసనమండలి మాజీ సభ్యుడు ఎంయూఎస్ శర్మ అన్నారు. కొండపల్లి క్రాంతి కాన్వెంట్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లో మూఢనమ్మకాలు పెరగడం బాధాకరమన్నారు. నమ్మకానికి మూఢనమ్మకానికి అనేక తేడాలున్నాయన్నారు. వాటి మధ్య వైరుధ్యం తెలియజేసి యువకులను జాగృతం చేశారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ మూఢ నమ్మకాల నియంత్రణ చట్టం దేశ వ్యాప్తంగా ప్రవేశ పెట్టి పాఠ్యపుస్తకాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ మాట్లాడుతూ నేటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, సమాజంలో యువత పాత్రపై దిశానిర్దేశం చేశారు. యువతలో ఉన్న నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. యువకుల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జేవీవీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్వతనేని లేని లోటు పూడ్చలేనిది

హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్



హైకోర్టు న్యాయమూర్తి దేవానంద్

గుడివాడరూరల్: ఏఎస్‌ఆర్ కళాశాలకు పర్వతనేని నాగేశ్వరరావు లేని లోటు పూడ్చలేనిదని హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ అన్నారు. కృష్ణా జిల్లా గుడివాడ ఏఎస్‌ఆర్ కళాశాలలో ఆదివారం కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పర్వతనేని నాగేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత పర్వతనేని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా తాను పనిచేసినప్పుడు పర్వతనేని చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యార్థుల సంక్షేమానికి, కళాశాల అభివృద్ధికి పర్వతనేని నిరంతరం శ్రమించేవారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి, పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కొసరాజు వీరయ్యచౌదరి, మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏఎస్ఆర్ కళాశాల అభివృద్ధికి పర్వతనేని చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎర్నేని నాగేంద్రనాథ్, అర్బన్‌బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, గౌరవ సలహాదారు ఎస్.శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, కాజా శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌ను గౌరవించుకోవటం మా బాధ్యత

- మంచి చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాం
- నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్



ఎన్టీఆర్ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ఎన్టీఆర్‌ను గౌరవించుకోవటం తమ బాధ్యత అని నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని సీఎం రోడ్డునే విస్తరించి అభివృద్ధి చేయటమే కాకుండా రహదారికి ఎన్‌టీఆర్ రోడ్డుగా నామకరణం చేసి రహదారిని ప్రారంభించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సీఎం రోడ్డుకు ఎన్టీఆర్ పేరు పెట్టటం ఆయనకు తాము, తమ పార్టీ ఇస్తున్న గౌరవమని చెప్పారు. 30 ఏళ్ల అధికారంలో ఉన్నా టీడీపీ ఏనాడూ ఎన్టీఆర్ గౌరవాన్ని పెంచేలా నడుచుకోలేదన్నారు. తామిరువురం మంచి చేయటానికే రాజకీయాల్లోకి వచ్చామని, తాము పుట్టి పెరిగిన నందిగామకు చేయగలిగినంత చేసి తీరుతామని చెప్పారు. పట్టణంలోని 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.38 కోట్లతో సీఎం రోడ్డును విస్తరించటంతో పాటు అభివృద్ధి చేశామని చెప్పారు. గత మూడు దశాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని నందిగామ పట్టణాన్ని తాము అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపుతున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే రెవెన్యూ డివిజన్, కేంద్రీయ విద్యాలయం, పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో పాటు నందిగామను బంగారు నందిగామగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. తమ పని తీరును విజ్ఞత కలిగిన పట్టణ ప్రజలు, విద్యావంతులు, మేధావులు గమనిస్తున్నారని తెలిపారు. సీఎం రోడ్డు విస్తరణ, అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ చేపట్టే ఏ పనులపై కోర్టుకు వెళ్లి అడ్డుకోలేదని, కానీ తాము ప్రజలకు ఏ పని చేద్దామన్నా టీడీపీ నేతలు కోర్టులను ఆశ్రయించి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేక అడుగడుగునా పనులను అడ్డుకుంటూ అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు తమ తీరు మార్చుకుని తాము చేస్తున్న మంచిని స్వాగతించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక



బాలికల జట్టు

యలమంచిలి (అనకాపల్లి జిల్లా): జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లను యలమంచిలిలో ఆదివారం ఎంపిక చేశారు. ఇక్కడి రాజీవ్ క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులకు ఈ జట్టులో స్థానం కల్పించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.ప్రసాద్‌రాజు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కోశాధికారి సీతారాం గోవింద్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. బాలుర విభాగంలో జె.శివమణికంఠ (ప్రకాశం జిల్లా), ఎస్.కనిష్క (విశాఖపట్నం), బి.హితీష్‌కుమార్ (ప్రకాశం), ఎం.భానుప్రసాద్ (శ్రీకాకుళం), జి.సాయి దుర్గాప్రసాద్ (పశ్చిమగోదావరి), వి.అప్పునాయుడు (శ్రీకాకుళం), అబ్దుల్ వాహిద్ (కడప), బి.రంజిత్ (విజయనగరం), టి.ఆదిత్యనాథ్ ప్రదీప్ (తూర్పుగోదావరి), జి.అమీర్‌బాబు (కృష్ణ), పి.సందీప్ (విశాఖపట్నం), ఎ.సాయికుమార్ (విజయనగరం), స్టాండ్‌బైగా కె.ప్రవీణ్ (విశాఖపట్నం), బి.బద్రి (పశ్చిమ గోదావరి), పి.సతీష్ చంద్ (తూర్పుగోదావరి) ఎంపికయ్యారు. బాలికల జట్టుకు జి.శ్రీలక్ష్మి (కడప), సిహెచ్.శ్రీపద్మజ (కృష్ణ), ఎస్.హరిణి (విశాఖపట్నం), ఎం.విజయలక్ష్మి (విజయనగరం), ఎస్.సంజన (కృష్ణ), టి.పావని (కడప), ఎస్.విజయలక్ష్మి (కడప), వ్యూహిత (పశ్చిమ గోదావరి), పి.షాయాద (గుంటూరు), యు.శ్రావణి (శ్రీకాకుళం), జె.కుందినిదేవి (ప్రకాశం), స్టాండ్‌బైగా వి.కుసుమ ప్రియ (కడప), కె.కీర్తి రాఘవశ్రీ (పశ్చిమ గోదావరి), ఎస్.సంజనదేవి (తూర్పుగోదావరి జిల్లా) ఎంపికయ్యారు.



బాలుర జట్టు

క్రీస్తు బోధనలు అనుసరణీయం


కేక్ కట్ చేస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): క్రీస్తు బోధనలు అనుసరణీయమని విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పేర్కొన్నారు. మూడో డివిజన్ వైఎస్సార్ కాలనీలోని గంగిరెద్దులదిబ్బ వద్దనున్న జీఎస్ఎం చర్చి, 11వ డివిజన్ జ్యోతి విద్యాలయం వద్ద ఆదివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ క్రీస్తు చల్లని దయ ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థన చేశారు.

పాప పరిహార్థం కోసం క్రీస్తు జననం

గుణదల(విజయవాడ తూర్పు): సర్వమానవ పాప పరిహార్థమై ఏసు క్రీస్తు ఈ లోకానికి వచ్చాడని గుణదల మేరి మాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఫాదర్ జయరాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగన్నారు. మానవాళిని సంరక్షించేందుకు ఆయన మానవ రూపిగా జన్మించారన్నారు. ఆయన ఆచరించిన మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని సూచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. శిఖరాగ్రాన ఉన్న ఏసు క్రీస్తు శిలువ వరకు భక్తులు కాలినడకన చేరుకున్నారు.


గుణదల ప్రాంతంలో బాలాఏసును ముద్దాడుతున్న భక్తులు

క్రీస్తు బోధనలు అనుసరణీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రీస్తు బోధనలను అనుసరిస్తూ, దేవుని వాఖ్యానుసారం ప్రతిఒక్కరూ నడుచుకోవాలని గాస్పెల్ అసోసియేషన్ఆఫ్ ఇండియా బిషప్ డాక్టర్ బందెల ఏసుపాదం అన్నారు. గిరిపురంలోని గాస్పెల్ హాల్లో ఆయన అమెరికా నుంచి ఆదివారం లైవ్‌లో సందేశం ఇచ్చారు.


గాస్పెల్‌హాల్లో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

ఆటోనగర్‌లో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్‌లోని మెస్సీయ ఫెలోషిప్, డొంకరోడ్డులోని బెయేర్షెబా చర్చిలతో పాటు పలు ప్రార్థనా మందిరాల్లో క్రీస్తు ఆరాధనను క్రైస్తవులు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బెయేర్షాబా చర్చి పాస్టర్ ఇమ్మానుయేల్ జయరాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోకానికి రావడం ద్వారా మానవులకు శాంతి సమాధానం వచ్చిందన్నారు. లోక రక్షకుడు మానవ రూపిగా రావడం ద్వారా పాపాలన్నీ క్షమించబడ్డాయన్నారు. తొలుత క్రిస్మస్ పాటలను ఆలపించారు. మెస్సీయ ఫెలోషిప్ పాస్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక లోకానికి వెలుగు వచ్చిందన్నారు. అనతంతరం చిన్నారులచే క్రీస్తు పుట్టుక నాటకం ప్రదర్శించారు.

పటమటలో ..

పటమట(విజయవాడతూర్పు): బెంజిసర్కిల్ వద్ద ఉన్న సెయింట్‌పాల్స్ కథెడ్రెల్‌లో విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ పాల్స్ కథెడ్రెల్ విచారణ కర్త ఫాదర్ మువ్వల ప్రసాద్, ఇతర గురువులు ప్రత్యేకంగా క్రిస్మస్ సమష్టి దివ్యపూజాబలిని సమర్పించారు.


డొంకరోడ్డు లోని బెయేర్షెబా చర్చిలో పాటలు అలపిస్తున్న క్రైస్తవులు


మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు


పటమట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ ప్రసాద్

క్లుప్తంగా

కాకానికి ఘన నివాళి



పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమరయోధుడు, జైఆంధ్రా ఉద్యమనేత కాకాని వెంకటరత్నం వర్ధంతి ఆదివారం పటమటలో ఘనంగా జరిగింది. బెంజిసర్కిల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, యలమంచిలి రవి పాల్గొని వెంకటరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లడుతూ కాకాని వెంకటరత్నం జై ఆంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తితో చాలామంది నాయకులుగా ఎదిగారాన్నారు. కార్యక్రమానికి సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరహరశెట్టి నరసింహారావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొలనకొండ శివాజీ, అక్కినేని బోసు, ఇంద్రమోహన్‌రెడ్డి, నాగేశ్వరావు, గంధం శివ, శెట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

రేపు రైతుబజార్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణలంక పోలీసు స్టేషన్ సమీపంలోని బందరు కాలువ గట్టుపై నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను ఈ నెల 27వ తేదీన ప్రారంభించనున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి ఎ.కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖామంత్రి కాకాని గోవర్దన్‌రెడ్డి రైతుబజార్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. స్వరాజ్ మైదానంలోని రైతుబజార్ తరలింపులో భాగంగా రూ. 98.24లక్షల వ్యయంతో కృష్ణలంక పోలీసుస్టేషన్ సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో 91షాపులతో రైతుబజార్ నిర్మించినట్లు తెలిపారు. రైతుబజార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత, ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

యూజీడీ లీకేజీలను సరిచేయండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ లెక్చరర్స్‌కాలనీ ఆరోగ్యకేంద్రం రోడ్డులో యూజీడీ లీకేజీలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. లీకేజీలతో ఎప్పుడు ఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు 'స్పందన'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి స్పందన కార్యక్రమం జరుగుతుందని సబ్ కలెక్టర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ వినతులను స్పందన కార్యక్రమంలో అందించి పరిష్కరించుకోవాలని సబ్ కలెక్టర్ కోరారు. డివిజన్ స్థాయి అధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరి హాజరు కావాలని పేర్కొన్నారు.

లోక సంరక్షణార్థం సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. ఆలయ అర్చకులు సూర్య భగవానుడిని ఆరాధించి, విశేష పూజలు నిర్వహించారు. సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొనగా, వారికి ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవీ క్లబ్ విద్యాధరపురానికి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో 2023 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంకాయల పూర్ణచంద్ర రావు, కార్యదర్శిగా కందెపు ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సముద్రాల పుల్లారావు నియమితులయ్యారు. సమావేశంలో క్లబ్ సభ్యులు వెంకటరమణ, శివకుమార్, సుధాకర్, శివప్రసాద్, జగదీష్ గుప్తా, ఉపేంద్ర పాల్గొన్నారు.

బైక్ ఢీకుని వృద్ధురాలికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకుని వృద్ధురాలికి గాయాలైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు అంబాపురానికి చెందిన పీ అమృతమ్మ(65) గత నెల 29వ తేదీన చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి గుడి వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా, చిట్టినగర్ నుంచి పాలప్రాజెక్టు వైపు వేగంగా వెళ్లుతున్న బైక్ ఢీ కొట్టింది. దీంతో అమృతమ్మకు గాయాలు కాగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


మధురానగర్‌లో క్రీస్తు సందేశం ఇస్తున్న రెవరెండ్ డాక్టర్ బందెల దయానందం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, మాచవరం , అంబేడ్కర్ కాలనీ, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలలో చర్చిలు విశ్వాసకులతో కిటకిటలాడాయి. మధురానగర్ కొబ్బరితోటలోని జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం రెవరెండ్ పాస్టర్ డాక్టర్ బందెల దయానందం క్రిస్మస్ సందేశంను వివరించారు. అనంతరం విశ్వాసకులు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో బీ విజయరాణి పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాలనీలో..

అంబేడ్కర్ కాలనీలోని సీయోను ప్రార్థనామందిరంలో ఆదివారం రెవరెండ్ పాస్టర్ కె వర ప్రసాద్ క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. దేవీనగర్‌లో పాస్టర్ గంజి విక్టర్ పాల్ యూత్ ఆధ్వర్యాన వేడుకలు జరిగాయి.

రేపు మండలపూజ ముగింపు ఉత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీన మండలపూజలు ముగింపు ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి తెలిపారు. నవంబర్ 17న ప్రారంభమైన మండల పూజ 27వ తేదీతో ముగియనున్నట్లు పేర్కొన్నారు. ముగింపు ఉత్సవాన్ని పురస్కరించుకుని 27వ తేదీన ఉదయం ఐదు గంటలకు గణపతి హోమం ప్రత్యేక వైదిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం అయ్యప్పకు అభిషేకం, ఏడు గంటలకు ఉష పూజ, తొమ్మిది గంటలకు కలశ పూజ, తదుపరి తులసిదళాలతో లక్షార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం స్వాములకు, భక్తులకు అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సాయంత్రం ఐదు గంటలకు గరుడ సేవ, మేళ తాళాలతో శ్రీ అయ్యప్ప స్వామి దీక్షపరులచే 108 జ్యోతులతో స్వామి ఊరేగింపు కార్యక్రమము ఉంటుందని పేర్కొన్నారు. పెథైతుల్లై నృత్యాలతో, వివిధ రకాల వేషధారణలతో ఊరేగింపు ఉంటుందని తెలిపారు. రాత్రి ఏడు గంటలకు హోమగుండంలో అయ్యప్పల నడక ఉంటుందని పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో యువతి అదృశ్యమైన సంఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు శివాలయం వద్ద ఉంటున్న కిలారు వసంతలక్ష్మి ఇంట్లో మొవ్వ కరుణ (21) గత ఆరు సంవత్సరాలుగా పని చేస్తోంది. ఆమెకు తల్లితండ్రి లేక పోవడంతో వసంతలక్ష్మి ఇంట్లోనే ఉంటోంది. అయితే ఈ నెల 23వ తేదీ రాత్రి అందరూ ఇంట్లో నిద్రపోయారు. ఈ నెల 24వ తేదీన ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో కరుణ కనిపించలేదు. ఈ ఘటనపై వసంతలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఈవెంట్స్‌కు అడ్డా .. పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డు


రాత్రి వేళ వెలుగుల్లో షాపింగ్ మాల్స్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): హైదరాబాద్ పేరు వినగానే వెంటనే గుర్తుకు వచ్చేది నెక్లెస్ రోడ్డు. విజయవాడలో కూడా అలాంటి రోడ్డు ఒకటి ఉంది. అదేనండీ మన పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డు. ఈ రోడ్డు బందరురోడ్డునకు సమాంతరంగా సుమారు మూడు కిలో మీటర్ల పైగానే ఉంటుంది. ఆర్.ఆర్. జంక్షన్ నుంచి మదర్‌థెరిస్సా జంక్షన్ మీదుగా మైనేని జంక్షన్ వరకు ఈ రోడ్డు ఉంది.

పేరు ఎలా వచ్చిందంటే..

ఈ రోడ్డులో గతంలో పిన్నమనేని పాలిక్లీనిక్ (ఆస్పత్రి) ఉండేది. అందువల్ల ఈ రోడ్డును పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం జీవీకే రాధా మాధవ్ అపార్ట్‌మెంట్స్ అదేనండి లలితా జ్యూవెలర్స్ షోరూమ్ ఉన్న ప్రాంతంలోనే పిన్నమనేని పాలిక్లీనిక్ ఉండేది. ఆ క్లీనిక్ ఉండే స్థానంలోనే ఇప్పుడు అపార్ట్‌మెంట్స్, జ్యూయలరీ షోరూమ్ వెలిశాయి. ఆస్పత్రిని తీసివేసినా ఇప్పటికి పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డు అంటేనే చాలా మందికి తెలుస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డులో మెరుగైన డ్రెయినేజీ వ్యవస్థ కోసం రూ.కోటి వ్యయంతో డ్రెయిన్ నిర్మాణం చేశారు.

ఏనీ టైమ్ ఏనీ ఫుడ్

పాలిక్లీనిక్ రోడ్డులో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని రకాల ఫుడ్స్ సిద్ధంగానే ఉంటాయి. ఆర్ఆర్ జంక్షన్‌లో ఉండే నాన్ వెజ్ రెస్టారెంట్‌లో మాంసాహార వంటకాలు. మదర్‌థెరిస్సా జంక్షన్‌లో సీజన్‌ను బట్టి పండే వివిధ రకాల పండ్లు, వెజిటేరియన్ రెస్టారెంట్స్‌లో ఏనీ టైమ్ ఏనీ ఫుడ్ సిద్ధంగా ఉంటాయి.

ప్రదర్శనలకు వేదిక

పాలిక్లీనిక్ రోడ్డులో ఉన్న సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల, సిద్దార్థ పబ్లిక్ స్కూల్, సిద్దార్థ డిగ్రీ కళాశాల ఆవరణల్లోని మైదానాలు సినిమాలకు సంబంధించిన ఆడియో ఫంక్షన్లు, రాజకీయ నాయకుల సమావేశాలు, క్రికెట్ మ్యాచ్‌లు, వివిధ రకాల ప్రదర్శనలకు వేదికలవుతుంటాయి. ఇక సిద్దార్థ ఆడిటోరియం అయితే సాంస్కృతిక, సాహిత్య, రాజకీయ సంబంధ కార్యక్రమాల వేదికలకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పవచ్చు. యువత అనధికారికంగా నిర్వహించే బైక్ రేస్‌లను అర్థరాత్రి పాలిక్లీనిక్ రోడ్డు రేస్ ట్రాక్‌గా మారుతోంది.

అదనపు కట్నం కోసం వేధింపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మరిదిపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు నగరంలోని కబేళా ప్రాంతానికి చెందిన దుర్గారాధాదేవికి గతేడాది అక్టోబర్‌లో తెలంగాణ రాష్ట్రం భద్రాచలం జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన వందనం రాకేష్ కుమార్‌తో వివాహమైంది. వివాహమైన కొద్దిరోజుల తర్వాత భర్త ఆమెను శారీరంగా, మానసికంగా వేధించసాగాడు. తల్లి లక్ష్మి, తమ్ముడు నితిన్‌తో కలిసి అదనపు కట్నం తేవాలంటూ ఆమెను వేధిస్తున్నాడు. ముగ్గురూ కలిసి రూ. 5లక్షలు అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో భర్త ఆమెపై దాడి చేయడంతో చేయి విరిగింది. ఆమెకు వైద్యం చేయించి, నవంబర్‌లో పుట్టింటికి పంపించారు. ఆ తర్వాత దుర్గారాధాదేవి భర్తకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ఈ నెల 11వ తేదీన ఆమె తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి కాపురానికి వెళ్లింది. అత్తింటికి వెళ్లగానే అదనపు కట్నం తేకుండా ఎందుకు వచ్చావంటూ ఆమెను తల్లిదండ్రులను తిట్టి, వెనక్కు పంపించారు. దీనిపై బాధితరాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేధింపుల కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయ అర్చకులు స్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. పారాయణ మండలి ఆధ్వర్యంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వర ప్రసాద్ పర్యవేక్షించారు.

మధుమేహ పరిశోధనల్లో ఆశాజనక ఫలితాలు


సదస్సు ప్రారంభోత్సవంలో డాక్టర్లు ఐశ్వర్య, ఎంఏ రెహమాన్, దుర్గారాణి, సదాశివరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మధుమేహ వ్యాధిపై జరుగుతున్న పరిశోధనల్లో ఆశాజనకమైన ఫలితాలు వస్తున్నాయని ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ యలమంచి ఐశ్వర్య పేర్కొన్నారు. ముఖ్యంగా కృత్రిమ ప్రాంక్రియాస్ రూపొందించే విషయంలో ముందంజ వేశారని ఆమె తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విజయవాడశాఖ భాగస్వామ్యంలో యలమంచి డయాబెటీస్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం డయాబెటీస్ ఎండో-2022 సదస్సు జరిగింది. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్లో జరిగిన ఈ సదస్సులో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన మధుమేహ నిపుణులు, ఎండో క్రైనాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యలమంచి సదాశివరావు, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఐశ్వర్య మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 ఏళ్లగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మధుమేహ వ్యాధికి సంబంధించిన ఉత్తమ పరిశోధనలు చేసిన వారికి గోల్డ్‌మెడల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. మధుమేహ వ్యాధిపై జరుగుతున్న పరిశోధనా ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా కృత్రిమ ప్రాంక్రియాస్ రూపొందించే విషయంలో విజయం సాధించామన్నారు. మధుమేహ వ్యాధిని ముందుగానే గుర్తించడం ద్వారా అరికట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఈ సదస్సులో బెంగళూరుకు చెందిన డాక్టర్ ప్రసన్నకుమార్‌కు ఫౌండేషన్ తరఫున గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ శేషాద్రి, డాక్టర్ ఎన్‌కె సింగ్, డాక్టర్ షణ్ముగవేలు, డాక్టర్ జైదేవ్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ గీత, డాక్టర్ మైథిలి, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ రవి తదితరులు పలు అంశాలపై ప్రసంగించారు. సదస్సులో ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ రెహమాన్ కార్యదర్శి డాక్టర్ దుర్గారాణి పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన నాటిక ప్రదర్శన


కూచిపూడి నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన మత్తువదలరా హాస్యనాటిక సందేశాత్మకంగా సాగింది. సంసార రథంలో భార్యా భర్తలు ఇద్దరూ రథ చక్రాలులా కలసి ఉన్నప్పుడే సంసార నౌక సాఫీగా సాగిపోతుంది. వారిద్దరి మధ్య అవగాహన స్నేహపూర్వ వాతావరణం ఉండాలని, ఏమాత్రం తేడా వచ్చినా ఒడుదుడుకులకు లోనౌవుతుంది. దానికి తోడు భర్త వ్యవసనపరుడైతే ఇక ఆ ఇల్లాలుకి బాధలు తప్పవు. చుట్టపక్కల వారి సహకారంతో కుటుంబాన్ని దారిలో పెట్టడానికి చేసిన ప్రయత్నమే మత్తువదలరా నాటిక. రచన అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం వెనిగళ్ల భాస్కర్. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వరా ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. కృష్ణం కలయసఖీ సుందరం నర్తన గణపతింతోపాటు పలు అంశాలను ప్రదర్శించారు. నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్, దృశ్యవేదిక వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.


మత్తువదలరా నాటికలోని సన్నివేశం

దేవస్థానాలకు కూరగాయల వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలంలోని శ్రీభ్రమరాంభ మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి అవసరమైన కూరగాయలను విజయవాడ నగరవాసి చలసాని శ్రీనివాస్ వితరణ చేశారు. టీటీడీ దేవస్థానానికి 10 టన్నులు, శ్రీశైలం దేవస్థానానికి మూడు టన్నుల కూరగాయలను వేర్వేరు వాహనాల ద్వారా ఆదివారం గొల్లపూడి పరిధిలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ నుంచి పంపించారు. ఆయా దేవస్థానాలకు చెందిన వాహనాలకు గోవింద నామస్మరణ నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వరస్వామి భక్త సమాజం తరుపున 2014 నుంచి దాతల సహాయ సహకారాలతో స్వామి నిత్యాన్నదాన నిమిత్తం టీటీడీ దేవస్థానానికి కూరగాయలను అందజేస్తున్నామన్నారు. ఈ రోజు పంపిస్తున్న కూరగాయల వ్యాన్ 129వదని తెలిపారు. అదే విధంగా గత ఏడాది నుంచి శ్రీశైలం దేవస్థానానికి కూడా కూరగాయలను వితరణ చేస్తున్నామని చెప్పారు. టీటీడీ దేవస్థానానికి ట్రిప్పునకు 10 టన్నుల చొప్పున పంపుతున్న కూరగాయలు సుమారు రెండు లక్షల మంది భక్తుల అన్నదానానికి ఉపయోగపడతాయని తెలిపారు.


కూరగాయల వ్యాన్లతో వెంకటేశ్వరస్వామి భక్త సమాజం బృందం

ఆయుర్వేదంతో అన్ని రకాల వ్యాధులు నయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆయుర్వేదంతో అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాదరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి దుష్పరిణామాలు లేకుండా ఏ వ్యాధినైనా నయం చేసుకోవచ్చన్నారు. శీతాకాలం కావున ప్రతి ఒక్కరూ గోరువెచ్చని నీటినే తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చిన నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రముఖ హోమియోపతి వైద్యనిపుణులు డాక్టర్ కోన వీరబ్రహ్మం మాట్లాడుతూ ఇక్కడ వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. లివర్ సమస్యలు కామెర్లు తదితర సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఇక్కడే తాము ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామని తెలిపారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాదరావు

అప్పలనాయుడుకు ఘన నివాళులు


ఇజ్జాడ అప్పలనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్, తేజ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జయవాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వరుసగా ఆరు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికైన ఇజ్జాడ అప్పలనాయుడు కొండ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశాడని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. ఇజ్జాడ అప్పలనాయుడు ఐదో వర్ధంతి సందర్భంగా నిమ్మతోట సెంటర్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి దేవినేని అవినాష్ నివాళులర్పించారు. ఇజ్జాడ అప్పలనాయుడు మనువడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, ఆరో డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు లంకా అబ్బినాయుడు, సిమెంట్ ప్రసాద్, కలిశెట్టి భాస్కర్, దాసరి సతీష్, నాజాని, పాపినాయుడు తదితరులు అప్పలనాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

పుంజు కుంటున్నాయ్

సంక్రాంతి సంబరాలకు శిక్షణ పొందుతున్న కోడి పుంజులు

- సూర్యోదయానికి ముందే వ్యాయామం
- ఖరీదైన పౌష్టికాహారంతో అదిరిపోయే మెనూ
- 6 నెలల శిక్షణకు రూ.36 వేల పైమాటే
- ఈసారి సంక్రాంతికి రంగంలోకి అమెరికన్, దేశీయ జాతుల క్రాసింగ్ పుంజులు





ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి కోచింగ్ క్యాంపులు మొదలయ్యాయి. ఆ క్యాంపుల్లో కోడి పుంజులు కొత్త అల్లుళ్ల మాదిరిగా మహారాజ భోగాలు అనుభవిస్తున్నాయి. బాదం..పిస్తా.. మేక మాంసంతో చేసిన ఖైమా వంటి అదిరిపోయే మెనూతో ఒళ్లు పెంచుకుంటున్నాయి. ఆ తరువాత స్పెషల్ ట్రైనర్ల సమక్షంలో వ్యాయామాలు కూడా చేస్తున్నాయి.నిత్యం గోరు వెచ్చని నీటిలో జలకాలాడుతూ సంక్రాంతి పందేలకు సిద్ధమవుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గోదావరి తీరంలో సంస్కృతి, సంప్రదాయల కలబోతగా సాగే సంక్రాంతి సంబరాల కోసం పందెం కోళ్లు క్యాంపుల్లో శిక్షణ పొందుతున్నాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని పల్లెల్లో 6 నెలలుగా పందెం కోళ్లకు శిక్షణ ఇస్తున్నారు. దేశవాళీ జాతులైన నెమలి, డేగ, శేషువా, గేరువా, రసంగి, కాకి, అబ్రాస్, కక్కిరా, పింగళి, నల్లబొట్ల శేషువా, కోడి కాకి వంటి 20 రకాల జాతులకు చెందిన కోడి పుంజులు ఈ క్యాంపుల్లో శిక్షణ పొందుతున్నాయి. ట్రైనర్లను నియమించి మరీ కోడి పుంజులకు శిక్షణ ఇస్తున్నారు. వాటికి బలవర్ధకమైన ఆహారం ఇచ్చేందుకు వేలకు వేలు వెచ్చిస్తున్నారు. రూ.5 వేల నుంచి రూ.10 వేలకు కోడి పుంజుల్ని కొనుగోలు చేసి.. వాటికి 6 నెలల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం ఒక్కొక్క పుంజును రూ.2 లక్షలకు పైనే విక్రయిస్తుంటారు.

మెనూ మామూలుగా ఉండదు మరి

అక్టోబర్ నెలలో ఉదయాన్నే కోడిగుడ్డు, ధాన్యం, గంట్లు కలిపిన మిశ్రమాన్ని కోడి పుంజులకు ఆహారంగా పెట్టారు. ఆ తరువాత నుంచి ఉడకబెట్టిన కోడి గుడ్డును పిండి మాదిరిగా నలిపి మొదటివిడతగా ఉదయం 9 గంటలకు అల్పాహారం, ఉదయం 10 గంటలకు బాదం, పిస్తా కలిపిన మిశ్రమం, 50 గ్రాముల ఖైమా వంటి వాటిని విడివిడిగా పెట్టారు. మధ్యాహ్నం శక్తి కోసం రివైటల్ ట్యాబ్లెట్స్ వేస్తారు. డిసెంబర్ నెలలో 20 నుంచి 30 రకాల డ్రైఫ్రూట్స్‌తో తయారయ్యే నాస్తా పెడుతున్నారు. అంజూర, బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్మిస్, నల్ల ద్రాక్ష, తేనె, నువ్వుల నూనె, సొంఠి, తోక మిరియాలు, మసాలా దినుసులు కలిపి రోటిలో ముద్దగా చేసి రోజుకు ఒక గోలీ చొప్పున తినిపిస్తున్నారు. ఇలా ఒక్కో పుంజుకు రోజుకు రూ.200 వరకు ఆహారం కోసం వెచ్చిస్తున్నారు. ఇలా ఒక పందెం కోడికి 6 నెలల మెనూ ఖర్చు రూ.36 వేలకు పైగా దాటిపోతుంది. ట్రైనర్ల జీతాలు, క్యాంప్ నిర్వహణ ఖర్చులు అదనం.

క్రాస్ జనరేషన్ పుంజులదే హవా

గడచిన మూడేళ్లుగా పందేలలో క్రాస్ జనరేషన్ కోడి పుంజుల హవా నడుస్తోంది. వీటిలో ప్రధానమైనవి అమెరికన్ గేమ్ పాల్, అమెరికన్ పెర్విన్, సాహివాల్‌తో పాటు బ్రెజిల్ జాతి కోళ్ల వంటివి ఉన్నాయి. జత పుంజు, పెట్టను రూ.3.50 లక్షలకు మూడేళ్ల క్రితం అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నారు. వీటిని దేశీయ నెమలి, డేగ తదితర జాతి కోళ్లతో క్రాసింగ్ చేయించారు. విశాఖ, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పశు వైద్యుల పర్యవేక్షణలో ఇదంతా జరిగింది. ఇలా సుమారు 100 జతల కోళ్లను దిగుమతి చేసుకున్నారని అంచనా. ప్రస్తుతం పందెం కోళ్లలో 'అమెరికన్ గేమ్ పాల్' పుంజు ఇటీవల విజేతగా నిలుస్తోంది. దీని తరువాత స్థానం పెర్విన్ జాతిదే. ఈ రెండు క్రాసింగ్ జనరేషన్ పుంజులే. ఈ విదేశీ పుంజులు తొలి ఏడాది బరిలో బోల్తా పడ్డాయి. దీనిని గుర్తించి వీటిని దేశవాళీ మేలు రకం పుంజులతో క్రాసింగ్ చేయడంతో మూడో జనరేషన్ నుంచి వీటిలో పోరాట పటిమ పెరిగిందంటున్నారు. అమెరికన్ జాతి కోళ్లలో మెళకువలు, స్వదేశీ జాతి కోళ్లలో ఎముక పటుత్వం కలగలిపి ఇవి బరిలో మేటిగా నిలుస్తున్నాయని పెంపకందారులు చెబుతున్నారు. ఈ కోడిపుంజు ధర రూ.లక్షకు పైమాటే. తరువాత అమెరికన్ పెర్విన్ జాతి పుంజు రూ.70 వేల ధర పలుకుతోంది. వీటికి శిక్షణ ఖర్చులు అదనం.

పోషణ, శిక్షణతోనే గెలుపు

పందెం కోళ్ల పోషణ చాలా ముఖ్యమైనది. చక్కని బలవర్ధకమైన ఆహారంతో పాటు ఉదయాన్నే కోళ్లకు వ్యాయామం కూడా చేయిస్తాం. నీళ్ల పోత, కాక తీత చేయిస్తాం. ఇదంతా నిపుణుల పర్యవేక్షణలోనే జరుగుతుంది. వైద్యుల సాయంతో మందులు కూడా వినియోగిస్తాం.
– రామరాజు, బట్టేలంక, కోనసీమ జిల్లా

ఈ ఏడాదీ అమెరికన్ గేమ్ పాల్‌దే



2018లో అమెరికన్ గేమ్ పాల్‌దే జాతి కోళ్లను దిగుమతి చేసుకున్నాం. తొలి జనరేషన్ బాగా క్లిక్ అయింది. రెండో జనరేషన్ ఫెయిలైంది. వీటిని నాణ్యమైన దేశీయ కోళ్లతో క్రాసింగ్ చేయడంతో గత సంక్రాంతికి మూడో జనరేషన్ నుంచి ఈ జాతి పోటీలలో విజేతగా నిలుస్తోంది. ఈ ఏడాది కూడా అమెరికన్ గేమ్ పాల్ పైచేయిగా నిలిస్తుందన్న నమ్మకం ఉంది.
– పరుచూరి కృష్ణారావు, గుడివాడ, కృష్ణా జిల్లా


పడమటిపాలెం క్యాంపులో పందెం కోళ్లు


మద్యం, ఆముదం అద్దితో కాక తీత


ఆకు రసాలు కలిపిన వేడి నీటిలో కోడికి నీళ్ల పోత

గిరిజనులకు సేవచేస్తే దేవుణ్ణి పూజించినట్లే


గిరిజనులనుద్దేశించి మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర సరస్వతి


వైద్య శిబిరంలో పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి

- విశాఖ శ్రీ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి
- అరకు లోయలో శంకరాచార్య గిరి సందర్శన మహోత్సవంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ
- వృద్ధులకు రగ్గులు, భక్తులకు భగవద్గీత గ్రంథాల పంపిణీ

అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)/సింహాచలం : గిరిజనులకు సేవ చేయడం భగవంతుని ఆరాధించడంతో సమానమని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. అరకులోయలోని ఎన్టీఆర్ మైదానంలో గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శంకరాచార్య గిరి సందర్శన మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వామీజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణతో కలిసి ఉచిత మెగా వైద్యశిబిరం ప్రారంభించారు. 500 మంది పేద వృద్ధులకు దుప్పట్లు, 500మంది భక్తులకు భగవద్గీత గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు కల్మషం లేనివారని, వారికి సేవచేయాలని ఉద్బోధించారు. అందరూ దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో భగవంతుని కొలుస్తారు కానీ ఇక్కడ గిరిజన ప్రజలు ప్రకృతిని, చెట్లను దైవంగా ఆరాధిస్తారన్నారు. ఆంజనేయస్వామి గిరిజనుడే అని, అడవి బిడ్డలంతా అంజనీపుత్రుని వారసులేనని తెలిపారు. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మతమార్పిడులు చేస్తున్నారని, వారిని కట్టడి చేసేందుకే క్రిస్మస్ రోజున భగవద్గీతలను పంపిణీ చేశామన్నారు. గిరిజన ప్రాంతంలో దేవాలయల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తామన్నారు. పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు విద్య అందించేందుకు త్వరలోనే పాఠశాలలు ఏర్పాటుచేస్తామన్నారు. ఇక రాష్ట్రంలో గిరిజన ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక జిల్లాలు ఏర్పడటం ఆనందంగా ఉందని, ఏపీలో మాత్రమే ఇలా గిరిజనులకు ప్రత్యేక జిల్లాలు ఏర్పాటయ్యాయని స్వామీజీ అన్నారు. చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో ప్రజలను దైవ మార్గంలో నడిపించేందుకు కృషిచేయడంతోపాటు విద్య, వైద్య రంగాల్లో సేవలందిస్తున్న విశాఖ శారద పీఠానికి రుణపడి ఉంటామన్నారు. గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి జగదీష్‌బాబు, ఎంపీపీ ఉషారాణి తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాలి జనార్దనరెడ్డి కొత్త పార్టీ

- కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ ఏర్పాటు చేస్తున్నా
- గంగావతి నుంచి పోటీచేస్తా
- బీజేపీతో రుణం తీరింది: జనార్దనరెడ్డి

బనశంకరి: ప్రజల ఒత్తిడితో మళ్లీ ప్రజా జీవితంలో చురుగ్గా పాల్గొనడానికి కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి ప్రకటించారు. బీజేపీతో రుణం ఆదివారంతో తీరిపోయిందన్నారు. ఆయన ఆదివారం బెంగళూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బసవణ్ణ ఆశయాలతో కుల, మత, లింగభేదం లేకుండా నూతన పార్టీ పనిచేస్తుందన్నారు. ఎలాంటి కొత్తపని చేపట్టినా ఇంతవరకు తనకు ఓటమిలేదని చెప్పారు. అదేవిధంగా తనకు కొత్తపార్టీలో కూడా విజయం దక్కుతుందని, అందరూ మద్దతు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వాజ్‌పేయి, ఎల్.కె.అద్వాని, యడియూరప్ప, శ్రీరాములు.. అందరినీ గుర్తుతెచ్చుకుని బీజేపీని వదిలిపెట్టానన్నారు. 2023 ఎన్నికల్లో కొప్పళ జిల్లాలోని గంగావతి నియోజకవర్గం నుంచి పోటీచేస్తానని చెప్పారు. అక్కడే ఇల్లు కట్టుకుని, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్నానని తెలిపారు. తాను ఎవరితోను ఒప్పందపు రాజకీయం చేయనని పేర్కొన్నారు. 10–15 రోజుల్లో పార్టీ కార్యాలయం, అభ్యర్థులను ప్రకటిస్తానని చెప్పారు. తనతో రావాలని సోదరులనే కాదు ఎవరినీ డిమాండ్ చేయనన్నారు. తన భార్య అరుణాలక్ష్మి పార్టీ బలోపేతం కోసం తనతో పనిచేస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇకపై తనను టార్గెట్ చేసుకుని అణచివేత పనులు చేసినా వెనకడుగు వేసే ప్రశ్న లేదన్నారు. బీజేపీ కోసం చాలా శ్రమించానని, కానీ తనకు వ్యతిరేకంగా కుట్రపన్ని ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇచ్చిన మాట తప్పారని, గతంలో తన వ్యాపారాలు, వ్యవహారాలను వదిలిపెట్టి పార్టీని బలోపేతం చేసినప్పటికీ విలువ లేకుండా పోయిందని ఆయన చెప్పారు. గాలి జనార్దనరెడ్డి కొత్త పార్టీ ఏర్పాటుపై సీఎం బసవరాజ బొమ్మైని విలేకరులు ప్రశ్నించగా నో కామెంట్ అని బదులిచ్చారు.

జిల్లా వార్తలు

కొత్త వేరియంట్లకు...
మాస్క్‌తో ముకుతాడు

- ఒమిక్రాన్ కంటే బీఎఫ్–7 సివియర్‌గా ఉండొచ్చు
- మాస్కు ధరించి కోవిడ్ నిబంధనలు పాటించాలి
- జిల్లాలను అప్రమత్తం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- లక్షణాలను బట్టి పరీక్షలు చేసేందుకు కిట్‌లు రెడీ
- పాజిటివ్ శాంపిల్స్ జీనోమ్ పరీక్షలకు..


వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో కోవిడ్ పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): కోవిడ్ ప్రభావం పూర్తిగా తగ్గిపోయిందనే భావనతో కొన్ని నెలలుగా మాస్కులు లేకుండా అందరూ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. పండుగలు, శుభకార్యాలు బంధువులు, స్నేహితులందరి సమక్షంలో ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ తరుణంలో ఒమిక్రాన్ బీఎఫ్–7 అనే కొత్త వేరియంట్ రూపంలో ముప్పు ముంచుకొస్తుందంటూ కేంద్ర ప్రభుత్వం పిడుగులాంటి వార్త చెప్పింది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది కేసులు నమోదవుతున్నాయని, అప్రమత్తంగా ఉంటూ, కోవిడ్ నిబంధనలు పాటించాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైన వారికి కోవిడ్ పరీక్షలు చేయాలని నిర్ణయించారు.

వైద్యశాఖ అప్రమత్తం..

కేంద్రం సూచన మేరకు వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. లక్షణాలు ఉన్న వారికి కోవిడ్ పరీక్షలు చేయడంతో పాటు, పాజిటివ్ వచ్చిన వారికి ఏ వేరియంట్ సోకిందో తెలుసుకునేందుకు జీనోమ్ సీక్వెన్స్ పరీక్షకు పంపనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉండటంతో పెద్దగా ఇబ్బంది ఉండబోదని వైద్య నిపుణులు అంటున్నారు. ఎవరికైనా వైరల్ నిమోనియాలా సోకినా వెంటిలేటర్‌లు సైతం అందుబాటులో ఉండటంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు.

కొత్త వేరియంట్ లక్షణాలివే..

ఒమిక్రాన్ మాదిరిగానే జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, తుమ్ములు తక్కువగా వస్తాయి. కడుపునొప్పి, వీపులో నొప్పి రావచ్చు. ఊపిరితిత్తులపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. చాలా కొద్ది మందిలో మాత్రమే ప్రభావం చూపే అవకాశం ఉంది. అలాంటి వారు ముందు జాగ్రత్తగా వైద్యులను సంప్రదించి చికిత్స పొందడం మేలు.

వేగంగా వ్యాప్తి..

లక్షణాలు పెద్దగా కనిపించని కారణంగా ఈ కొత్త వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందవచ్చని వైద్యులు చెపుతున్నారు. ఒకరి నుంచి 18 మందికి సోకే అవకాశం ఉందని అంటున్నారు. వైరల్ జ్వరం వచ్చినట్లే లక్షణాలు ఉంటాయంటున్నారు. ఇప్పటికే ఈ వేరియంట్ ఇండియాలో ఉందని, సివియర్ కేసులు నమోదు కావడం లేదని శ్వాసకోశ వ్యాధుల నిపుణులు చెపుతున్నారు. ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి, భౌతిక దూరం పాటించడం మేలని సూచిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం మంది వ్యాక్సిన్‌లు వేయించుకోగా, ఒమిక్రాన్‌కు ఎక్కువ మంది ఎఫెక్ట్ కావడంతో అంతగా ప్రభావం ఉండక పోవచ్చనేది వైద్యుల మాట. అయితే వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉండే వృద్ధులు, పిల్లలు, క్యాన్సర్ రోగులు, మధుమేహులు, రక్తపోటు ఉన్న వారు, డయాలసిస్ రోగులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

సివియర్ కేసులు లేవు..



కొత్త వేరియంట్ ఒమిక్రాన్ బీఎఫ్ 7 ప్రాణాంతకం కాకపోవచ్చు. ఇప్పటికే దేశంలో ఈ వేరియంట్ కేసులు నమోదవుతున్నాయి. ఎక్కడా సివియర్ కేసులు ఉన్నట్లు నమోదు కాలేదు. లంగ్ ఇన్వాల్వ్‌మెంట్ కూడా ఉండకపోవచ్చు. లక్షణాలు పెద్దగా కనిపించవు. వైరల్ ఫీవర్ లక్షణాలు వలే ఉంటాయి. దీంతో వ్యాప్తి ఎక్కువగా ఉన్నా దాని ప్రభావం తక్కువగా ఉండొచ్చు. ఇమ్యునిటీ తక్కువగా ఉన్న వారు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ప్రజలు ఆందోళన చెందకుండా జాగ్రత్తలు పాటించడం మేలు.
– డాక్టర్ ఎం. రవీంద్రనాథ్, పల్మనాలజిస్టు

కోవిడ్ నిబంధనలు పాటించాలి..



ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాలి. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా మాస్కు ధరించాలి. జనసందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా ఉండటమే మంచిది. రాష్ట్ర వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు కోవిడ్ లక్షణాలున్నట్లు గుర్తించిన వారికి కోవిడ్ పరీక్షలు చేస్తాం. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లోనే ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించనున్నారు. పాజిటివ్ వచ్చిన వారి శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్స్ పరీక్షలకు పంపిస్తాం.
– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

ఆకట్టుకున్న అష్టావధానం



అష్టావధానం నిర్వహిస్తున్న నల్లాన్ చక్రవర్తుల సాహిత్ వేదిక మీద మల్లా ప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

విజయవాడ కల్చరల్: అద్భుతమైన పూరణలు, వేగంగా సాగిన ఆశువులు, సరస ఛలోక్తులతో సాగిన నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అష్టావధానం ఆద్యంతం సాహితీ సమర్పణగా సాగి ప్రేక్షకలతో భళిరా సాహిత్ అనిపించింది. ఒక పక్క ఉద్దండ పండితులు 8 మంది, మరో వైపు పద్మ వ్యూహంలో చిక్కుకున్న అర్జునుడిలా అతడిపై వారు సంధించిన సాహితీ అస్త్రశస్త్రాను యువకుడు సాహిత్ తేలికగా అడ్డుకున్నాడు. శ్రీ సద్గురు సంగీత సభ విజయవాడ దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నల్లాన్ చక్రవర్తుల సాహిత్ అష్టావధానం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. సరస్వతీ ప్రార్థనతో అవధానం ప్రారంభమైంది. ఉప్పలదడియం భరత్ శర్మ నిషిద్ధాక్షరి, పాలపర్తి శ్యామలానందప్రసాద్ సమస్య, డాక్టర్ గుమ్మా సాంబశివరావు దత్తపది, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ వర్ణన, న్యస్తాక్షరి డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ,ఆశువు కుందా విజయరామశర్మ వారగణనం ఉపద్రష్ట లక్షణసూరి, అప్రస్తుత ప్రసంగం అంశాన్ని దండిభొట్ల దత్తాత్రేయశర్మ నిర్వహించారు. పృచ్ఛకులు అడిగిన అంశాలను అవధాని తేలికగా ఎదుర్కొన్నారు. కార్యక్రమాన్ని సమన్వయ పరచిన ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ తెలుగు వారి సాహితీ ప్రక్రియలో అవధానం ఉన్నతమైనదని దానిని భావితరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. యువతను అవధానం వైపు మళ్లించాల్సిన అవసముందన్నారు. ఏటా ఫిబ్రవరి 22న ప్రభుత్వం అంతర్జాతీయ అవధాన దినోత్సవం ప్రకటించడానికి కృషి చేస్తామని మంత్రి ధర్మానప్రదరావు హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ అవధాని జీవిత విశేషాలను వివరించారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, సంస్థ కార్యదర్శి జేఎస్ఎస్ ప్రసాద్ శర్మ, కోశాధికారి వీఆర్ సుబ్రహ్మమణ్యం పాల్గొన్నారు.

తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక


తైక్వాండో జిల్లా జట్టు

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ అండర్–14, 17 రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు తైక్వాండో కోచ్ గౌరీశంకర్ తెలిపారు. గొల్లపూడిలోని జీవిజీ స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 240 మంది క్రీడాకారులు హాజరైనట్లు చెప్పారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, జి.వెంకటదినేష్, ఆర్.డి. నాయుడు, వి.జ్యోతిస్వరూప్, ఎం.సౌమ్యకుమారి, అఖిల్, సి.హెచ్.మైత్రేయి, ఎం.అర్షక్, రామ్‌చరణ్, ఇ.కావ్యను జట్టుకు ఎంపికచేసినట్లు చెప్పారు. ఎంపికైన జట్లు ఈ నెల 28వ తేదీన నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోపాల్గొంటారన్నారు.

నేడు హాకీ జిల్లా జట్ల ఎంపిక...
రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల హాకీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్లను ఈ నెల 26వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కె.రాజశేఖర్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్యస్టేడియంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 2006 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు వారి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన జట్టు జనవరి 11 నుంచి 13వ తేదీ వరకు ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పాల్గొనాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పాల్గొని ప్రధాన మంత్రితో మాట్లాడే అవకాశం పొందాలని జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక ఒక ప్రకటనలో కోరారు. 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్చపే కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు తమ ప్రశ్నను ప్రధాన మంత్రిని అడిగే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు మీ స్వాతంత్ర్య సమరయోధులను తెలుసుకోండి, మన సంస్కృతి మనకు గర్వకారణం, నా పుస్తకం నా ప్రేరణ, భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడండి, నా జీవితం, నా ఆరోగ్యం, నా స్టార్టప్ కల, స్టెమ్ విద్య, హద్దులు లేని విద్య నేర్చుకోవడానికి బొమ్మలు, ఆటలు థీమ్స్ పై ప్రధానిని ప్రశ్నలు అడగవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు మన వారసత్వం, అభ్యాస పర్యావరణాన్ని ప్రారంభించడం, నైపుణ్యం కోసం విద్య,తక్కువ కరిక్యులర్ లోడ్ మరియు పరీక్షలకు భయలేని వాతావరణం, భవిష్యత్తు విద్య సవాళ్లు థీమ్స్‌పై, తల్లిదండ్రులు నా బిడ్డ, నా గురువు వయోజన విద్య.ప్రతి ఒక్కరినీ సాహిత్యం చేయడం, కలిసి నేర్చుకోవడం మరియు పెరగడం థీమ్స్‌పై ప్రశ్నలు అడగాలని సూచించారు. పరీక్ష పే చర్చ కార్యక్రమంలో పాల్గొని భారత ప్రభుత్వం అందించే రివార్డును గెలుచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్, టెక్నికల్ సపోర్ట్ ఇతర వివరాలకు 9866528299 నంబరులో సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదానానికి పలువురు భక్తుల విరాళాలు


నిత్యాన్నదానానికి విరాళం అందచేస్తున్న మామిళ్ల పిచ్చయ్య కుటుంబం


ఆలయ అధికారికి విరాళం అందచేస్తున్న రామచంద్రరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందచేశారు. విజయవాడకు చెందిన పిచ్చయ్య శారీస్‌కు చెందిన మామిళ్ల పిచ్చయ్య కుటుంబం అమ్మవారిని దర్శించుకుంది. నిత్యాన్నదానానికి వారు రూ. 1,01,116 విరాళాన్ని ఆలయ ఈవో భ్రమరాంబకు అందచేశారు. అదేవిధంగా విజయవాడ కేపీ నగర్‌కు చెందిన అట్లూరి రామచంద్రరావు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న తిరుపతమ్మ వారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజుతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలిరావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సన్నిధి



మంచి మాట

ఉన్నంత వరకూ ఉన్నతంగానే...

కష్టానికి కష్టం వస్తేనూ, నష్టం నష్టపోతేనూ బావుణ్ణు; మనిషి కష్టం లేకుండానూ, నష్టపోకుండానూ బావుంటాడు' ఇలా అనుకోవడం బావుంటుంది. కానీ వాస్తవంలో ప్రతిమనిషికీ జీవితంలో, జీవనంలో కష్టాలు, నష్టాలు కలుగుతూనే ఉన్నాయి, కలుగుతూనే ఉంటాయి. మనిషినే కాదు ప్రపంచాన్ని కూడా కష్టాలు, నష్టాలు కుదిపేస్తూనే ఉన్నాయి, కుదిపేస్తూనే ఉంటాయి.

జీవనంలో కలుగుతూ ఉండే కష్టాలు, నష్టాలవల్ల నిస్తేజమూ, కలవరమూ, గందరగోళమూ ఎవరికైనా తప్పవు. జీవితం అన్నాక కష్టం, నష్టం ఒకటి తరువాత ఒకటిగా, ఒకదానిపై ఒకటిగా వస్తూనే ఉంటాయి. వచ్చిన కష్టం ఏదైనప్పటికీ, కలిగిన నష్టం ఎంతదైనప్పటికీ మనిషి వాటిని తట్టుకోగలగాలి. కష్టాలకు, నష్టాలకు లొంగిపోకూడదు, కుంగిపోకూడదు. మనిషి లొంగిపోయాడు, కుంగిపోయాడు కదా అని కష్టాలు,నష్టాలు మనిషిని వదిలెయ్యవు. లొంగిపోయిన, కుంగిపోయిన మనిషి కష్టాలు, నష్టాలు ఉధృతం అవుతాయి. మనిషి తన మనసుతో, మెదడుతో కష్టాలను, నష్టాలను నిలువరించి అధిగమించాలి.

చచ్చినట్టు బతకడం నుంచి నచ్చినట్టు బతకడంలోకి వెళ్లేందుకు మనిషి ప్రయత్నించాలి. అందువల్ల కష్టాలు, నష్టాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మనిషి తనను తాను తయారుచేసుకోగలుగుతాడు. తాను చచ్చేలోపు ఉచ్చస్థితికి చేరుకోవాలన్న ఆలోచన చెయ్యాలి. ఆ స్థితిని సుసాధ్యం చేసుకోవడం మనిషి నేర్చుకోవాలి. అందువల్ల కష్టాలు, నష్టాలు తనను నిస్తేజంలోకి నెట్టెయ్యకుండా మనిషి నిలదొక్కుకోగలడు.

మనుషులమై పుట్టామని గుర్తుంచుకుందాం; ఏ కష్టం వచ్చినా, ఎంత నష్టం వచ్చినా చేవను ఊతంగా చేసుకుందాం. జరిగిపోయిన వాటి గురించీ, కలిగిన కష్టాలు, నష్టాల గురించీ చింతిస్తూ ఉండిపోవడం పిరికితనం. మనం పిరికితనానికి బలి కాకూడదు. పిరికితనం నుంచి మనం ధైర్యంతో బయటపడాలి. కష్టం, నష్టం నుంచి విముక్తం అవడానికి మనకు ధైర్యం కావాలి. మనం ధైర్యంతో కదలాలి. 'ఉన్నంతవరకూ ఉన్నతంగానే ఉందాం, అనే చింతన వస్తే ఏ కష్టం లోనైనా, ఎంత నష్టంలోనైనా మనకు చైతన్యం వస్తుంది. ఆ చైతన్యమే కష్టాలు, నష్టాల నుంచి మనల్ని ముందుకు నడిపిస్తుంది. కష్టం కలిగినప్పుడూ, నష్టం కలిగినప్పుడూ మనిషికి నిస్పృహ వచ్చేస్తుంది. ఇక్కడే మనిషి జాగ్రత్తగా ఉండాలి. నిస్పృహ అనే మత్తుకు మనిషి అలవాటు పడకూడదు. ఆవరించిన నిరాశను అంతం చేసుకోవాలి.

ఏ చీకటైనా తొలగిపోవాల్సిందే. ఎంతటి తుఫానైనా ఆగిపోవాల్సిందే. చీకటి మూగినప్పుడు సంయమనంతో ఉంటే ఉదయాన్ని చూడగలం. తుఫాను ముంచుకొచ్చినప్పుడు అప్రమత్తంగా ఉంటే ప్రశాంత వాతావరణంలోకి వెళ్లగలం. భూకంపం వచ్చాక కూడా అభివృద్ధి జరుగుతుందని, జరిగిందని మనం గుర్తుంచుకోవాలి. కష్టాలు, నష్టాలు దెబ్బలలా, దెబ్బలమీద దెబ్బలలా తగులుతున్నప్పుడు జీవితం పగిలిపోలేదని గ్రహించాలి. మనం ఉన్నందుకు, మనకు ఉనికి ఉన్నందుకు మనకు పటుత్వం ఉండాలి. కష్టాలు, నష్టాలు కలిగినా నేడు అనే వేదికపైన మనం నిలదొక్కుకుని ఉండగలిగితే రేపు వస్తుంది. ఆ రేపు మనల్ని కష్టాలు, నష్టాలు వీడిపోయిన ఎల్లుండిలోకి తీసుకెళుతుంది.

అటుపైన మతిలో సదాశ పుట్టాలి. మనిషి ఆశపడాలి. కష్టాలు, నష్టాలు కలిగాక వాటికి అతీతం అవ్వాలనే ఆశ కావాలి. సుఖపడాలని మనిషి ఆశపడాలి.

బాగా బతకడానికి అవకాశాలు ఎప్పటికీ బతికే ఉంటాయి. ఆ విషయాన్ని మనం సరిగ్గా పసికట్టాలి. దెబ్బతిన్న తరువాత బాగు పడాలనుకోవడం దోషం కాదు. దెబ్బతిన్న తరువాతైనా, దెబ్బ తిన్నందుకైనా మనిషి బాగుపడి తీరాలి. మళ్లీ పుడతామో లేదో మనకు తెలియదు; మరణించాక మనకు పని ఉండదు; బాగా బతకాలని గట్టిపట్టుపడదాం. కష్టం, నష్టంవల్ల మనల్ని మనం కోల్పోకూడదు. జీవనం జారిపోతే జీవితం పండదు. మనిషికి ఆశ కావాలి. మనిషి తన బతుకును తాను ఆస్వాదించడం నేర్చుకోవాలి. బతుకును ఆస్వాదించడం తెలిస్తే కష్టాలనూ, నష్టాలనూ ఓడించడం తెలుస్తుంది. కష్టనష్టాలపై గెలుపు మనిషికి పొలుపు.

మనకు గతాన్నీ, వర్తమానాన్నీ ఇచ్చిన కాలం భవిష్యత్తునూ ఇస్తుంది. కష్టానికీ, నష్టానికీ మనం పతనం అయిపోవడం కాదు, కలిగిన కష్టాన్నీ, నష్టాన్నీ పతనం చెయ్యడానికి మనం ఉపక్రమించాలి. ఉత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఊపిరిలోకి తీసుకుని ఉద్యుక్తులమై మనం ఉన్నతమైన ప్రగతిని సాధించాలి.

– రోచిష్మాన్

గురువాణి



పిలవకపోయినా వచ్చి తలకెక్కుతుంది

'అవినయమపనయ విష్ణో...' అంటారు శంకర భగవత్పాదులు షట్పదీ స్తోత్రం చేస్తూ. ఆయన మొట్ట మొదట నారాయణ మూర్తిని అడిగేదేమిటి అంటే...''స్వామీ! నాకు అహంకారాన్ని తొలగించు. నాకు వినయాన్ని కటాక్షించు..'' అని. ఆ వినయం మనిషి శీలానికి అంత ప్రధానం. సర్వసాధారణంగా లోకంలో ఉండే లక్షణం .. నాకు చాలా సమృద్ధి ఉంది. నేను ఇతరులకన్నా అందంగా ఉంటాను... మంచి పొడగరిని... నేను మంచి రంగుతో ఉంటాను... నాకు లక్ష్మీకటాక్షం ఉంది... నేను మంచి మాటకారిని... మిగిలినవారి కన్నా ప్రతిభావంతుడిని... నాకు బుద్ధి కుశలత ఎక్కువ... ఇలా అహంకారం పొందడానికి ఒక కారణం అంటూ అక్కర లేదు. ఏదయినా కారణం కావచ్చు. అహంకారం పొందడానికి ప్రత్యేకంగా శిక్షణ తీసుకోవాల్సిన పని కూడా లేదు. ఏదో ఒక కారణంతో అహంకారం ఏర్పడుతుంటుంది. ఇది మనిషి ఉన్నతికి ఉండదగినది కాదు. దీనికి పూర్తిగా వ్యతిరేకమైనది, అంత తేలికగా అలవడనిది, ప్రత్యేకించి ప్రతి మనిషి ప్రయత్నపూర్వకంగా ఆహ్వానించదగినది, మనిషికి అలంకారప్రాయమైనది.. వినయం.

వినయాన్ని గురించి భర్తృహరి సంస్కృతంలో చెప్పిన విషయాన్ని ఏనుగు లక్ష్మణ కవి మనకు అర్థమయ్యేటట్లుగా తెలుగులో ఇలా చెప్పారు– ''తరువు లతిర సఫలభార గురుత గాంచు /నింగి వ్రేలుచు నమృత మొసంగు మేఘు / నుద్ధతులు గారు బుధులు సమృద్ధి చేత/ జగతి నుపకర్తలకు నిది సహజగుణము.'' చెట్టు బోలెడన్ని పూలు పూస్తుంది. పిందెలొస్తాయి. కాయలొస్తాయి. గుత్తులు గుత్తులుగా పండ్లు వేలాడుతూ ఉంటాయి. వాటి బరువుకు అవి వంగి ఉంటాయి. అప్పుడు చెట్టంతా కూడా వంగి ఉన్నట్లు కనిపిస్తుంటుంది. నిజానికి చెట్టు ఇప్పుడు సమృద్ధితో ఉంది కాబట్టి మరింత నిటారుగా నిలబడి ఉండాలి. కానీ బాగా తలవంచినట్టు కనబడుతున్నది. అలాగే మేఘాలు పైపైన ఆకాశంలో ప్రయాణిస్తూ పోకుండా బాగా కింద భూమికి దగ్గరగా వేలాడుతూ కనిపిస్తుంటాయి. దీనివల్ల లోకానికి మహోపకారం జరుగుతూ ఉంటుంది. అవి వర్షించకపోతే మన దాహం తీరేదెట్లా? ప్రకృతికి జీవం పోయకపోతే జీవుల ఆకలి తీరేదెట్లా? అంత అమృతాన్ని నింపుకొన్నప్పటికీ మేఘాలు కిందకు వినయంతో వంగి ఉన్నట్లు కనిపిస్తుంటాయి.

ఉద్ధతులు కారు బుధులు సమృద్ధి చేత... బుధులు అంటే సత్పురుషులు, పండితులు, విద్వాంసులు, విజ్ఞానం, వివేకం కలిగినవారు. వీరి సహజ లక్షణం వినయంతో వంగి ఉండడం. నేనే గొప్ప, నా అంతటి వాడు మరొకడు లేడు అన్నవాడికి ఇతరుల కష్టం అర్థం కాదు. వినయశీలురైన బుధులు ఇతరులు చెప్పేది వినడానికి, వారి కష్టనష్టాలను అర్థం చేసుకోవడానికి, వారికి ఉపకారం చేయడానికి సర్వవేళలా సిద్ధంగా ఉంటారు.

వినయం ఎక్కడ ఉందో అక్కడ కీర్తి, అభివృద్ధి, సదాలోచన, మంచి కార్యాలకు రూపకల్పన, నిర్వహణ, సేవాభావం ఉంటాయి. మనం బొట్టుపెట్టి పిలవకపోయినా, ఎటువంటి ప్రయత్నం చేయకపోయినా.. మనల్ని అత్యంత సులభంగా ఆవహించే అహంకారాన్ని తొలగించుకోవాలి. ప్రయత్నపూర్వకంగా నేను ప్రార్థన చేస్తున్నాను కాబట్టి నాకు వినయాన్ని కటాక్షించు.. అని వేడుకుంటున్నాం కాబట్టి ఈశ్వరానుగ్రహం చేత అది మనకు లభించినప్పుడు మనం కూడా యశోవిరాజితులం కాగలుగుతాం. అంతకన్నా కావలసింది ఏముంది !!!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

దేవుని వైపు చూడు

సువార్త



నీకన్న ఉన్నతమైన ఆకాశ విశాలమువైపు చూడుము (యోబు 35:5). పరిశుద్ధ గ్రంథంలో యోబు గ్రంథం చారిత్రాత్మకమైనది. ఊజు దేశములో నివసించిన యోబు అనే భక్తిపరుని జీవితంలో జరిగిన సంఘటనల సమాహారం యోబు గ్రంథం. నీకన్నా ఉన్నతమైన వాటిని చూడు అని యోబు స్నేహితుడైన ఎలీహు చెప్పాడు. అవును! జీవితంలో ఉన్నత ఆశయాలు, లక్ష్యాలు కలిగుండడం ఎంతో అవశ్యకం. మీరు క్రీస్తుతో లేపబడినవారైతే పైనున్నవాటిని వెదకండి అని పౌలు మహాశయుడు కొలస్సై అనే ప్రాంతంలో ఉన్న సంఘానికి వ్రాశాడు.

ప్రియ మిత్రమా! నీవు చూడని వాటిని ఎన్నడును పొందుకోలేవు. నీ విశ్వాస నేత్రాలకు అంత శక్తి ఉంది. ఆశ లేని వానిని దేవుడు కూడా ఆశీర్వదించలేడు. నీ చూపు ఎటువైపు? నిత్య జీవితంలో వేటిని చూస్తున్నావు? నీ విశ్వాస నేత్రాలు సరిగా పనిచేస్తున్నాయా? లేక మసకబారిపోయాయా? శక్తిగల యేసు రక్తంతో నీ కళ్లు కడుక్కో! నీవు ఎక్కడకు చేరాలనుకుంటున్నావు? ఏం కావాలనుకుంటున్నావు? అనే విషయాలను నీ విశ్వాస నేత్రాలతో ప్రతిదినము చూడు. తప్పక చేరుకుంటావు. నీ ఆలోచనలు ఎప్పుడు ఎత్తుగా ఉండనివ్వు. నీ ఆలోచనలను మించి నీవెన్నడు ఎదగలేవు. విశాలమైన వాటిని చూడు. ఒకప్పుడు ఇరుకులో ఉన్న మనలను దేవుడు విడిపించాడు. ఇరుకైన తలంపులు, ఆలోచనలు మనలో ఉంటే అవే పనిగట్టుకొని మనలను క్రిందకు దిగజారుస్తాయి. దేవునిలో నీవున్నావు గనుక నిన్ను నీవు నిరూపించుకోవాల్సిన సమయంలో దయచేసి చతికిలపడకు. నీవు దేవుని బిడ్డవు గనుక గొప్పవాటిని చేయాలనే దేవుడు నిన్ను నియమించాడు, ఏర్పరచుకున్నాడు. నిన్ను తన రక్తం పెట్టి కొనుక్కున్న దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదని నిరూపించు. క్రీస్తు రక్తం పెట్టి నీవు కొనబడ్డావు గనుక నీవు విజేతవే. దేవుని ప్రణాళికలో ఉన్న స్థానాన్ని నీవు ఖచ్చితంగా అలంకరిస్తావు.

ఉన్నతమైన అనుభవాలతో నింపబడడానికి అనుక్షణం ప్రయాసపడు. తుచ్ఛమైన వాటికోసం దయచేసి ఆలోచన కూడా చెయ్యొద్దు. నీ బద్దకం ద్వారా ఆధ్యాత్మిక నిర్లక్ష్యం ద్వారా ఘనతర లక్ష్యాలను నిలువునా నీరుగారనియ్యొద్దు. దేవుని కార్యములను ఎన్నడు జాప్యం చెయ్యొద్దు. నీవు ఎన్నుకున్న రంగంలో ప్రతిఫలాన్ని ఆశించకుండా కష్టపడు. దేవుడు నీకు తగిన సమయంలో ప్రతిఫలమిస్తాడు. శ్రద్ధతో పనిచేయి... దేవుడు నిన్ను రాజుల ముందు నిలబెడతాడు. విధినిర్వహణలో ఎదురౌతున్న సవాళ్లను జయించడానికి దేవుని సన్నిధిలో ప్రార్థించు. దేవుడు ప్రార్థన ఆలకించువాడు.

నీ జీవిత అభివృద్ధికైనా, పతనానికైనా నీవే బాధ్యుడవని గుర్తించు. లొసుగులు లోటుపాట్లు సరిచేసుకోవడానికి సిగ్గుపడకు. తప్పులను కప్పుకోకుండా సరిచేసుకోవడం నేర్చుకుంటే నీకు తిరుగు ఉండదు. ఎందుకంటే దైవిక శక్తి నీకు మెండుగా అందుతుంది గనుక. ఎవ్వరైనా నీమీద నమ్మకం పెట్టుకుంటే కలలోనైనా దానిని వమ్ముచేయకు. దేవుని శక్తితో, కర్తవ్యదీక్షతో ముందుకు సాగిపోతే నిన్ను నిలువరించే శక్తి ఎవ్వరికీ లేదు...ఎప్పటికీ ఉండబోదు.

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా



విలక్షణ నటుడు చలపతిరావు కన్నుమూత

ప్రతి నాయకుడిగా, సహాయ నటుడిగా, హాస్య నటుడిగా ప్రేక్షకులను మెప్పించిన సీనియర్ నటుడు తమ్మారెడ్డి చలపతిరావు (78) ఇక లేరు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని తన స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారాయన. 1200 పైగా చిత్రాల్లో నటించిన చలపతిరావు ఇంకా నటుడిగా కొనసాగుతున్నారు. చనిపోయే ఐదు రోజుల ముందు కూడా నటుడిగా మేకప్ వేసుకున్నారాయన.

కృష్ణా జిల్లా పామర్రు మండలంలోని బల్లిపర్రులో మణియ్య, వియ్యమ్మ దంపతులకు 1944 మే 8న చలపతిరావు జన్మించారు. నందమూరి తారక రామారావు అంటే ఎంతో ఇష్టం. ఎన్టీఆర్ స్ఫూర్తితో తాను కూడా హీరో కావాలని అవకాశాల్ని వెతుక్కుంటూ మద్రాస్ (చెన్నై) వెళ్లారు చలపతిరావు. సూపర్ స్టార్ కృష్ణ నటించిన 'గూఢచారి 116' (1966) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు చలపతిరావు. ఆ తర్వాత 'సాక్షి, బుద్ధిమంతుడు, టక్కరి దొంగ చక్కని చుక్క' వంటి చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్ ప్రోత్సాహంతో 'కథానాయకుడు' (1969) సినిమాలో మున్సిపల్ కమిషనర్ పాత్ర చేశారు. ఎన్టీఆర్‌తో ఉన్న స్నేహం కారణంగా కెరీర్ ఆరంభంలో ఐదారేళ్ల పాటు ఆయన సినిమాల్లోనే నటించారు చలపతిరావు. హీరో కావాలని వెళ్లిన చలపతిరావుకి ఎక్కువగా విలన్ పాత్రలే వచ్చేవి. అయితే 'దాన వీర శూర కర్ణ' చిత్రం ఆయన కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ సినిమాలో ఐదు పాత్రల్లో నటించారాయన. కెరీర్ ఆరంభంలో ఎక్కువగా మానభంగం సన్నివేశాల్లో నటించారు చలపతిరావు. దాదాపు 90కి పైగా రేప్ సీన్స్‌లో నటించారాయన. అప్పటివరకు విలన్ పాత్రలు చేసిన చలపతిరావుని 'నిన్నే పెళ్లాడతా' (1996) సినిమా నటుడిగా ఆయనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. సాఫ్ట్ క్యారెక్టర్స్‌కు ఆయన న్యాయం చేయగలరనే నమ్మకం దర్శక-నిర్మాతల్లో కలిగించింది ఆ సినిమా. దీంతో 'నిన్నే పెళ్లాడతా' తర్వాత మంచి తండ్రి, బాబాయ్ పాత్రలు కూడా ఆయన్ని వరించాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణంరాజు, కృష్ణ, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్‌లతో పాటు నేటి తరం యువ హీరోల సినిమాల్లోనూ ఆయన వివిధ పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. ఆయన ఈ ఏడాది వెండితెరపై కనిపించిన చిత్రం 'బంగార్రాజు' (2022). ఐదు దశాబ్దాల సినీ కెరీర్‌లో దాదాపు 1200లకుపైగా సినిమాల్లో నటించారు చలపతిరావు. తనయుడు రవిబాబు దర్శకత్వం వహిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారాయన. అయితే అనుకోని విధంగా హఠాన్మరణం పొందారు. చలపతిరావు భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు తనయుడు రవిబాబు ఇంట్లోనే ఉంచారు. ఆ తర్వాత ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానానికి తరలించారు. అమెరికాలో ఉంటున్న చలపతిరావు ఇద్దరు కుమార్తెలు రాగానే బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. చలపతిరావు మరణవార్త తెలిసిన తర్వాత పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన స్వగృహానికి చేరుకుని నివాళులు అర్పించారు. చలపతిరావు భౌతిక కాయానికి నివాళులర్పించినవారిలో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, చిరంజీవి, వెంకటేశ్, గోపీచంద్, సురేష్‌బాబు తమ్మారెడ్డి భరద్వాజ తదితర ప్రముఖులు ఉన్నారు. సినీ పరిశ్రమ 'బాబాయ్' అంటూ ఆప్యాయంగా పిలుచుకునే చలపతిరావు ఇలా హఠాత్తుగా దూరం కావడం బాధాకరం అని పేర్కొన్నారు.


నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న చలపతిరావు ఆర్‌సీ క్రియేషన్స్ అనే బ్యానర్ స్థాపించి నిర్మాతగా మారారు. తొలి చిత్రంగా బాలకృష్ణతో 'కలియుగ కృష్ణుడు' నిర్మించారు. ఆ తర్వాత 'కడప రెడ్డమ్మ, జగన్నాటకం, పెళ్లంటే నూరేళ్ల పంట, ప్రెసిడెంట్‌గారి అల్లుడు, అర్ధరాత్రి హత్యలు, రక్తం చిందిన రాత్రి' వంటి చిత్రాలు నిర్మించారు.

చలపతిరావుకు 19 ఏళ్లకే ఇందుమతితో పెళ్లయింది. వీరిది ప్రేమ వివాహం. ఈ దంపతులకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. తన 28వ ఏట జరిగిన ఓ ప్రమాదంలో భార్య ఇందుమతిని కోల్పోయారు చలపతిరావు. ఆ తర్వాత ఆయన మళ్లీ పెళ్లి చేసుకోలేదు. ఇద్దరు కుమార్తెలు అమెరికాలో స్థిరపడగా, కుమారుడు రవిబాబు నటుడిగా, దర్శకుడిగా కొనసాగుతున్నారు.

మా నాన్న సంతోషంగా వెళ్లిపోయారు – రవిబాబు

శనివారం రాత్రి సుమారు 8.30 గంటలకు మా నాన్న కన్నుమూశారు. నిజ జీవితంలో సంతోషంగా ఉంటూ, అందర్నీ ఎలా నవ్వించారో అంతే సంతోషంగా వెళ్లిపోయారు. చికెన్ బిర్యానీ, చికెన్ కూర తిన్నాక ప్లేట్‌ని అలా చేతికి అందించి వెనక్కి వాలిపోయి సింపుల్‌గా, సంతోషంగా, ఎలాంటి నొప్పి లేకుండా కొన్ని క్షణాల్లో తుదిశ్వాస విడిచారు. నాన్నగారి అంత్యక్రియలు ఆదివారం చేద్దామనుకున్నాం.. కానీ, నా సిస్టర్స్ అమెరికాలో ఉన్నారు. వారు మంగళవారానికి హైదరాబాద్ చేరుకుంటారు. ఆరోజు అంత్యక్రియలు నిర్వహించకూడదంటున్నారు కాబట్టి బుధవారం నిర్వహిస్తాం. నాన్నగారికి ఇష్టమైనవి మూడు. ఎన్టీఆర్‌గారు, మంచి భోజనం, జోక్స్ చెప్పడం అంటే ఇష్టం. నేను తీస్తున్న ఓ సినిమాలో ఆయనకి మంచి పాత్ర రాశాం. ఐదు రోజుల క్రితమే ఆ షూటింగ్‌లో సంతోషంగా నటించారు. అదే ఆయన ఆఖరి సినిమా.

చలపతిరావు మృతిపట్ల ఎన్టీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన రవిబాబుకి వీడియో కాల్ చేసి, చలపతిరావు భౌతిక కాయాన్ని చూసి 'మీరు మరణించారనే వార్తని జీర్ణించుకోలేకపోతున్నాం.. లే బాబాయ్.. లే' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.



● నివాళులర్పిస్తున్న వెంకటేశ్, చిరంజీవితో రవిబాబు

ఆయనవన్నీ మంచి అలవాట్లే - చిరంజీవి

ఈ డిసెంబర్ ఆవేదనని కలిగించింది. కైకాల గారు దూరం అయ్యారు. వెంటనే చలపతిరావుగారిని కోల్పోవడం చాలా బాధాకరం. మద్రాసు (చెన్నై)లో ఉన్నప్పటి నుంచే ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది. చలపతిరావుగారితో ఎన్నో సినిమాల్లో కలిసి నటించాను. అందరూ సంతోషంగా ఉండాలని కోరుకునే మంచి వ్యక్తి ఆయన. అన్ని రకాల పాత్రలు చేసిన గొప్ప నటుడు. ఆయన వేసిన పాత్రలకు, వ్యక్తిగత అలవాట్లకు అస్సలు సంబంధం ఉండదు. ఆయనకు ఉన్న అలవాట్లన్నీ మంచివే. ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునే ఆయన ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకునేవారు. అలాంటిది అకస్మాత్తుగా ఇలా గుండెపోటుతో మృతిచెందడం బాధాకరం.

ఆయన సెట్లో ఉంటే ఎనర్జీయే - వెంకటేశ్

నా తొలి సినిమా నుంచి ఎన్నో సినిమాలకు చలపతిరావుగారితో కలిసి పని చేశాను.. మేమొక ఫ్యామిలీలా ఉండేవాళ్లం. ఆయన ఇంత అకస్మాత్తుగా వెళ్లిపోవడం చాలా బాధగా ఉంది. అయితే చాలా ప్రశాంతంగా పోవడం ఆయన అదృష్టం. అద్భుతమైన వ్యక్తిత్వం ఉన్నవారు. ప్రతి ఒక్కరితో చాలా సరదాగా ఉండేవారు. మనం హ్యాపీగా ఉండాలంటే ఆయనతో ఉండాలి.. సెట్‌లో ఆయన ఉంటే ఎంత రిలాక్స్‌గా ఉంటామో మాకందరికీ తెలుసు.. సెట్స్‌లో అందరికీ ఆయన మంచి ఎనర్జీ ఇచ్చేవారు. చిన్నా పెద్దా అని కాకుండా ప్రతి ఒక్కరూ ఆయన కంపెనీని బాగా ఎంజాయ్ చేసేవారు. అలాంటి మనిషి సడన్‌గా దూరమవడం చాలా బాధగా ఉంది.



● నిహాల్, అనుపమ


ఈ ఇయర్ సెకండాఫ్ నాకు బాగుంది

– అనుపమా పరమేశ్వరన్

'బటర్ ఫ్లై' సినిమాలో చేసిన గీత క్యారెక్టర్ నాకు సవాల్ అనిపించింది. ఈ పాత్ర చాలా ఎమోషనల్‌గా ఉంటుంది'' అని అనుపమా పరమేశ్వరన్ అన్నారు. ఘంటా సతీష్ బాబు దర్శకత్వంలో అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'బటర్ ఫ్లై'. భూమికా చావ్లా, రావు రమేష్, నిహాల్ కోధాటి కీలక పాత్రల్లో రవిప్రకాష్ బోడపాటి, ప్రసాద్ తిరువల్లూరి, ప్రదీప్ నల్లిమెల్లి నిర్మించారు. ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ నెల 29న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ద్వారా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ – ''ఈ ఇయర్ సెకండాఫ్ నాకు చాలా బాగుంది. నేను హీరోయిన్‌గా నటించిన 'కార్తికేయ 2, 18 పేజెస్' హిట్టయ్యాయి. ఇప్పుడు 'బటర్ ఫ్లై' రిలీజ్ అవుతోంది'' అన్నారు. ఘంటా సతీష్ బాబు, ప్రసాద్ తిరువళ్లూరి, నిహాల్, సంగీత దర్శకుడు అర్విజ్ తదితరులు మాట్లాడారు.


నువ్వుంటే చాలు...

సందీప్ కిషన్, దివ్యాంశా కౌశిక్ 'నువ్వుంటే చాలు...' అని ప్రేమ పాట పాడుకున్నారు. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'మైఖేల్' చిత్రంలోని పాట ఇది. సినిమాలోని ఈ తొలి పాటను ఈ 28న విడుదల చేయనున్నారు. ఆదివారం ఈ విషయాన్ని ప్రకటించి, పాటలోని ఓ పోస్టర్‌ని చిత్ర బృందం విడుదల చేసింది. రంజిత్ జయకొడి దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పితో కలిసి డిస్ట్రిబ్యూటర్ భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రానికి నారాయణ్ దాస్ కె. నారంగ్ సమర్పకులు. ''సందీప్ కిషన్‌కి తొలి పాన్ ఇండియా చిత్రం ఇది. ఈ సినిమా కోసం సందీప్ అద్భుతంగా మేకోవర్ అయ్యారు. సామ్ సీఎస్ మంచి పాటలు ఇచ్చారు. రొమాంటిక్ సాంగ్ 'నువ్వుంటే చాలు..'ని తెలుగు, తమిళ భాషల్లో ఈ 28న విడుదల చేయనున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని నిర్మాతలు తెలిపారు. డైరెక్టర్ గౌతమ్ మీనన్ విలన్‌గా నటించిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, వరలక్ష్మీ శరత్‌కుమార్, వరుణ్ సందేశ్ కీలక పాత్రలు చేశారు. ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కె. సాంబశివరావు.



● సందీప్ కిషన్, దివ్యాంశ

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు – టీజీ విశ్వప్రసాద్



''ధమాకా' కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్. రవితేజ ఎనర్జీని పూర్తిగా ఎక్స్‌ప్లోర్ చేస్తూ చేసిన మూవీ ఇది. సినిమాలోని ప్రతి ఎలిమెంట్‌ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రవితేజ, శ్రీలీల జంటగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ధమాకా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ – అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పై రూపొందిన ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహనిర్మాత. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ– ''త్రినాథ రావు, రచయిత ప్రసన్న కలిసి 'ధమాకా' కథ చెప్పారు. ఇది రవితేజగారికి బావుంటుందనుకున్నాం. గ్రాండ్‌గా నిర్మించాం. 'ధమాకా'కి గ్రాండ్‌గా ఓపెనింగ్స్ వచ్చాయి. బీ, సీ సెంటర్ల నుంచి వచ్చే స్పందనను మేం ఊహించాం. అయితే మల్టీప్లెక్స్ ఆడియన్స్ నుండి మేం ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన వస్తోంది. మా బ్యానర్ నుంచి ఇప్పటికే మూడు ప్రాజెక్ట్స్‌ని ఓటీటీలో విడుదల చేశాం. ప్రస్తుతం నాగశౌర్య – శ్రీనివాస్ అవసరాల 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి', గోపీచంద్-శ్రీవాస్ కాంబినేషన్‌లో 'రామబాణం', లావణ్య త్రిపాఠితో ఒక ప్రాజెక్ట్ ఉంది. కొన్ని పెద్ద చిత్రాలు కూడా ఉన్నాయి'' అన్నారు.

ఫుల్ కామెడీ

'సత్యం' రాజేష్ హీరోగా, రిహ, సునీత హీరోయిన్లుగా కొత్త సినిమా షురూ అయింది. మధుసూదన్ రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై, చిత్ర యూనిట్‌ని అభినందించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ– ''ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రమిది. మంచి కథా కథనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో రెగ్యులర్ షూటింగ్ చేస్తాం'' అన్నారు. సప్తగిరి, శ్రీనివాస్ రెడ్డి, మధునందన్, చమ్మక్ చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాల్ రెడ్డి, సంగీతం: భీమ్స్.



● క్లాప్ ఇస్తున్న గంగుల కమలాకర్



'పసిడి'కి పంచ్ దూరంలో...

జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ (50 కేజీలు) పసిడి పతకానికి విజయం దూరంలో నిలిచింది. భోపాల్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో నిఖత్ 5-0తో శివిందర్ కౌర్ (ఆలిండియా పోలీస్)పై ఘనవిజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో అనామిక (రైల్వేస్)తో నిఖత్ తలపడుతుంది. 75 కేజీల విభాగంలో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గోహైన్ (అస్సాం) కూడా ఫైనల్ చేరింది.

సిరీస్ విజయమే లక్ష్యంగా...



వరుసగా రెండో టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో నేటి నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా బరిలోకి దిగనుంది. బ్రిస్బేన్‌లో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా రెండు రోజుల్లోనే గెలిచింది. తొలి టెస్టులో ఆడిన జట్టునే 'బాక్సింగ్ డే' టెస్టులో కొనసాగిస్తున్నామని ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తెలిపాడు. ఈ మ్యాచ్‌తో డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా తరఫున 100వ టెస్టు ఆడనున్న 14వ క్రికెటర్‌గా గుర్తింపు పొందనున్నాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో భారత్

దుబాయ్: బంగ్లాదేశ్‌పై క్లీన్‌స్వీప్‌తో భారత్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో పడింది. ఈ జాబితాలో 99 పాయింట్లున్న టీమిండియా 58.93 శాతంతో రెండో స్థానంలోకి దూసుకొచ్చింది. ఆస్ట్రేలియా (120 పాయింట్లు) 76.92 శాతంతో అగ్రస్థానంలో ఉంది. కానీ భారత జట్టుకు దక్షిణాఫ్రికా రూపంలో ముప్పుంది. 72 పాయింట్లున్న దక్షిణాఫ్రికా 54.55 శాతంతో మూడో స్థానంలో ఉంది. ప్రస్తుతం ఆసీస్ పర్యటనలో ఉన్న దక్షిణాఫ్రికా రెండు టెస్టులు ఆడాల్సి ఉంది. దీంతో పాటు సొంతగడ్డపై వెస్టిండీస్‌తో రెండు టెస్టులు కూడా దక్షిణాఫ్రికాను ఫైనల్ రేసులోకి తేవొచ్చు. భారత్‌కు స్వదేశంలో ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్ మిగిలుంది. మొత్తానికి ఈ ఎనిమిది టెస్టులే డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేస్తాయి. టాప్ ర్యాంక్‌లో ఉన్న ఆస్ట్రేలియాకు ఏ ఢోకా లేకపోయినా... రెండో స్థానం కోసం భారత్‌కు దక్షిణాఫ్రికాతో పోటీ తప్పదు.

ఆశల పల్లకిలో...

నేటి నుంచి ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్



తానియా, హంపి, హారిక, వైశాలి (ఫైల్)

అల్మాటీ (కజకిస్తాన్): ఈ ఏడాదిని చిరస్మరణీయంగా ముగించాలనే లక్ష్యంతో నేటి నుంచి ఐదు రోజులపాటు జరిగే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు బరిలోకి దిగనున్నారు. మహిళల విభాగంలో 2019 ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్, 2012 కాంస్య పతక విజేత, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపితోపాటు ద్రోణవల్లి హారిక, వైశాలి, తానియా సచ్‌దేవ్, సవితా శ్రీ, పద్మిని రౌత్, దివ్యా దేశ్‌ముఖ్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మొదటి మూడు రోజులు ర్యాపిడ్ విభాగంలో, ఆ తర్వాత రెండు రోజులు బ్లిట్జ్ విభాగంలో పోటీలు జరుగుతాయి. ర్యాపిడ్ టోర్నీని 11 రౌండ్లపాటు, బ్లిట్జ్ టోర్నీని 17 రౌండ్లపాటు నిర్వహిస్తారు. ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ పెంటేల హరికృష్ణ, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, హర్ష భరతకోటిలతోపాటు విదిత్ సంతోష్ గుజరాతి, సూర్యశేఖర గంగూలీ, నిహాల్ సరీన్, ఎస్ఎల్ నారాయణన్, అరవింద్ చిదంబరం, అభిమన్యు పురాణిక్, ఆధిబన్, రౌనక్ సాధ్వాని, శ్రీనాథ్ నారాయణన్, వి.ప్రణవ్, అర్జున్ కల్యాణ్, సంకల్ప్ గుప్తా భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓపెన్ ర్యాపిడ్ టోర్నీని 13 రౌండ్లు, బ్లిట్జ్ టోర్నీని 21 రౌండ్లు నిర్వహిస్తారు. మహిళల ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలలో టాప్-3లో నిలిచిన వారికి వరుసగా 40 వేల డాలర్లు (రూ. 33 లక్షల 11 వేలు), 30 వేల డాలర్లు (రూ. 28 లక్షల 83 వేలు), 20 వేల డాలర్లు (రూ. 16 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీగా ఇస్తారు. ఓపెన్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలలో టాప్-3లో నిలిచిన వారికి వరుసగా 60 వేల డాలర్లు (రూ. 49 లక్షల 67 వేలు), 50 వేల డాలర్లు (రూ. 41 లక్షల 39 వేలు), 40 వేల డాలర్లు (రూ. 33 లక్షల 11 వేలు) ప్రైజ్ మనీగా అందజేస్తారు.

భారత ఆర్చర్ల పసిడి పంట



మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో క్లీన్‌స్వీప్ చేసిన భారత ఆర్చర్లు అదితి, ప్రగతి, పర్ణీత్

షార్జా: ఆసియా కప్ స్టేజ్-3 ఆర్చరీ టోర్నమెంట్‌లో భారత ఆర్చర్లు అదరగొట్టే ప్రదర్శన చేశారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్‌కు మొత్తం తొమ్మిది పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్య పతకం ఉన్నాయి. కాంపౌండ్ విభాగంలో భారత్‌కు ఏకంగా ఏడు పతకాలు దక్కాయి. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత అమ్మాయిలు క్లీన్‌స్వీప్ చేశారు. ప్రగతి స్వర్ణం నెగ్గగా... అదితి స్వామి రజతం, పర్ణీత్ కౌర్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రియాంశ్ స్వర్ణం, ఓజస్ రజతం నెగ్గారు. కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు పసిడి పతకాలు దక్కించుకున్నాయి. ఆకాశ్, మృణాల్ చౌహాన్, పార్థ్ సాలుంకేలతో కూడిన భారత రికర్వ్ పురుషుల జట్టు టీమ్ విభాగంలో బంగారు పతకం గెలుచుకుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో త్రిషా పూనియా, పార్థ్ సాలుంకేలతో కూడిన టీమిండియా రజతం నెగ్గింది.

అశ్విన్, అయ్యర్ అసాధారణ పోరాటం

ఎనిమిదో వికెట్‌కు 71 పరుగుల అజేయ భాగస్వామ్యం

రెండో టెస్టులోనూ భారత్ గెలుపు ● బంగ్లాదేశ్‌పై 2-0తో క్లీన్‌స్వీప్



అశ్విన్
అయ్యర్

భారత్ లక్ష్యం 145... ఓవర్‌నైట్ స్కోరు 45/4... ఇంకా 100 పరుగుల గెలుపు దారిలో చేతిలో 6 వికెట్లున్న జట్టుకు లక్ష్యఛేదన ఏమంత కష్టం కాదు... కానీ అదే జట్టు 74/7 స్కోరు వద్ద కష్టాల్లో పడితే మాత్రం గెలుపు అసాధ్యం. ఇలాంటి పరిస్థితుల్లో మ్యాచ్ బంగ్లాదేశ్‌దే అవుతుంది. సిరీస్ 1-1తో సమం అవుతుంది. కానీ శ్రేయస్ అయ్యర్, అశ్విన్ అసాధారణ పోరాటంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఓడిపోవాల్సిన మ్యాచ్‌ను, పంచుకోవాల్సిన సిరీస్‌ను అభేద్యమైన భాగస్వామ్యంతో భారత్ వశం చేశారు.

మిర్పూర్: ఇది కదా ఆటంటే! ఇదే కదా టెస్టులకు కావాల్సింది. సంప్రదాయ ఫార్మాట్‌కు ఊపిరిపోసేలా 'సై అంటే సై' అన్నట్లు సాగింది. బంగ్లాదేశ్ స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్ (5/63) వికెట్ల వేటలో ముందున్నాడు. చిన్నదే అయినా లక్ష్యఛేదనలో భారత్ వెనుకబడింది. ఇంకా చెప్పాలంటే ఓ దశలో ఓటమికి టీమిండియా దగ్గరైంది. మిరాజ్ వన్డే సిరీస్‌లో ఎలా చెలరేగాడో (బ్యాటింగ్‌లో) కళ్లముందు మెదులుతోంది. ఈసారి బంతితో టెస్టు రాతను మార్చేపనిలో పడ్డాడు. కానీ ఇద్దరు కలిసి ఆ ఒక్కడి వేటను అడ్డుకున్నారు. శ్రేయస్ అయ్యర్ (46 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు), అశ్విన్ (62 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్)ల పోరాటం ... ఇరు జట్లను దోబూచులాడిన విజయాన్ని చివరకు భారత్‌వైపు మళ్లించింది. ఇద్దరు కలిసికట్టుగా... గెలిచేదాకా మెహిదీ హసన్ స్పిన్‌కు ఎదురొడ్డారు. దీంతో చివరిదైన రెండో టెస్టులో భారత్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అశ్విన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', పుజారాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

మిరాజ్ స్పిన్ ఉచ్చులో...

నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 45/4 వద్ద మొదలైన భారత్ రెండో ఇన్నింగ్స్‌ను బంగ్లా శిబిరం అష్టకష్టాల పాలుజేసింది. తొలి అర్ధగంటలో అయితే పదే పదే అప్పీళ్లతో మన బ్యాటర్లను బెంబేలెత్తించిన ఆతిథ్య జట్టు రెండు రివ్యూలు తీసుకొని ఆ జోస్ పెంచింది. ఆపై స్పిన్ ఉచ్చులో పడేసి 3 వికెట్లను కూడా పడేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు అక్షర్ పటేల్ (88 బంతుల్లో 34; 4 ఫోర్లు), జైదేవ్ ఉనాద్కట్ (13; 1 సిక్స్)లతో పాటు ఆదుకుంటాడనుకొని గంపెడాశలు పెట్టుకున్న రిషభ్ పంత్ (9; 1 ఫోర్)ను ఆరంభంలోనే అవుట్ చేశారు. ఈ ముగ్గురిలో ఉనాద్కట్‌ను షకీబ్ పెవిలియన్ చేర్చగా, మిగతా రెండు వికెట్లు మెహిదీ హసన్ మిరాజ్ ఖాతాలోకే వెళ్లాయి. అప్పుడు భారత్ స్కోరు 74/7. ఆట మొదలైన 6.3 ఓవర్లలోనే ఇదంతా జరిగింది. ఇక మిగిలిన వికెట్లు 3 అయితే... స్పెషలిస్ట్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఒక్కడే! మిగతా వారు టెయిలెండర్లు! ఇలాంటి దశలో ఇంకా 71 పరుగులు భారత్‌ను ఓటమి ముంగిట నిలబెట్టాయి. బంగ్లా విజయం ఖాయం అనుకోగా... అశ్విన్, అయ్యర్ ఏకంగా 17.3 ఓవర్లు అసాధారణ పోరాటం చేశారు. అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 71 పరుగులు జోడించి బంగ్లా చేతుల దాకా వచ్చిన విజయాన్ని తమ చేతలతో లాక్కున్నారు. ఆదివారం ఉదయం స్పిన్‌కు దాసోహమైన పిచ్‌పై అయ్యర్-అశ్విన్ బ్యాటింగ్ అద్భుతంగా సాగింది. వికెట్లకు నేరుగా టర్న్ అవుతున్న బంతుల్ని అశ్విన్ చక్కగా కాచుకొని బ్యాటింగ్ చేశాడు. మెహిదీ వేసిన 47వ ఓవర్లో సిక్స్, రెండు బౌండరీలతో అశ్విన్ మ్యాచ్ ముగించిన తీరు కూడా చూడ ముచ్చటగా ఉంటుంది.



పుజారా

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 227; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 314;**బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** 231; **భారత్ రెండో ఇన్నింగ్స్:** గిల్ (స్టంప్డ్) నూరుల్ (బి) మెహిదీ హసన్ 7; కేఎల్ రాహుల్ (సి) నూరుల్ (బి) షకీబ్ 2; పుజారా (స్టంప్డ్) నూరుల్ (బి) మెహిదీ హసన్ 6; అక్షర్ పటేల్ (బి) మెహిదీ హసన్ 34; కోహ్లి (సి) మోమినుల్ (బి) మెహిదీ హసన్ 1; ఉనాద్కట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షకీబ్ 13; పంత్ (ఎల్బీడబ్ల్యూ) మెహిదీ హసన్ 9; అయ్యర్ (నాటౌట్) 29; అశ్విన్ (నాటౌట్) 42; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (47 ఓవర్లలో 7 వికెట్లకు) 145. వికెట్ల పతనం: 1-3, 2-12, 3-29, 4-37, 5-56, 6-71, 7-74. బౌలింగ్: షకీబ్ 14-0-50-2, తైజుల్ ఇస్లాం 11-4-14-0, మెహిదీ హసన్ 19-4-63-5, తస్కిన్ అహ్మద్ 1-0-4-0, ఖాలిద్ అహ్మద్ 2-0-12-0.

71 అశ్విన్, అయ్యర్ నమోదు చేసిన 71 పరుగుల భాగస్వామ్యం టెస్టు క్రికెట్‌లో ఛేజింగ్‌లో ఎనిమిదో వికెట్‌కు అత్యుత్తమం. గతంలో ఈ రికార్డు ఇంజమామ్ ఉల్ హఖ్-రషీద్ లతీఫ్ (పాకిస్తాన్; 52 పరుగులు-1994లో ఆస్ట్రేలియా) జోడీ పేరిట ఉంది.

42 విజయవంతమైన ఛేజింగ్‌లో తొమ్మిది లేదా పదో నంబర్ స్థానంలో వచ్చి అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా అశ్విన్ నిలిచాడు. గతంలో ఈ రికార్డు పదో స్థానంలో వచ్చిన విన్‌స్టన్ బెంజమిన్ (వెస్టిండీస్: 40 నాటౌట్; 1988లో పాకిస్తాన్‌పై) పేరిట ఉంది.

3 క్రిస్మస్ పర్వదినాన టెస్టులో విజయం సాధించిన మూడో జట్టుగా భారత్ నిలిచింది. గతంలో వెస్టిండీస్ (అడిలైడ్‌లో ఆస్ట్రేలియాపై 1971లో), ఇంగ్లండ్ (ఢిల్లీలో భారత్‌పై 1972లో) ఈ ఘనత సాధించాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ డిఫెన్స్‌సర్వీసెస్ ఎగ్జామినేషన్(1)2023

యూపీఎస్సీ నిర్వహిస్తున్న కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ) ద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో ఉద్యోగాలు సాధించొచ్చు. డిగ్రీ పూర్తిచేసుకున్న అవివాహిత పురుషులు, మహిళలు ఈ పరీక్షకు అర్హులు. »**మొత్తం ఖాళీల సంఖ్య:** 341

» **విభాగాల వారీగా ఖాళీలు:** ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ),డెహ్రాడూన్-100,ఇండియన్ నావల్ అకాడమీ(ఐఎన్ఏ), ఎజిమల-22, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(ఏఎఫ్ఏ), హైదరాబాద్-32, ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ మెన్ నాన్ టెక్నికల్-170, ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ ఉమెన్ నాన్ టెక్నికల్-17.

» **అర్హత:** మిలిటరీ అకాడమి, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమి పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నేషనల్ అకాడమి ఉద్యోగాలకు ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండాలి. ఓటీఏ ఎస్ఎస్‌సీ నాన్ టెక్నికల్ పోస్టులకు మాత్రమే మహిళలు అర్హులు. చివరి సంవత్సరం పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **వయసు:** ఇండియన్ మిలిటరీ అకాడమి, నావల్ అకాడమిలకు 02.01.2000 కంటే ముందు, 01.01.2005 తర్వాత జన్మించినవారు అనర్హులు. ఎయిర్‌ఫోర్స్ అకాడమి పోస్టులకు 02.01.2000 కంటే ముందు, 01.01.2004తర్వాత జన్మించిన వారు అనర్హులు. కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి గరిష్ఠ వయసులో రెండేళ్ల సడలింపు వర్తిస్తుంది. ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమి పోస్టులకు 02.01.1999 కంటే ముందు, 01.01.2005 తర్వాత జన్మించినవారు అనర్హులు.

» **ఎంపిక విధానం:** రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఫర్ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **పరీక్ష విధానం:** ఒక్కో పేపర్‌కు 100 మార్కుల చొప్పున మొత్తం 300 మార్కులకు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమేటిక్స్ విభాగాల్లో ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు వ్యవధి 2 గంటలు. ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమి(ఓటీఏ) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు మ్యాథ్స్ పేపర్ రాయనవసరం లేదు.

» **ఇంటర్వ్యూ:** ఈ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ కీలకం. పరీక్షతో సమానంగా ఈ విభాగానికి 300 మార్కులు కేటాయించారు. ఓటీఏ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి ఇది 200 మార్కులకు ఉంటుంది.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.01.2023

» **పరీక్ష తేది:** 16.04.2023.

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం.»**వెబ్‌సైట్:**http://upsc.gov.in

యూపీఎస్సీ-ఎన్‌డీఏ-ఎన్ఏ పరీక్ష(1)-2023

యూపీఎస్సీ.. నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నావల్ అకాడమి(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) 2023 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా త్రివిధ దళాల విభాగాల్లో 151వ కోర్సులో, 113వ ఇండియన్ నేవల్ అకాడమి(ఐఎన్ఏసీ)కోర్సులో ప్రవేశాలు పొందవచ్చు.అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 395. నేషనల్ డిఫెన్స్ అకాడమీ-370(ఆర్మీ-208,నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-120)ఉన్నాయి.వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నావల్ అకాడమి(10+2క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)ఖాళీలు 25 ఉన్నాయి.

» **కోర్సులు:** నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నావల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ, నేవీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

» **అర్హత:** ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపులో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్‌ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నావల్ అకాడమి) ద్వారా దరఖాస్తు చేయాలనుకుంటే.. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీనితోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ఎన్ఏ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)కోర్సులకు కేవలం పురుషులు మాత్రమే అర్హులు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారు అర్హులే.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **శిక్షణ:** తుది అర్హత సాధించిన అభ్యర్థులకు ఎంపికైన విభాగాన్ని బట్టి ఈ శిక్షణ ఏడాది నుంచి 18 నెలల వరకు ఉంటుంది. కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ప్రారంభ స్థాయి ఆఫీసర్ ఉద్యోగాలైన లెఫ్టినెంట్, సబ్-లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్/గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాతో కెరియర్ ప్రారంభం అవుతుంది.

» **దరఖాస్తులకు చివరి తేది:** 10.01.2023.

» **ఆన్‌లైన్ రాతపరీక్ష:** 16.04.2021

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

» **వెబ్‌సైట్:** upsconline.nic.in

జేఈఈ మెయిన్.. మార్పులివే!!

» జనవరి 24-31 వరకు తొలి సెషన్
» ఏప్రిల్ 6-12 మధ్య రెండో సెషన్ పరీక్షలు
» అర్హతలు, దరఖాస్తు విధానంలో మార్పులు
» ఇంటర్‌లో 75 శాతం మార్కులు తప్పనిసరి

జేఈఈ-మెయిన్..ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని.. ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఐఐటీల్లో ప్రవేశానికి జరిపే అడ్వాన్స్‌డ్‌కు కూడా జేఈఈ-మెయిన్‌లో అర్హత తప్పనిసరి! ఇంతటి కీలకమైన జేఈఈ-మెయిన్ -2023కు నిర్వాహక సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నోటిఫికేషన్ విడుదల చేసింది. జనవరి, ఏప్రిల్ నెలల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. జేఈఈ మెయిన్-2023 ముఖ్య సమాచారం, కీలక మార్పులు, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

జేఈఈ-మెయిన్ తొలి సెషన్‌ను జనవరి నాలుగో వారంలో, రెండో సెషన్‌ను ఏప్రిల్ మొదటి, రెండు వారాల్లో నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. జనవరి, ఏప్రిల్‌లలో రెండు సెషన్లుగా.. జేఈఈ-మెయిన్ నిర్వహించనున్నట్లు తెలిపింది. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా పరీక్ష జరుగనుంది. తొలి సెషన్‌కు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

అర్హతలు: ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్ ఉత్తీర్ణత ఉండాలి. 2021, 2022లో ఇంటర్ ఎంపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు; 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు.

75 శాతం మార్కులు తప్పనిసరి

జేఈఈ-మెయిన్-2023 నిబంధనల్లో కీలక మార్పు..ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన. వాస్తవానికి జేఈఈ-మెయిన్‌కు హాజరయ్యేందుకు ఇంటర్మీడియెట్ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని మాత్రమే పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఎలాంటి ఉత్తీర్ణత శాతం నిబంధనలను పేర్కొనలేదు. కాని జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఇతర ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశాలకు మాత్రం సదరు ఇన్‌స్టిట్యూట్‌ల నిబంధనల మేరకు ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు తప్పనిసరి అని పేర్కొన్నారు. అంటే.. ఒక విధంగా..జేఈఈ -మెయిన్ దరఖాస్తు సమయంలోనే ఇంటర్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారే అర్హులుగా నిర్దేశించారని పేర్కొనచ్చు.

ఛాయిస్ విధానం కొనసాగింపు

జేఈఈ-మెయిన్-2023 విషయంలో అభ్యర్థులకు ఊరటనిచ్చే అంశం.. ఛాయిస్ విధానాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు పేర్కొనడం. పేపర్-1, పేపర్-2ఎ, పేపర్-2బి పేర్లతో నిర్వహించే పరీక్షలో.. 2021లో తొలిసారిగా ఛాయిస్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. అప్పటికి కోవిడ్ పరిస్థితులు, పలు బోర్డులు సిలబస్ కుదించి ఇంటర్, తత్సమాన పరీక్షలు నిర్వహించడంతో.. ఛాయిస్ విధానాన్ని ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. 2023 సెషన్స్‌లో కూడా ఈ విధానాన్ని కొనసాగించడం విశేషం.

పరీక్ష, ఛాయిస్ స్వరూపం

పేపర్-1(బీటెక్, బీఈ) ఇలా

బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈ పేపర్‌ను మొత్తం మూడు సబ్జెక్ట్‌లలో రెండు సెక్షన్లుగా నిర్వహిస్తారు. వివరాలు..

సబ్జెక్ట్	సెక్షన్-ఎ ప్రశ్నల సంఖ్య	సెక్షన్-బి ప్రశ్నల సంఖ్య	మార్కులు
మ్యాథమెటిక్స్	20	10	100
ఫిజిక్స్	20	10	100
కెమిస్ట్రీ	20	10	100
మొత్తం	90 ప్రశ్నలు		300 మార్కులు

- సెక్షన్-ఎ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో(ఎంసీక్యూలతో) ఉంటుంది.
- సెక్షన్-బిలో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలుంటాయి.సెక్షన్-బిలో 10 ప్రశ్నల్లో అయిదు ప్రశ్నలకు సమాధానం ఇస్తే సరిపోతుంది. 0.25 శాతం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

పేపర్-2ఎ బీఆర్క్ పరీక్ష

నిట్‌లు,ట్రిపుల్ ఐటీలు,ఇతర ఇన్‌స్టిట్యూట్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు రాయాల్సిన పరీక్ష ఇది. పేపర్-2ఎగా పిలిచే ఈ పరీక్షను కూడా మూడు విభాగాలుగా నిర్వహిస్తారు.

సబ్జెక్ట్	ఎంసీక్యూ ప్రశ్నల సంఖ్య	న్యూమరికల్ వాల్యూ ప్రశ్నల సంఖ్య	మార్కులు
మ్యాథమెటిక్స్	20	10	100
ఆప్టిట్యూడ్ టెస్ట్	50	-	200
డ్రాయింగ్ టెస్ట్	02	-	100
మొత్తం ప్రశ్నలు	82 ప్రశ్నలు		400 మార్కులు

- మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ విభాగంలో ఎంసీక్యూల్లో ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. అదే విభాగంలో న్యూమరికల్ ప్రశ్నలలో పది ప్రశ్నలకు గాను అయిదు ప్రశ్నలు ఛాయిస్‌గా ఉంటాయి. ■ డ్రాయింగ్ టెస్ట్‌లో మాత్రం రెండు అంశాలను ఇచ్చి డ్రాయింగ్ వేయమంటారు. ఒక్కో టాపిక్‌కు 50 మార్కులు.

పేపర్-2బి బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ పరీక్ష

బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పేపర్-2బి మూడు విభాగాలుగా ఉంటుంది. వివరాలు..

సబ్జెక్ట్	ప్రశ్నల సంఖ్య	న్యూమరికల్ ప్రశ్నల	మార్కులు
మ్యాథమెటిక్స్	20	10	100
ఆప్టిట్యూడ్ టెస్ట్	50	-	200
ప్లానింగ్	25	-	100
మొత్తం ప్రశ్నలు	105 ప్రశ్నలు		400 మార్కులు

- మ్యాథమెటిక్స్‌లోని న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నల్లో అయిదు ప్రశ్నలు ఛాయిస్‌గా ఉంటాయి. మూడు పరీక్షలకు కేటాయించిన సమయం మూడు గంటలు. ■ బీఆర్క్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ రెండు పేపర్లకు మూడున్నర గంటలు పరీక్ష సమయం ఉంటుంది.

మెయిన్‌లో మెరిసేందుకు వ్యూహాలివే

జేఈఈ-మెయిన్-2023 మొదటి సెషన్, రెండో సెషన్ తేదీలను సైతం ప్రకటించారు. జనవరిలో నిర్వహించే తొలి సెషన్‌కు నెల రోజులు, ఏప్రిల్‌లో నిర్వహించే రెండో సెషన్‌కు మూడున్నర నెలల సమయం అందుబాటులో ఉంది.

మ్యాథమెటిక్స్: ఈ సబ్జెక్ట్‌లో విద్యార్థులు ప్రతి చాప్టర్‌పైనా అవగాహన పెంచుకోవాలి. 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్; బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.

ఫిజిక్స్: ఫిజిక్స్ థియరీతోపాటు న్యూమరికల్ అప్రోచ్ కలిగిన సబ్జెక్ట్‌గా చెప్పొచ్చు. ఇందులో రాణించాలంటే.. ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. వీటితోపాటు సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన ఏర్పరచుకుంటే.. మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

కెమిస్ట్రీ: మిగతా రెండు సబ్జెక్ట్‌లతో పోల్చితే విద్యార్థులు కాసింత సులభంగా భావించే సబ్జెక్ట్ ఇది. ఈ సబ్జెక్ట్‌లోనూ న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి విద్యార్థులు కొన్ని ముఖ్య టాపిక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలపై నైపుణ్యాలను పెంచుకోవాలి. మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.



ఇంటర్‌తో అనుసంధానం

జేఈఈ-మెయిన్-2023 తొలి దశకు హాజరవ్వాలనుకునే విద్యార్థులు.. ఇంటర్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఇప్పటికే అభ్యర్థులు సిలబస్‌ను పూర్తి చేసుకుని ఉంటారు. దాని ఆధారంగా జనవరి సెషన్‌కు సన్నద్ధం కావాలి. ఏప్రిల్‌లో నిర్వహించే రెండో సెషన్‌కు జనవరి చివరి వరకు ప్రిపరేషన్ సాగించాలి. ఆ తర్వాత బోర్డ్ పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలపై దృష్టి పెట్టాలి. మార్చిలో బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత మళ్లీ మెయిన్ రెండో సెషన్ ప్రిపరేషన్‌కు పూర్తి సమయం కేటాయించాలి. ఈ సమయంలో అధిక శాతం పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

అడ్వాన్స్‌డ్‌తో అనుసంధానం

అభ్యర్థులు జేఈఈ-అడ్వాన్స్‌డ్‌తోనూ తమ ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకోవాలి. జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023,జూన్ 4వ తేదీన నిర్వహించనున్నారు. ఈ ఏడాది జేఈఈ-అడ్వాన్స్‌డ్ సిలబస్‌లోనూ మార్పులు చేశారు. ఇవి మెయిన్ సిలబస్ అంశాలకు కొనసాగింపుగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాబట్టి విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను పరిశీలించి మెయిన్, అడ్వాన్స్‌డ్ రెండిటిలోనూ కామన్‌గా ఉన్న అంశాలను ఒకే సమయంలో ప్రిపేరవ్వాలి.

జేఈఈ-మెయిన్-2023 సమాచారం

తొలి సెషన్ (2023 జనవరి) ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2023,జనవరి 12
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** జనవరి మూడో వారంలో
- **జేఈఈ-మెయిన్ పరీక్ష తేదీలు:** 2023 జనవరి 24, 25, 27, 28, 29, 30, 31

రెండో సెషన్ (2023 ఏప్రిల్) ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2023 ఫిబ్రవరి 23-2023 మార్చి 7 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** మార్చి చివరి వారంలో
- **రెండో సెషన్ పరీక్ష తేదీలు:** 2023 ఏప్రిల్ 6 నుంచి 12 వరకు
- **వెబ్‌సైట్:** jeemain.nta.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	981	59,845
నిఫ్టీ ▽	321	17,807

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు			
నాస్‌డాక్	10,498	△	22
డోజోన్స్	33,204	△	176
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,473	△	4
డాక్స్	13,941	△	27
షాంఘై	3,046	▽	9
నికాయ్	26,235	▽	273

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.87	83.58
£	యూరో	ఎస్‌బీఐ	85.64	89.93
€	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.02	101.69
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.09	63.58
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.45	57.00
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.50	62.45
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.11	22.65
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.46	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.94	12.57

ఈ-రూపీ.. సంగతేంటి?



డిజిటల్ రూపంలో కరెన్సీ • మొబైల్ వ్యాలెట్లలో స్టోర్ • భద్రత పాళ్లు ఎక్కువ • యూపీఐకి బదులు కాదు • భౌతిక కరెన్సీ వినియోగానికి ప్రత్యామ్నాయం

రఘురామ్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వెళ్లాల్సి ఉంది. రైలు వెళ్లిపోతుందన్న హడావుడితో కంగారుగా వచ్చి సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలు ఎక్కేశాడు. పండుగ రోజులు కావడంతో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. అయినా కానీ ఏదో విధంగా తోసుకుంటూ రైలెక్కి కూర్చున్నాడు. జేబులో చేయి పెట్టి చూడగా, పర్స్ కనిపించలేదు. ఒక్కసారిగా ముఖం మాడిపోయింది. పర్స్‌లో కార్డులతోపాటు డ్రా చేసిన రూ.5,000 నగదు కూడా ఉంది. ఒకవేళ నోట్ల రూపంలో కాకుండా, మొబైల్ వ్యాలెట్‌లో ఈ కరెన్సీ ఉంటే..? ఇలా జరిగేది కాదు కదా..! భౌతిక కరెన్సీకి ప్రత్యామ్నాయంగా వచ్చిందే సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ/ఈ-రూపీ). దీనిపై కొందరిలో అస్పష్టత నెలకొంది. దీని పనితీరు, చెల్లింపులు చేయడం ఎలా, ఇది ఉంటే యూపీఐ అవసరం లేదా? ఇలా ఎన్నెన్నో సందేహాలు. వీటికి స్పష్టత తీసుకొచ్చే ప్రయత్నమే ఈ కథనం.

ఈ-రూపీ అంటే.. కరెన్సీ నోటుకు డిజిటల్ రూపమే ఇది. అందుకే సెంట్రల్ బ్యాంకు డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ)గా దీనికి పేరు. ముద్రించిన కరెన్సీ నోట్లను ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థలోకి విడుదల చేస్తుంటుంది. అచ్చం అదే మాదిరి ఇక మీదట డిజిటల్ కరెన్సీని సైతం విడుదల చేయనుంది. లిక్విడిటీ చర్యల్లో భాగంగా భౌతిక, డిజిటల్ రూపీ మధ్య సమన్వయం ఉంటుంది. కరెన్సీ ఏ రూపంలో ఉన్నా ఆర్‌బీఐ బ్యాలన్స్ షీట్‌లో ఈ మేరకు లయబిలిటీని చూపిస్తారు. ఈ డిజిటల్ కరెన్సీ మొబైల్ ఫోన్ వ్యాలెట్లలోనే ఉంటుంది. కరెన్సీ నోట్ మాదిరే దీనికి సైతం చట్టబద్ధ హోదా ఉంటుంది. డిజిటల్ కరెన్సీని కోరుకున్నంత కాలం ఈ-రూపీల్లో రూపంలో ఉంచుకోవచ్చు. భౌతిక కరెన్సీకి వర్తించే అన్ని రకాల నిబంధనలు డిజిటల్ కరెన్సీకి సైతం అమలవుతాయి. కేవలం రూపంలోనే వ్యత్యాసం. కనుక దీన్ని పౌరులు అందరూ భవిష్యత్తులో కరెన్సీ మాదిరిగా మార్పిడి చేసుకోవచ్చు.

వినియోగం ఎలా..?

బ్యాంక్ ఖాతాలో బ్యాలన్స్ ఉంటే, అందులో నుంచి కోరుకున్న మేర డిజిటల్ రూపాయిలుగా మార్చుకోవచ్చు. ఇందుకోసం ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ అవసరం. ప్రస్తుతానికి ఈ-రూపీ రిటైల్ (వ్యక్తులు) ప్రాజెక్ట్‌ను ఆర్‌బీఐ ప్రయోగాత్మకంగా అమలు చేసి, చూస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యస్ బ్యాంక్ బ్యాంకులు డిజిటల్ రూపీ వ్యాలెట్లను అందిస్తున్నాయి. ఐవోఎస్ ఆధారిత యాప్‌ను ఇంకా అభివృద్ధి చేయలేదు. ఈ బ్యాంక్‌లకు సంబంధించిన కస్టమర్లు, ఆండ్రాయిడ్ ఫోన్ వాడుతున్నట్టు అయితే, వారి ఫోన్‌కు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ రూపంలో లింక్ వస్తుంది. ఆసక్తి ఉన్న వారు లింక్‌ను తెరిచి ఈ-రూపీ వ్యాలెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బ్యాంక్‌లో రిజిస్టర్ అయి ఉన్న ఫోన్ నంబర్‌ను వినియోగించాలి.

డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రాగా.. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, భువనేశ్వర్‌లో కొద్ది మంది వినియోగానికే (క్లోజ్డ్ యూజర్ గ్రూప్) రిటైల్ సీబీడీసీ (ఈ-రూపీ)ని పరిమితం చేశారు. పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గుర్తించిన సమస్యలను పరిష్కరించిన తర్వాతే పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఈ-రూపీ లావాదేవీలు పూర్తయ్యే బాధ్యతను ఆర్‌బీఐతో కలసి నేష

కొద్ది మందికే..



నల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) చూస్తోంది. లావాదేవీలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఏర్పడితే ఎన్‌పీసీఐ పరిష్కరిస్తుంది. మొబైల్ బ్యాంకింగ్‌ను తరచూ వినియోగించే కస్టమర్లు, డిజిటల్ చెల్లింపులు ఎక్కువగా చేస్తున్న వారి నుంచి కొందరిని ప్రయోగాత్మక పరీక్షల కోసం బ్యాంక్‌లు ఎంపిక చేసుకున్నాయి. అలా ఎంపిక చేసిన వారి ఫోన్లకు ఈ రూపీ వ్యాలెట్ లింక్‌ను పంపిస్తాయి. ఒకవేళ బ్యాంక్ నుంచి ఎటువంటి సందేశం కానీ, యూఆర్ఎల్ లింక్ కానీ రాని వారు, ఈ రూపీ వ్యాలెట్ పట్ల ఆసక్తిగా ఉంటే, బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించొచ్చు. అభ్యర్థనను ఆమోదించే లేదా తిరస్కరించే విచక్షణ వారిపై ఉంటుంది.

ఎలా పనిచేస్తుంది..?



ఈ-రూపీ వ్యాలెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారు, తమ బ్యాంకు ఖాతా నుంచి నగదును వ్యాలెట్‌కు బదిలీ చేసుకోవాలి. ఏ డినామినేషన్‌లో ఎన్ని కావాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ కస్టమర్‌కే ఉంటుంది. అంటే రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయిలు, రూ.10, 20, 50, 100, 200, 500 డినామినేషన్‌లలో కస్టమర్ తన ఇష్టం మేరకు వ్యాలెట్‌లో లోడ్ చేసుకోవచ్చు. ఉదాహరణకు మీరు బ్యాంక్ ఖాతా నుంచి రూ.5,000 బదిలీ చేసుకున్నారని అనుకుందాం. అప్పుడు రూ.500 డినామినేషన్‌లో 5 ఈ-రూపీలు, రూ.200 డినామినేషన్‌లో 5 ఈ-రూపీలు, రూ.100 డినామినేషన్‌లో 10 ఈ-రూపీలు, రూ.50 డినామినేషన్‌లో 8 ఈ-రూపీలు, మిగిలిన రూ.100 విలువకు రూ.20, 10, 5, 1 ఇలా ఎంపిక చేసుకోవచ్చు. ఇలా అనేమీ కాదు. కస్టమర్ కావాలనుకుంటే రూ.50 డినామినేషన్‌లో 100 ఈ-రూపీలను కూడా తీసుకోవచ్చు. లేదంటే రూపాయి డినామినేషన్‌లో 5,000 ఈ-రూపీలను తీసుకోవచ్చు. భౌతిక కరెన్సీ మాదిరే ఇవి పనిచేస్తాయి. మన పర్స్‌లో నోట్లు ఉన్న మాదిరే, వ్యాలెట్‌లో ఈ-రూపీలు ఉంటాయి. భౌతికంగా వినియోగంలో ఉన్న అన్ని రకాల డినామినేషన్‌కు సమానమైన ఈ-రూపీలు వ్యాలెట్‌లో అందుబాటులో ఉంటాయి.

వెంటనే బదిలీ..

వ్యక్తి నుంచి వ్యక్తికి, వ్యక్తి నుంచి వ్యాపారికి మధ్య ఈ-రూపీ చెల్లింపులు చేసుకోవచ్చు. వ్యక్తుల మధ్య సీబీడీసీలను బదిలీ చేసుకోవాలంటే, అవతలి వ్యక్తికి సైతం ఈ-రూపీ వ్యాలెట్ ఉండడం తప్పనిసరి. అదే వర్తకులకు ఈ-రూపీలను చెల్లించాలనుకుంటే క్యూఆర్ కోడ్ స్కాన్ విధానంలో చేయవచ్చు. ఇది అచ్చం యూపీఐ చెల్లింపుల మాదిరే పనిచేస్తుంది. ప్రస్తుతం యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసేంత సులభంగానే.. ఈ-రూపీ చెల్లింపులు కూడా ఉంటాయి. యూపీఐ మాదిరే అప్పటికప్పుడే ఈ-రూపీ బదిలీ అవుతుంది. క్షణాల్లోనే అవతలి వ్యక్తి వ్యాలెట్‌కు మీరు పంపిన ఈ-రూపీ చేరిపోతుంది.



అనుకూలతలు/ప్రతికూలతలు

కరెన్సీ నోట్లు అయితే నకిలీలను ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంటుంది. డిజిటల్ కరెన్సీకి ఆ బెడద ఉండదు. మొబైల్ ఫోన్ పోయినా దుర్వినియోగం బెడద ఉండదు. బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేసి, వ్యాలెట్‌లోని నగదును బదిలీ చేసుకోవచ్చు. యూపీఐ అన్నది బ్యాంక్ ఖాతాకు అనుసంధానమై ఉంటుంది. కనుక యూపీఐ యాప్ ఉన్న ఫోన్ పోతే దుర్వినియోగం ప్రమాదం ఎక్కువ. ఈ-రూపీ వ్యాలెట్‌తో ఆ రిస్క్ ఉండదు. ప్రతి లావాదేవీ టోకెనైజ్డ్ విధానంలో, యూనిక్‌గా, భద్రంగా ఉంటుంది. ఇంటర్నెట్ కనెక్టివిటీలో సమస్యలు ఉంటే టోకెన్ జారీ కాదు. లావాదేవీ తక్షణమే జరిగిపోతుంది కనుక ఫెయిల్యూర్ అవకాశాలు తక్కువ. సీబీడీసీ వినియోగం పెరిగే కొద్దీ ఆర్‌బీఐకి భారీగానే వ్యయాలు ఆదా అవుతాయి. ఎందుకంటే కరెన్సీ నోట్ల ముద్రణ కోసం చేసే ఖర్చు తగ్గుతుంది. అంతేకాదు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు భౌతిక కరెన్సీ నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి. వాటి మధ్య అంతర్గత చెల్లింపుల వ్యయాలు తగ్గుతాయి. ఆర్థిక వ్యవస్థ మరింత డిజిటల్‌గా మారుతుంది. దీని వల్ల అధికారిక ఆర్థిక కార్యకలాపాలు, లావాదేవీలు పెరుగుతాయి. దేశాల మధ్య చెల్లింపులకు అనువుగా ఉంటుంది. అందరికీ అందుబాటులోకి వచ్చిన తర్వాత దీని వ్యాప్తి, వినియోగం, సౌకర్యం, సమస్యలపై మరింత స్పష్టత వస్తుంది.

వడ్డీ రాదు..



యూపీఐ విధానానికి, ఈ రూపీకి మధ్య వ్యత్యాసాలు చాలా ఉన్నాయి. యూపీఐ అన్నది మన బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును వేరొక వ్యక్తి బ్యాంకు ఖాతాకు యూపీఐ ద్వారా బదిలీ చేయడం. కానీ, ఈ-రూపీ అలా కాదు. ఒక వ్యక్తి వ్యాలెట్ నుంచి మరో వ్యక్తి ఈ-రూపీ వ్యాలెట్‌కు బదిలీ చేసుకోవచ్చు. సాధారణంగా బ్యాంకు సేవింగ్స్ ఖాతాలో రోజువారీ బ్యాలన్స్‌పై ఎంతో కొంత వడ్డీ ముడుతుంది. కానీ, వ్యాలెట్‌లో ఉన్న ఈ-రూపీలపై వడ్డీ రాబడి ఉండదు. ఎందుకంటే ఇది బ్యాంక్ బ్యాలన్స్ కిందకు రాదు. భౌతిక కరెన్సీ మన పర్స్‌లో ఉన్న మాదిరే అని గుర్తించాలి. ఈ-రూపీ వ్యాలెట్‌లో ఉన్న బ్యాలన్స్‌ను తిరిగి బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. అప్పటి నుంచి వడ్డీ ఆదాయం వస్తుంది.

ఎక్కడ వినియోగం?

ఈ-రూపీ పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే, యూపీఐ మాదిరే దీన్ని కూడా దేశంలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం క్లోజ్ హెల్డ్ గ్రూపు పరిధిలోని వ్యక్తులు, వర్తకుల మధ్య లావాదేవీలకే పరిమితంగా ఉంది. ఏటీఎం నుంచి నగదును విత్‌డ్రా చేసుకుని, అవసరమైన చోట చెల్లింపులు చేస్తుంటాం. అదే మాదిరి ఈ-రూపీని వ్యాలెట్లలోకి లోడ్ చేసుకుని కావాల్సిన చోట చెల్లింపులు/బదిలీ చేసుకోవచ్చు.

రెండు రకాలు..

సీబీడీసీ రెండు రకాలుగా వర్గీకరణ చేశారు. రిటైల్, హోల్‌సేల్. రిటైల్ సీబీడీసీని వ్యక్తులు, ప్రైవేటు రంగం, వ్యాపార సంస్థలు ఉపయోగించుకోవచ్చు. హోల్‌సేల్ సీబీడీసీ కేవలం బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల మధ్య వినియోగానికే ప్రస్తుతం పరిమితం చేశారు. వ్యక్తుల మధ్య, వ్యక్తులు-వర్తకుల మధ్య లావాదేవీలకు ఉద్దేశించినది రిటైల్ సీబీడీసీ. హోల్‌సేల్ సీబీడీసీ అన్నది రెండు బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య లావాదేవీల సెటిల్‌మెంట్‌కు ఉద్దేశించినది.

అదనపు సాధనం

సీబీడీసీ అనేది ప్రస్తుతమున్న మరే సాధనానికి బదులుగా తీసుకొచ్చింది కాదు. అదనపు చెల్లింపు సాధనంగా, కరెన్సీకి డిజిటల్ రూపంగా తీసుకొచ్చినది మాత్రమే. వినియోగంలో సౌకర్యం, వ్యయాలు తగ్గింపు, భద్రత, రక్షణ ఎన్నో అంశాలు డిజిటల్ రూపీతో ఇమిడి ఉన్నాయి.



ఈ-రూపీ రాకతో యూపీఐ విషయంలో కొందరిలో సందేహాలున్నాయి. కానీ, ఈ రెండు వేర్వేరు సాధనాలు. దేశంలో 26 కోట్ల యూపీఐ యూజర్లు ఉన్నారు. అక్టోబర్ నెలకు 730 కోట్ల యూపీఐ లావాదేవీలు (రూ.12.11 లక్షల కోట్లు విలువైన) నమోదయ్యాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన టెక్నాలజీకి డిజిటల్ రూపీ పూర్తి భిన్నమైనది. యూపీఐ లావాదేవీల నిర్వహణలో బ్యాంక్‌ల పాత్ర ఉంటుంది. డిజిటల్ రూపీ లావాదేవీల్లో బ్యాంక్‌ల పాత్ర ఉండదు. ఇద్దరు వ్యక్తుల మధ్య కరెన్సీ మార్పిడిలో మరొకరి పాత్ర ఎలా అయితే ఉండదో.. డిజిటల్ రూపీలోనూ అంతేనని అర్థం చేసుకోవాలి. యూపీఐ లావాదేవీలను ట్రాక్ చేయగలరు. కానీ, ఇద్దరు వ్యక్తులు లేదా రెండు పార్టీల మధ్య ప్రైవేటుగా కొనసాగే సీబీడీసీ లావాదేవీలను వేరెవరూ ట్రాక్ చేయలేరు. గోప్యంగా ఉంటాయి.

యూపీఐ వర్సెస్ ఈ-రూపీ

చెల్లింపుల పరంగా యూపీఐ సౌకర్యం?

ఎవరైనా కానీ వినియోగంలో సౌకర్యాన్నే చూస్తారు. సీబీడీసీతో పోలిస్తే యూపీఐ చెల్లింపులే సౌకర్యం. ఎలా అంటే, ఉదాహరణకు రూ.47 విలువ చేసే వాటిని కొనుగోలు చేశారు. అప్పుడు చెల్లింపులు చేయాలి. యూపీఐ ద్వారా అయితే కేవలం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పిన్ ఇస్తే చాలు రూ.47 చెల్లింపు పూర్తవుతుంది. మరి ఈ-రూపీ అలా కాదు. రూ.47ను ఏ డినామినేషన్‌లో చెల్లించాలన్నది నిర్ణయించాలి. రూ.20 డినామినేషన్ రెండు, లేదా రూ.10 డినామినేషన్ నాలుగు.. ఆ తర్వాత రూ.5 డినామినేషన్ ఒకటి, రూ.2 డినామినేషనన్ ఎంపిక చేసుకుని బదిలీ చేయాలి. లేదంటే రూపాయి డినామినేషన్‌లో 47 ఈ-రూపీలను సెలక్ట్ చేసుకోవాలి. వ్యాలెట్‌లో అన్ని డినామినేషన్లలో ఈ-రూపీ ఉంటేనే చెల్లింపులు సాధ్యపడతాయి. అలా కాకుండా వ్యాలెట్‌లో కేవలం రూ.10, 20, 50 డినామినేషన్‌లోనే ఈ-రూపీలు ఉంటే రూ.47 చెల్లింపు సాధ్యపడదు. ఆటోమేటిగ్గా చెల్లింపునకు తగినట్టు డినామినేషన్ స్ప్లిట్ అయ్యి, బదిలీ అయ్యే విధానాన్ని అభివృద్ధి చేస్తే ఈ సమస్య తొలగిపోతుంది. అప్పుడు యూపీఐకి ప్రత్యామ్నాయం కాగలదు. అయినా కానీ రిటైల్ చెల్లింపులకు యూపీఐ ఎక్కువ అనుకూలం. యూపీఐ ముందుగా వచ్చి, దేశంలోని అన్ని ప్రాంతాలకూ చేరిపోయింది. దీనికి టెక్నాలజీ పెద్దగా తెలియక్కర్లేదు. బ్యాంకు ఖాతాకు వెళ్లి లోడ్ చేసుకోవక్కర్లేదు. అందుకే ఇకపైనా చెల్లింపుల్లో యూపీఐ హవా కొనసాగుతుందని విశ్లేషకుల అంచనా. బ్యాంకుల మధ్య, సంస్థల మధ్య చెల్లింపుల సెటిల్‌మెంట్‌కు, విదేశాలతో రూపాయి వాణిజ్యానికి సీబీడీసీ అనుకూలిస్తుందని చెబుతున్నారు.

రిటైల్ వాణిజ్య విధానంపై అభిప్రాయాలు చెప్పండి

మంత్రిత్వ శాఖలను కోరిన డీపీఐఐటీ



న్యూఢిల్లీ: జాతీయ రిటైల్ వాణిజ్య విధానం ముసాయిదాపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని 16 మంత్రిత్వ శాఖలు, విభాగాలను పారిశ్రామిక ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) కోరింది. రిటైల్‌లో అన్ని రకాల విభాగాలు వృద్ధి చెందాలన్నదే నూతన విధానం లక్ష్యమని ఓ అధికారి చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం, కేంద్ర కేబినెట్ ఆమోదానికి దీన్ని పంపించనున్నట్టు తెలిపారు. అంతర్జాతీయంగా పోటీ పడే విధంగా, రిటైల్ వాణిజ్యం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో ఈ విధానాన్ని రూపొందించినట్టు పేర్కొన్నారు. రుణాలను వేగంగా, సులభంగా పొందగలగడం, నూతన టెక్నాలజీ సాయంతో రిటైల్ వాణిజ్యం డిజిటైజేషన్, ఆధునికీకరణ, పంపిణీ చైన్ సదుపాయాలను అభివృద్ధి చేయడం, నైపుణ్యాల అభివృద్ధి, కార్మికుల ఉత్పాదకత పెంపు, సమర్థవంతమైన సంప్రదింపులు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఈ విధానంలో భాగంగా ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
26-12-2022	
విశాఖ	568-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	538-00
విజయవాడ	538-00
రిటైల్ ధర (డజను)	78.00
25-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	538-00
వరంగల్	540-00
రిటైల్ ధర	6.00

సిర్మా ఎస్‌జీఎస్ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 255 టార్గెట్: రూ. 364

ఎందుకంటే: టర్న్‌కీ ఎలక్ట్రానిక్స్ తయారీ సర్వీసుల కంపెనీ సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ ప్రెసిషన్ తయారీలో ప్రత్యేకతను కలిగి ఉంది. ప్రధానంగా ఇండస్ట్రియల్ అప్లయెన్సెస్, ఆటోమోటివ్, హెల్త్ కేర్, కన్జూమర్ ప్రొడక్ట్స్, ఐటీ పరిశ్రమలలో ప్రొడక్టులను వినియోగిస్తారు. ఫ్లెక్సీ మిక్స్‌ఫ్లో ప్రొడక్టుల ద్వారా ఎండ్ యూజ్‌లో ప్రత్యేకతను చాటుకుంటోంది. వెరసి అధిక మార్జిన్లుగల ప్రొడక్టులను రూపొందిస్తోంది. కంపెనీ ప్రొడక్టు పోర్ట్‌ఫోలియోలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ అసెంబ్లీస్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ తదితరాలున్నాయి. వీటితోపాటు మదర్ బోర్డులు, డీఆర్ఏఎం మాడ్యూల్స్, సోలిడ్ స్టేట్ డ్రైవ్స్, యూఎస్‌బీ డ్రైవ్స్, ఇతర మెమొరీ ప్రొడక్టులను సైతం తయారు చేస్తోంది. ప్రస్తుతం ఐదు రాష్ట్రాలలో వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన 13 తయారీ యూనిట్ల ద్వారా ప్రొడక్టులను రూపొందిస్తోంది. గతేడాది(2021-22) సగటు సామర్థ్య వినియోగం 75-80 శాతంగా నమోదైంది. కొత్త ప్లాంట్లలో అయితే 50 శాతాన్నే వినియోగించుకుంది. మొత్తం టర్నోవర్‌లో ఓడీఎం విభాగం 27 శాతాన్ని ఆక్రమిస్తుండటం, 40 శాతం ఎగుమతులు, బలమైన ఆర్డర్‌బుక్ వంటి అంశాలు రానున్న రెండేళ్లలో మరింత మెరుగైన పనితీరుకు దారి చూపనున్నాయి. 2022-24 కాలంలో ఆదాయం 34 శాతం, ఇబిటా 44 శాతం, నికర లాభం 55 శాతం చొప్పున జంప్ చేయగలవని అంచనా. వెరసి పోటీ సంస్థలకంటే అధిక లాభదాయకతను సాధించే అవకాశముంది.



హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ | జెఫరీస్ ఈక్విటీ రీసెర్చ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 696 టార్గెట్: రూ. 900

ఎందుకంటే: వేగంగా వృద్ధి చెందుతున్న అందుబాటు గృహ రుణ కంపెనీలలో ఒకటి హోమ్ ఫస్ట్ ఫైనాన్స్. రానున్న మూడేళ్లలో 30 శాతం రుణ వృద్ధిని సాధించగలదని అంచనా. ఇందుకు అత్యున్నత ప్రొడక్టివిటీ, పంపిణీ నెట్‌వర్క్‌ను 60 శాతం విస్తరించడం సహకరించే వీలుంది. దీంతో 2022-2025 కాలంలో నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) వార్షికంగా 28 శాతం స్థాయిలో పుంజుకోగలదని భావిస్తున్నాం. ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడటం ద్వారా రుణ వ్యయాలు తగ్గనున్నాయి. 13 రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) రూ. 6,300 కోట్లకు చేరాయి. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు నుంచే 65 శాతం ఏయూఎంను కలిగి ఉంది. రానున్న మూడేళ్లలో హౌసింగ్‌కు డిమాండ్ కొనసాగనుంది. చౌక గృహ రుణాలలో 17-18 శాతం వృద్ధికి అవకాశముంది. వెరసి వార్షికంగా 30 శాతం రుణ పురోగతికి మద్దతు లభించనుంది. ఇటీవల రేటింగ్‌లో ఏఏ- నుంచి ఏఏ+కు అప్‌గ్రేడ్‌ను పొందడం, గృహేతర రుణ విభాగంపైన దృష్టి పెట్టడం వంటి అంశాలు మార్జిన్లకు బలాన్నివ్వనున్నాయి. మూడేళ్ల కాలంలో ఈపీఎస్‌లో 24 శాతం వృద్ధి నమోదుకాగలదని భావిస్తున్నాం. ఆర్‌వోఏ 3.4 శాతానికి ఎగువనే కొనసాగే వీలుంది. ప్రస్తుత 12 శాతం ఆర్‌వోఈ 15 శాతానికి పుంజుకోనుంది. కార్యకలాపాల విస్తరణ నేపథ్యంలో అధిక నిర్వహణ వ్యయాలు, బ్యాలన్స్ ట్రాన్స్‌ఫర్‌లు, స్లిప్పేజీలు వంటి అంశాలు సవాళ్లు విసిరే అవకాశముంది.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

సీనియర్ సిటిజన్ల కోసం బజాజ్ అలయాంజ్ రైడర్

హైదరాబాద్: ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ బజాజ్ అలయాంజ్ తాజాగా సీనియర్ సిటిజన్ల కోసం 'రెస్పెక్ట్ సీనియర్ కేర్' రైడర్‌ను ప్రవేశపెట్టింది. మూడు ప్లాన్లలో ఇది అందుబాటులో ఉంటుంది. దీనికి ప్రీమియం రూ. 700 నుంచి రూ. 7,500 వరకూ (జీఎస్‌టీ కాకుండా) ఉంటుందని సంస్థ తెలిపింది. ప్లాన్‌ను బట్టి ఎమర్జెన్సీ రోడ్ అంబులెన్స్ సర్వీస్, స్మార్ట్ వాచ్ ఫాల్ డిటెక్షన్, ఫిజియోథెరపి.. నర్సింగ్ కేర్ తహా హోమ్ కేర్ సర్వీసులు, మెడికల్ టెలీ-కన్సల్టేషన్ సర్వీసులు మొదలైనవి ఈ రైడర్‌తో పొందవచ్చని కంపెనీ ఎండీ తపన్ సింఘెల్ తెలిపారు. 50 ఏళ్లు పైబడి, కంపెనీ అందించే బేస్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ఉన్న వారు ఈ రైడర్‌ను ఎంచుకోవచ్చు.



రియల్ ఎస్టేట్ మెరుగైన పెట్టుబడి సాధనమేనా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

డివిడెండ్ రీఇన్వెస్ట్‌మెంట్ పథకాల పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

– మంజునాథ్

డివిడెండ్ రీఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు పన్ను పరంగా అనుకూలం కాదు. ఫండ్ సంస్థ డివిడెండ్ ప్రకటించినప్పటికీ అది ఇన్వెస్టర్ బ్యాంకు ఖాతాకు రాదు. ఆ మొత్తం ఆటోమేటిక్‌గా అదే పథకంలో పెట్టుబడిగా మారిపోయి యూనిట్లు జమ అవుతాయి. దాంతో డివిడెండ్ విలువకు సరిపడా యూనిట్లను పొందుతారు. ఈ కార్యక్రమం మొత్తం మీద చేతికి వచ్చే డివిడెండ్ ఏమీ లేకపోయినా పన్ను మాత్రం చెల్లించాల్సి వస్తుంది. ఐటీ రిటర్నులు దాఖలు చేసినప్పుడు మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల డివిడెండ్ ఆదాయాన్ని కూడా చూపించి పన్ను చెల్లించాల్సిందే. ఇన్వెస్టర్లు తమకు వర్తించే శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక ఇన్వెస్టర్లకు గ్రోత్ ప్లాన్ మెరుగైన ఎంపిక అవుతుంది.

పెట్టుబడి కోసం రియల్ ఎస్టేట్ మెరుగైన సాధనమేనా? ఇతర ఉత్పత్తులతో దీన్ని ఎలా పోల్చి చూడాలి?


– శివమ్ కంది

రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడి సాధనంగా నేను భావించడం లేదు. ఇల్లు అయితే ఒక కుటుంబం నివసించేందుకే గానీ, పెట్టుబడిగా చూడకూడదు. ఒక్కసారి ఇల్లు కొనుగోలు చేసి, దానిలో నివసిస్తుంటే విలువ పెరుగుతుందా? లేక తగ్గుతుందా అన్నది పట్టింపు కాదు. పెట్టుబడిగా రియల్ ఎస్టేట్‌కు కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. పెట్టబడి పరిమాణం అధికంగా కావాల్సి ఉంటుంది. ఇతర సాధనాలతో పోలిస్తే లిక్విడిటీ (నగదుగా మార్చుకునే సౌలభ్యం) తక్కువగా ఉంటుంది. దీంతో కోరుకున్నప్పుడు విక్రయించుకునే వీలు ఉండకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడిలో సవాళ్లు ఉంటాయి. ఒకవేళ ప్రాపర్టీని అద్దెకు ఇస్తే కిరాయిదారు రూపంలో ఇంటి నిర్వహణ సక్రమంగా కొనసాగొచ్చు. అలా చూస్తే ఇల్లు మంచి పెట్టుబడే అవుతుంది. ఎందుకంటే ద్రవ్యోల్బణంతోపాటే అద్దె కూడా పెరుగుతూ వెళుతుంది. అదే సమయంలో ప్రతికూలతలూ కనిపిస్తాయి. ఇల్లు ఎంత గొప్పది అయినా 20 ఏళ్ల తర్వాత డిమాండ్ తగ్గుతుంది. అద్దెకు ఉండేవారు ఆధునికమైన, కొత్త ఇంటి కోసం ప్రాధాన్యం ఇస్తుంటారు. కనుక రియల్ ఎస్టేట్ విలువ పెరిగినా కానీ, దానికి అనుగుణంగా అద్దె రాబడి మెరుగ్గా ఉండదు. అందుకే ప్రాపర్టీని కొనుగోలు చేసే ముందు ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలి. నా సలహా ఏమిటంటే రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడిగా కాకుండా నివాసంగానే చూడండి.

ఇటీవలి కరోనా కొత్త రకం ముప్పు నేపథ్యంలో నా పెట్టుబడుల వ్యూహం ఎలా ఉండాలి? ఈక్విటీ నుంచి డెట్‌కు పెట్టుబడి మార్చుకోవాలా?

– రమాకాంత్

ఈక్విటీ నుంచి డెట్‌కు పెట్టుబడులను పూర్తిగా మార్చుకోవద్దు. 2020 మార్చిలో ఏం జరిగిందో గుర్తు చేసుకోండి. మార్కెట్ అదే పనిగా పడిపోయింది. దీంతో చాలా మంది భయపడి పెట్టుబడులను వెనక్కి తీసేసుకున్నారు. ఆ తర్వాత అసాధారణమైన లాభాలను చూశాం. ఈక్విటీలను ఊహించడం కష్టం. అవి ఎప్పుడూ అస్థిరంగా, అంచనాలకు భిన్నంగా ఉంటాయి. ఒకవేళ మీరు దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసి ఉంటే, వచ్చే ఐదేళ్లపాటు పెట్టుబడితో అవసరం లేకుంటే, కరెక్షన్ గురించి భయపడాల్సిన పనిలేదు. దీనికి బదులు మీరు అస్సెట్ అలోకేషన్ ప్రణాళికపై దృష్టి పెట్టండి. ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడుల కేటాయింపులను నిర్ణయించుకోండి. డెట్‌లో 30 శాతం పెట్టుబడులను ఉంచాలనుకుంటే.. మొత్తం పెట్టుబడుల్లో ఆ మేరకు డెట్ విభాగంలోకి మళ్లించండి. దాంతో ఏదైనా అసాధారణ మార్పులు చోటు చేసుకుంటే అస్సెట్ అలోకేషన్ ప్రణాళిక మేరకు ఈక్విటీ, డెట్ మధ్య పెట్టుబడులను రీబ్యాలన్స్ చేసుకోవచ్చు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.